www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 27, సంచిక: 115 | బుధవారం | 09-10-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00











## ప్రజాపాలనలో నెరవేరుతున్న యువత కలలు

**6,956** — 31 జనవరి, 2024
నర్సింగ్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు

**441** — 07 ఫిబ్రవరి, 2024
సింగరేణిలో కారుణ్య నియామకాలు

**13,444** — 14 ఫిబ్రవరి, 2024
పోలీస్, ఫైర్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, జైళ్ల శాఖ

**1,997** — 15 ఫిబ్రవరి, 2024
లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీజీటీలు

**5,192** — 04 మార్చి, 2024
లెక్చరర్లు, టీచర్లు, మెడికల్ సిబ్బంది

**687** — 26 సెప్టెంబర్, 2024
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు

**1,635** — 06 అక్టోబర్, 2024
లైబ్రేరియన్లు, పీఈటీలు, ఏఈఈలు, వ్యవసాయ అధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు

**కొలువుల తెలంగాణ.. యువత భవితకు చిరునామా!**

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
బుధవారం, అక్టోబరు 09


# హర్యానా, కశ్మీర్ ఫలితాలు
## గతి తప్పిన ఎగ్జిట్‌పోల్స్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పరిశీలకులందరికీ ఆశ్చర్యం గొలిపాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంద న్న ఊహాగానాలు, అంచనాలను, ఎగ్జిట్‌పోల్స్‌ను తలకిందులు చేసి హర్యానా ఓటర్లు బిజెపికి వరుసగా మూడవసారి అధికారమిచ్చి హిందీ బెల్ట్ నాడిని సూచనప్రాయంగా వ్యక్తీకరించారు. కాగా జమ్మూ–కశ్మీర్‌లో ఎటువంటి అనిశ్చితి, సందిగ్ధాలకు, వ్యూహాలకు తావులేకుండా ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్ కూటమికి పట్టం కట్టారు. ఎన్‌సి ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. గత ఎన్నికలో (2014) 28 సీట్లు గెలుచుకుని బిజెపితో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ నేత మెహబూబ ముఫ్తి పార్టీని శిక్షించినట్లుగా ఓటర్లు 3 సీట్లకు పరిమితం చేశారు. కాంగ్రెస్ ఒంటెత్తుపోకడ పోకుండా ఎన్‌సితో పొత్తు పెట్టుకుని 6 సీట్లు గెలిచి పరువునిలుపుకుంది. ఎన్నికలు జరిగిన 90 సీట్లలో ఎన్‌సి 42, బిజెపి 29 గెలుచుకున్నాయి. రికార్డు స్థాయిలో 58 శాతంపైగా ఓటర్లు ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్యంలో విశ్వాస ముంచారు. కశ్మీరీయుల్లో పరాయీకరణను పారద్రోలాలంటే మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినట్లుగా రాష్ట్ర ప్రతిపత్తిని వెంటనే పునరుద్ధరించి గవర్నర్ పెత్తనానికి చరమగీతం పాడాలి.

హర్యానాలో బిజెపి ఎత్తుగడలు, వ్యూహాలు, సంస్థాగత నిర్మాణం దానికి అనూహ్యమైన ఫలితమిచ్చాయి. ప్రభుత్వ వ్యతిరేకతను గ్రహించి లోక్‌సభ ఎన్నికలకు ముందు మనోహర్‌లాల్ కట్టార్‌ను తొలగించి ఒబిసికి చెందిన నయబ్ సింగ్ శైనిని మార్చి నెలలో ముఖ్యమంత్రిని చేసింది. జాట్ రైతాంగం కేంద్రానికి వ్యతిరేకంగా నిరంతర ఆందోళనలో ఉన్నందున ఆ సామాజిక తరగతిలో తమకు ప్రతికూలతను గ్రహించిన బిజెపి అధినాయకత్వం ఈ మార్పు చేసింది. అప్పటి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జననాయక్ జనతా పార్టీ తెగతెంపులు చేసుకుంది. అదీ చౌతాలా వారసులు నాయకత్వం వహిస్తున్న జాట్‌లపార్టీ. అప్పటినుండి దళితులు సహా జాట్‌యేతర కులాల సమీకరణపై కేంద్రీకరించింది. పార్లమెంటు ఎన్నికల్లో 5 సీట్లు మాత్రమే గెలుచుకుని ఐదింటిని కాంగ్రెస్‌కు కోల్పోయింది. ఇది కాంగ్రెస్‌కు లేని ఆశలు పెంచింది. పార్లమెంటు సీట్లలో పోలింగ్ ఆధారంగా కాంగ్రెస్ 42, బిజెపి 44 సెగ్మెంట్స్‌లో ఆధిక్యత పొందాయి. బిజెపి తన సాంప్రదాయక హిందూత్వ కార్డుతోపాటు ఒబిసి తదితర సామాజిక తరగతులపై దృష్టిపెట్టింది. ముఖ్యమంత్రి శైని ఆ తరగతులకు అనేక పథకాలు ప్రకటించారు. పర్యవసానంగా జెజెపి తదితరులను దెబ్బతీసి బిజెపి లబ్దిపొందింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న 40 స్థానాలను అనూహ్యంగా 48కి పెంచుకుంది. జెజెపి 10సీట్లూ కోల్పోయింది.

కాంగ్రెస్ శాసనసభలో తన బలాన్ని 31నుంచి 37కు పెంచుకున్నా అది అధికారంపై పెట్టుకున్న ఆశలు నెరవేరకపోవటం దానికి తీవ్రమైన ఆశాభంగం. అతిశయించిన ఆత్మవిశ్వాసం, పార్టీ ప్రచారంలో బయటపడిన వైరుధ్యాలు, దళిత ముఖమైన కుమారి షెల్జ చివరి రోజుల్లోగాని ప్రచారంలోకి రాని స్థితి, మాజీ ముఖ్యమంత్రి, జాట్ నాయకుడు భూపిందర్ సింగ్ హుడాపై అధిష్టానం అతిగా ఆధారపడటం, సింగ్, షెల్జా, సూర్జీవాలా ముఖ్యమంత్రిత్వంపై పేచీతో భిన్న కేంద్రాలుగా పనిచేయటం, వీటన్నిటికీ తోడు పునాది స్థాయిలో సంస్థాగత నిర్మాణం లేకపోవటం కాంగ్రెస్ పాలిట శాపమైనాయి. ఈ స్థితి హిందీ బెల్టులోని ఇతర రాష్ట్రాల్లోకూడా కాంగ్రెస్‌ను పీడిస్తున్నది. హిందీ రాష్ట్రాల్లో ఇతర ప్రాంతీయ పార్టీలపై ఆధారపడితేనే దానికి మనుగడ. అందువల్ల ఇండియా కూటమిని పటిష్టంగా, క్రియాశీలంగా ఉంచుకోవటం దానికి అవసరం. అందుకు పట్టువిడుపులతో వ్యవహరించటం అవసరం. కూటమిలోని ఇతర పార్టీలు కూడా తమ బలం గూర్చి అతిశయించిన అంచనాలకు పోకుండా బిజెపిని ఓడించే ఉమ్మడి లక్ష్యం మరువకుండా సర్దుబాటుధోరణి పాటించటం అవసరం. ఉదాహరణకు ఆమ్ ఆద్మీ పార్టీని తీసుకుందాం. హర్యానాలో కాంగ్రెస్‌తో చర్చలు జరిపింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుతో ఒక సీటుకు పోటీచేసి గెలవకపోయినా అందులోని 3 సెగ్మెంట్లలో మెజారిటీ ఓట్లు సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 5 సీట్లు కేటాయిస్తామన్నా ఎక్కువ సీట్లు డిమాండ్ చేసి తెగతెంపులు చేసుకుని 80 సీట్లకు పోటీచేసింది. ఒక్కసీటూ రాలేదు. ఇదొక ఉదాహరణ, గుణపాఠం. రానున్న మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఆ పైన ఢిల్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు వాస్తవిక దృష్టితో, ఉమ్మడి లక్ష్యంతో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో నడుచుకోకపోతే నష్టపోతాయి.

# అమెరికా రేవు కార్మికుల విజయం!


డి.సోమసుందర్

వేతనాల పెంపుదలపై యాజమాన్యానికి, కార్మికులకు అంగీకారం కుదరటంతో యాభై వేలమంది అమెరికా రేవు కార్మికులు సమ్మెను తాత్కాలికంగావిరమించారు. మూడు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు శుక్రవారం మధ్యాహ్నం నుండి విధులకు హాజరయ్యారు. రేవుల్లో కార్మికులు పనుల్లోకి రావడంతో అక్కడ పండుగ వాతావరణం నెల కొన్నది. 'కార్మికుల డిమాండ్ల విషయంలో ఒక అంగీకారం కుదిరింది, శుక్రవారం నుండి ఓడరేవుల్లో ఎగుమతి దిగుమతి పనులు తిరిగి ప్రారంభం అవుతాయి' అంటూ యాజమానుల సంస్థ యునైటెడ్ స్టేట్స్ మారిటైమ్ అలయన్స్ (యు.ఎస్.ఎం.ఎక్స్), సమ్మెకు నాయక త్వం వహించిన ఇంటర్నేషనల్ లాంగ్ షోర్ మెన్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఎ.) గురువారం రాత్రి ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. **అమెరికా తూర్పు తీరం, గల్ఫ్ తీరంలోని** ముప్పై నాలుగు ఓడరేవుల్లో పనిచేసే యాభై వేల మంది కార్మికులకు ఇంటర్నేషనల్ లాంగ్ షోర్ మెన్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఎ.) ప్రాతినిధ్యం వహిస్తున్నది. కార్మికుల వేతనాలను 77 శాతం వరకూ పెంచాలని యూనియన్ కోరగా యాభైశాతం మాత్రమే పెంచుతామని యాజమాన్య సంస్థ చెప్పింది. ఉద్యోగ భద్రతకు ముప్పు తెస్తున్న ఆటోమేషన్ ను పూర్తిగా విరమించాలని యూనియన్ కోరగా దానిపై చర్చించే ప్రసక్తే లేదని యాజమాన్యం భీష్మించింది. దాంతో సమ్మె తప్పలేదు. మూడురోజుల సమ్మె అనంతరం వేతనాలను 62 శాతం మేరకు పెంచడానికి యాజమాన్యాల సంస్థ అంగీకరించింది. రేవుల యాంత్రికీకరణ, కార్మికుల ఉద్యోగ భద్రత సమస్యపై సంప్రదింపులు కొనసాగించడానికి యాజమాన్యం సుముఖత చూపింది. దాంతో సమ్మె విరమణకు ప్రాతిపదిక ఏర్పడింది. అయితే యాంత్రికీకరణ విషయమై ఒప్పందంలో పొందుపరిచే పారిభాషిక పదజాలం విషయంలో పీటముడి పడింది. ఇరుపక్షాల మధ్య తుది ఒప్పందం కుదరలేదు. తాత్కాలికంగా సమ్మెను విరమిస్తూ జనవరి 15వ తేదీన సంప్రదింపుల ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు ఇరు పక్షాలు ఒక అంగీకారానికి వచ్చాయి. వేతనాలు పెంపుదల 62 శాతం ఉండాలనే అంశాన్ని ఖరారు చేస్తూ అంగీకారం కుదిరిందని చర్చల్లో పాల్గొన్న కార్మికశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే తిరిగి చర్చలు ప్రారంభం అయ్యేవరకూ పాత వేతన ఒప్పందమే అమల్లో ఉంచడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. అమెరికా వాటర్ ఫ్రంట్ పరిశ్రమలో వేతన ఒప్పందం ప్రతీ ఆరేళ్లకు ఒకసారి జరుగుతూ ఉంటుంది.

2018లో చేసుకున్న ఒప్పందం గడువు 2024, సెప్టెంబర్ 30తో ముగిసింది. నూతన వేతన ఒప్పందం కోరుతూ ఐ.ఎల్.ఎ. జూన్ లోనే నోటీసు ఇచ్చింది. అప్పటి నుండి డిమాండ్ నోటీసుపై పలు దఫాలు చర్చలు జరిగినా పరిష్కారం లభించలేదు. దాంతో అక్టోబర్ ఒకటో తేదీ రాత్రి నుండి కార్మికులు సమ్మెలోకి దిగారు. మొత్తం ముప్పై నాలుగు రేవుల్లో ఎగుమతి దిగుమతులు నిలిచిపోయాయి. దేశంలో ఓడరేవుల్లో జరిగే ఎగుమతి దిగుమతులు నెలకు మూడు లక్షల టన్నుల వరకూ ఉంటాయని అంచనా! మూడురోజుల సమ్మెతో రేవుల్లో అప్పటికే నిలిచి ఉన్న ఓడ లు కాకుండా మరో 54 ఓడలు రేవుల బైట దూరంగా సముద్రంలో నిలిచిపోయాయి. సమ్మెతో ఇప్పటికే పరిశ్రమకు 15 బిలియన్ డాలర్ల నష్టం సంభవించిందని అంచనా. త్వరలో హాలోవిన్, థాంక్స్ గివింగ్, క్రిస్మస్ పండుగల సీజను ప్రారంభం కానున్న తరుణంలో దిగుమతులు నిలిచిపోతే వ్యాపారాలు దెబ్బతింటాయని నేషనల్ రిటైలర్స్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే అమెరికాలో మాంద్యం పరిస్థితులు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కనీసం రెండువారాల పాటైనా కొనసాగవచ్చన్న అంచనాలతో సమ్మె ప్రారంభం అయ్యింది. సమ్మె కొనసాగితే సరుకుల కొరత ఏర్పడుతుందని, ధరలు పెరుగుతాయని, ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మీడియా అంచనా వేసింది. నవంబర్ 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల ముందు ఇలాంటి పరిణామాలు జరగడం మంచిది కాదని జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్ గట్టిగా భావించింది. కార్మికుల డిమాండ్లకు బహిరంగ మద్దతు ప్రకటించిన జో బైడెన్ సమ్మె పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సీనియర్ అధికారులను ఆదేశించారు. డోనాల్డ్ ట్రంప్ కూడా కార్మికులకు మద్దతు ప్రకటించారు. కానీ రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు మాత్రం సమ్మె విరమించే విధంగా కార్మికులను ఆదేశించే టర్ట్ హార్ట్ లీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. టర్ట్ హార్ట్ లీ చట్టంలోని నిబంధన ప్రకారం ఎనభై రోజులపాటు సమ్మెను లేదా లాకౌట్‌ను నిలిపి



వేస్తూ అధ్యక్షుడు చర్యలు తీసుకోవచ్చు. రిపబ్లికన్ వర్గాలనుండి, యాజమాన్యాల నుండి ఎంత ఒత్తిడి వచ్చినా 'రేవు కార్మికుల సమ్మెపై టర్ట్ హార్ట్ లీ నిబంధనను అమలు జరిపేది లేదని' అధ్యక్షుడు జో బైడెన్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. సంప్రదింపుల ప్రక్రియ ద్వారానే సమ్మెకు పరిష్కారం కావాలని ఆయన స్పష్టం చేశారు. జో బైడెన్ ఆదేశాల మేరకు అధ్యక్షుని ప్రతినిధి ఒకరు, సెక్రటరీ ఆఫ్ లేబర్, లేబర్ వ్యవహారాల సెనేట్ కమిటీ చైర్మన్, రంగంలోకి దిగి ఇరుపక్షాలు సంప్రదింపులకు కూర్చునేటట్లు కృషి చేశారు. దాంతో ప్రస్తుత తాత్కాలిక ఒప్పందం కుదిరింది.

సెప్టెంబర్ 30న గడువు ముగిసిన ఒప్పందం ప్రకారం రేవు కార్మికుడు ఇప్పటివరకూ గంటకు 39 డాలర్లు చొప్పున వేతనంగా పొందుతున్నారు. కొత్త ఒప్పందం ప్రకారం గంటకు ఐదు డాలర్ల మేరకు వేతనం పెరుగుతుంది. తొలి ఏడాది ప్రతి గంటకు 44 డాలర్లు, రెండో ఏడాది గంటకు 49 డాలర్లు, మూడో ఏడాది గంటకు 54 డాలర్లు, నాలుగో ఏడాది గంటలు 59 డాలర్లు, ఐదో ఏడాది గంటకు 64 డాలర్లు, ఆరో ఏడాది గంటకు 69 డాలర్లు చొప్పున వేతనం చెల్లిస్తారు. రోజుకు ఎనిమిది గంటలు పని దినం. మామూలు రోజుల్లో ఓవర్ టైమ్ చేస్తే ఒకటింబావు రెట్లు, సెలవు రోజుల్లో పనిచేస్తే ఒకటిన్నర రెట్లు వేతనం చెల్లిస్తారు. ఇదికాక కంటెయినర్ రాయల్టీ, ఆరోగ్య బీమా వాటా, ఉద్యోగ విరమణ లబ్ధి, పింఛను చెల్లింపు వంటి అమల్లో ఉన్న సదుపాయాలకు యాజమాన్యాలు తమ వంతు వాటాను చెల్లిస్తాయి. ఈ మొత్తాన్ని కూడా పెంచడానికి అంగీకారం కుదిరింది. జనవరి నాటి సంప్రదింపులు ముగిసి, తుది ఒప్పందం కుదిరాక వీటి అమలు ప్రారంభం అవుతుంది. అందుకే సమ్మెను తాత్కాలికంగా మాత్రమే విరమిస్తున్నామని యూనియన్ పేర్కొన్నది. జనవరిలో తుది ఒప్పందం ఖరారు కాకపోయినా, ప్రస్తుతం కుదిరిన తాత్కాలిక ఒప్పందంపై జరిగే బ్యాలెట్‌లో యూనియన్ సభ్యుల ఆమోదముద్ర పడకపోయినా తిరిగి సమ్మె చేసే హక్కు ను యూనియన్ తనవద్ద అట్టే పెట్టుకున్నది. **అమెరికా పశ్చిమ తీర ప్రాంత** రేవు కార్మికులకు వేరే సంఘం ఉంది. వారి వేతన ఒప్పందం గత సంవత్సరమే కుదిరింది. తూర్పు తీరం, గల్ఫ్ తీరంలోని రేవు కార్మికులు మాత్రం తాజా ఒప్పందం ప్రకారమే వేతనాల పెంపుదలను పొందుతారు.

సమ్మె ప్రారంభం అయ్యాక యూనియన్ నేతల పై విషం కక్కుతూ అమెరికా మీడియా వార్తా కథనాలు వ్యాప్తి చేసింది. ఇంటర్నేషనల్ లాంగ్ షోర్ మెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హెరాల్డ్ జే డాగెట్ కు ఏటా తొమ్మిది లక్షల డాలర్ల వేతనం వస్తుందని, ఆయనకు 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల విలాసవంతమైన భవనం ఉందని, మాఫియా అధిపతులతో సంబంధాలు ఉన్నాయని, హత్య కేసులో ముద్దాయి అంటూ మీడియాలో కథనాలు ప్రసారం అయ్యాయి. కొన్ని పత్రికలు అసందర్భంగా ఆయన ఇంటి అడ్రసుని, ఇంటి ఫోటోను, కుటుంబ సభ్యుల ఫోటోలను కూడా ప్రచురించాయి. 'సమ్మె విషయంలో తనకూ యూనియన్ ఆఫీస్ బేరర్లకూ బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని' హెరాల్డ్ జే డాగెట్ వెల్లడించారు. 'సమ్మె సమయంలో తమ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయడం సహజమేనని, వాటిని పట్టించుకోకుండా తమ పోరాటం కొనసాగిస్తామని' విలేకరుల సమావేశంలో హెరాల్డ్ డాగెట్ స్పష్టం చేశారు. 'తమ యూనియన్ అధ్యక్షుని వ్యక్తిగత భద్రతకు ముప్పుతెచ్చే విధం గా చిరునామాను, ఇంటి ఫోటోలను, కుటుంబ సభ్యుల ఫోటోలను ప్రచురించడం' పై పత్రికలపై తగు చర్యలు తీసుకుంటామని యూనియన్ న్యాయ వ్యవహారాల ప్రతినిధి స్పష్టం చేసారు. అమెరికా తూర్పు తీరం, గల్ఫ్ తీరంలోని ఓడ రేవుల్లో ఆఖరు సారిగా 1977లో కార్మికుల సమ్మె చేసారు. తిరిగి నలభై ఏడేళ్ల తర్వాత వేతనాలు పెంపుదల కోసం, ఉద్యోగ భద్రత కోసం రేవు కార్మికులు చారిత్రాత్మక సమ్మెకు దిగడం కార్మికోద్యమంలో ఒక నూతన పరిణామంగా చెబుతున్నారు.

ఐ.ఎల్.ఎ. వామపక్ష భావజాలానికి దూరంగా ఉంటుందన్న పేరు పొందింది. సమ్మె సందర్భంగా యూనియన్ నేతలు చేసిన ప్రసంగాలు ఆసక్తికరంగా ఉన్నాయి. 'కార్పొరేట్ దోపిడీ', 'శ్రమ దోపిడీ', 'కార్పొరేట్ శక్తుల ధనదాహం', 'అంతర్జాతీయ కార్పొరేట్ శక్తుల దోపిడీ', 'లాభాలలో కార్మికుల న్యాయమైన వాటా', 'యంత్రాలు కుటుంబాలను పోషించవు' 'మేం ప్రజలకు ఇన్నేళ్ళూ సేవ చేస్తూ వచ్చాం, ఇప్పుడు ప్రజలు మాకు మద్దతు ఇవ్వాలి' వంటి మాటలను వినియోగించడం విశేషం.

# గాయమే... సుద్దాల గేయమై



ఈ నెల 10న ప్రజాకవి సుద్దాల హనుమంతు వర్ధంతి

విప్లవ వీణలో రాగ చంద్రికలై ... సుద్దాల పాట ప్రతిధ్వనిస్తుంది. నిజాం ముష్కర పాలకుల దాష్టీకాలతో రుధిరంతో తడిసి ముద్దయిన అరుణ పతాకాన్ని గుండెల నిండ అద్దుకొన్న ప్రజా కవి సుద్దాల హనుమంతు. సుద్దాల కాదు... అది యుద్దాల. మట్టి మనుషుల త్యాగాల పరిమళాలు వెదజల్లిన జన్మ భూమి, రుద్ర భూమి. సుద్దాల ఎర్ర మల్లెలు పూయించిన త్యాగధనుల పురిటిగడ్డ. గాయాలు.. స్వేచ్ఛా గేయాలై పాట కష్ట జీవుల బుద్ధి జీవుల హృదయాల అంచుల్లో విప్లవ గీతమై వెలుగొందుతుంది. భగత్ సింగ్, మాటల్లో చెప్పాలంటే 'నేను మరణించిన ప్రజల హృదయాల్లో విప్లవ గేయమై నిలుస్తా.... ఎర్ర పూల వనంలో పువ్వునై పూస్తా' నంటూ చెప్పిన విప్లవ నినాదం సుద్దాల హనుమంతుకు అక్షరమై నిలుస్తుంది. పల్లెటూరి పిల్లగాడ... సై సై గోపాల రెడ్డి — నిలిచావు ప్రాణాలొడ్డి అన్న పాటలు సుద్దాల పాడి తెలంగాణ సాయుధ సంగ్రామంలో పీడితులను కార్యోన్ముఖులను చేశాడు. ప్రజా కవి సుద్దాల హనుమంతు 1982 అక్టోబర్ 10న భౌతికంగా దూరమైనా, ఆయన పాట, మాట భౌతికంగా దరువు చప్పుళ్ళ మధ్య పోరు గీతమై వినిపిస్తోంది. సుద్దాల యుద్ధగీతమై సాయుధ యుద్ధ భూమిలో బుర్రకథ, యక్షగానంతో తెలంగాణ జనావళిని కదలించాడు. ఉద్యమాలకు పోరు కెరటమై నిలిచాడు. నిద్రాణంగా వున్న జనాన్ని ఉద్యమాల బాట వైపు నడిపించిన ప్రజా కళాకారుడు సుద్దాల హనుమంతు. సుద్దాల ప్రజల గుండెను కదిలిస్తే పలికే పదాలు.. సుద్దాల హనుమంతు సూర్యుడైరాంగా.... సూర్యుడై పోంగా... జానపదాలు భాసించేనల్లో.. ఘోషించినల్లో పాటవినిపిస్తుంది. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి, దోపిడి, అణచివేతకు గురవుతున్న జనావళికి విముక్తి చేయడానికి ప్రజా కళారూపాలతో ప్రజలను సమరానికి ఉద్యుక్తులను చేసిన ప్రజా కళాకారుడు సుద్దాల హనుమంతు (అసలు పేరుగుర్రం హనుమంతు).

కలాన్ని గళాన్ని మమేకం చేసి గడప, గడపను పలకరించి, గుండె గుండెను తట్టి లేపిన సుద్దాల బూజుపట్టిన నిజాం నిరంకుశ పాలకుల కోట గోడలను కూల్చివేసే జనగీతం పాడారు. అలాంటి ప్రజాగాయకుడి వర్ధంతి ఈ నెల అక్టోబర్ 10న జరుపుకోనున్నాము. 1982 అక్టోబర్ 10న ఆ జానపద కళారేడు హస్తమించి 42 ఏళ్ళు గడిచింది. 'కళ కళ కోసం కాదు.. కళ ప్రజల కోసం... సకల కళ రూపాలు జన చైతన్యాన్ని కల్పించే బలమైన సాధనాలు' అని విశ్వసించే ప్రజాకళాకారుడు సుద్దాల. కానీ హనుమంతు పాటరాసి, పాడి జనావళిని కదిలించి సాయుధ పోరుకు సమాయత్తం చేశారు. భూస్వాములు, దొరల దోపిడీని వ్యతిరేకిస్తూ అనేక పాటలు రాశారు. ఆ క్రమంలోనే 80వ దశకంలో మా భూమి చిత్రంలో "పల్లెటూరి పిల్లగాడా.. పసులగాసె మొనగాడా" అనేపాట బాలశ్రామికుల బాధలకు దర్పణమై హృదయాంతరాలను కదిలింపజేసింది. ఓ చేత పెన్నుపట్టుకొని మరో చేతిలో గన్నును పట్టుకొని సాయుధ పోరులో జనపదం రాసి.. పెన్నును గన్నులా పేల్చి దొరల కోట గోడలు కూల్చాడు. నిత్యం జీవనంలో తెలంగాణ ప్రజలు ఉపయోగించే భాషలో పాటలు రాసిన హనుమంతు నల్లగొండ జిల్లా మోత్కూరు సమీపాన ఉన్న పాలడుగులో 1908లో జన్మించారు. సుద్దాల గ్రామంలో స్థిరపడి అప్పటి వరకు గుర్రం హనుమంతుగా ఉన్న పేరును ఊరుపేరును ఇంటి పేరుగా మార్చి సుద్దాల హనుమంతుగా నేటికీ పిలుస్తున్నారు.

ఆర్య సమాజ కార్యకర్తగా పోరాట పథాన్ని ప్రారంభించి తదనంతరం ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, కళకారుడుగా, కవిగా సుద్దాల రాసిన పాటలు, తెలంగాణ జనహృదయాల్లో నిలిచిపోయాయి. ఆర్య సమాజం నుంచి కమ్యూనిస్టు అయిన సుద్దాల ... "గొల్ల సుద్దులు నాటకం" నల్లగొండతో పాటు తెలంగాణ అంతా మారుమోగింది. సంఘం వచ్చింది కూలన్నా అనేపాట గ్రామీణ జనాన్ని కదిలించింది. నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలను విముక్తి చేయడానికి ఎక్కడ సభ జరిగినా సుద్దాల పాల్గొని 5 గంటలపాటు సమరగీతాలు వినిపించే వారు. "వెట్టిచాకిరి విధానమో రైతన్నా... ఎంత చెప్పినా తీరదో కూలన్న ... " పాట వ్యవసాయ శ్రామికుల్లో, దోపిడీకి గురవుతున్న రైతులలో ఉత్తేజాన్ని నింపింది. కార్మిక వర్గం నుంచి కళాకారునిగా, కవిగా సుద్దాల గుర్తింపు పొందారు. కమ్యూనిస్టు యోధులు గుర్రం యాదగిరిరెడ్డి (మూడుసార్లు ఎమ్.ఎల్.ఎ) కాశే రామస్వామి, గడ్డమీది రామయ్య, గడ్డమీది రామస్వామి, గణగాని ఐలయ్య, గూడపుల్లయ్య గౌడ్ వంటి యోధులతో సుద్దాల హనుమంతు కలిసి గన్ను పేల్చారు.


సుద్దాల సర్పంచిగా ఎన్నికైన హనుమంతు ప్రజాభిమానం పొందారు. గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు వేశారు. సుద్దాల హనుమంతు కవిగా, కళాకారునిగా చాలా మందికి తెలుసు. కాని మంచి డాక్టర్ కూడా. ఎంబిబిఎస్, ఎం.ఎస్., సర్జన్ , ఫిజిషియన్ చదువు చదవలేదు. కానీ సుద్దాల గ్రామ వాసులకే కాకుండా చుట్టుముట్టు గ్రామ ప్రజలకు వైద్యం అందించారు. చేయి పట్టుకుని... గోలి ఇచ్చిన, సూది ఇచ్చిన వచ్చిన రోగం పోయేది. అలాంటి శక్తి ఆయనలో ఉంది. సుద్దాల పోరాట స్ఫూర్తితో నవతరం ఆయన బాటలో సాగి ఆదర్శవంతులు కావాలి.

**గుర్రం రాంమోహన్ రెడ్డి**
7981018644

# విప్లవ కారుడు...
# ప్రజా ఉద్యమకారుడు చేగువేరా

అతనో మడమ తిప్పని పోరాట యోధుడు. సాహసం వారి ఊపిరి. ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప వీరుడు చేగువేరా. వీరు జూన్ 14, 1928న జన్మించారు..వీరి అసలు పేరు ఎర్నెస్టో గెవారా. ఇతడు దక్షిణ అమెరికా ఖండపు విప్లవకారుడు, రాజకీయ నాయకుడు.ఇతడు పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటు సామ్యవాదం లోని సాంప్రదాయ వాదాన్ని కూడా వ్యతిరేకించాడు.ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా ప్రభుత్వంలో కాస్ట్రో తరువాత అంతటి శక్తివంతుడైన నాయకుడుగా చలామణీ అయ్యాడు. ఇతడు 1961 నుండి 1965 వరకు పరిశ్రమల మంత్రిగా పనిచేసి క్యూబా ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలను చాలావరకు నిర్దేశించాడు.ఇతడు అర్జెంటీనాలోని రొసారియా అనే పట్టణంలో 1928 జూన్ 14న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. 1953లో బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి వైద్య విద్యలో పట్టా పొందాడు. ఆ తదుపరి మోటారు సైకిల్ పై దక్షిణ అమెరికా ఖండమంతటా పర్యటిస్తున్న సమయంలో ప్రజల జీవన స్థితిగతుల గురించి తెలుసుకున్నాడు. హింసాత్మక విప్లవమొక్కటే సామాజిక అసమానతలను తొలగించగలదని భావించాడు. 1954లో గౌటెమాల దేశంలో ప్రజాబాహుళ్యపు అభ్యున్నతికి కృషి చేస్తున్న సామ్యవాద అనుకూల ప్రభుత్వంతో కలసి పనిచేశాడు. కానీ అదే సంవత్సరం అమెరికా సాయంతో జరిగిన కుట్ర మూలంగా ఆ ప్రభుత్వం కూలదోయబడటంతో మెక్సికో వెళ్ళిపోయాడు. ఈ ఘటనతో అతని హింసాత్మక విప్లవ దృక్పథం మరింత బలపడింది.

మెక్సికోలో ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలో అప్పటికే ప్రవాసం వచ్చిన క్యూబా విప్లవకారులతో చేతులు కలిపాడు. 1950 వ దశకం చివరలో అప్పటి క్యూబా నియంత బాటిస్టాకు వ్యతిరేకంగా కాస్ట్రో ఆధ్వర్యంలో జరిగిన గెరిల్లా పోరాటం 1956–1959లో ముఖ్య పాత్ర పోషించాడు. ఈ సమయంలోనే ఇతను 'చే' గా పిలువబడ్డాడు.గెవారా ఎవరినైనా పలకరించే సమయంలో చే అనే అర్జెంటీనా శబ్దాన్ని ఎక్కువగా వాడుతుండటంతో క్యూబన్ విప్లవకారులందరూ అతన్ని 'చే' అని పిలువనారంభించారు. అలా ఆ పేరు స్థిర పడిపోయింది. ఈ పోరాటం విజయవంతమై కాస్ట్రో 1959 జనవరిలో క్యూబా ప్రభుత్వాధికారాన్ని చేపట్టినపుడు గెవారా పరిశ్రమల మంత్రిగా, క్యూబా జాతీయ బాంకు ప్రెసిడెంట్‌గా పనిచేసాడు. క్యూబా ప్రతినిధిగా అనేక దేశాలు పర్యటించాడు. ఈ పర్యటనలలో భాగంగానే చే 1959 జూలై నెలలో భారతదేశంలో కూడా పర్యటించాడు. తృతీయ ప్రపంచ దేశాల మీద అమెరికా పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన చే గెవారా క్యూబా సామ్యవాద దేశంగా మారటానికి దోహదపడ్డాడు.




అక్టోబర్ 9న చేగువేరా వర్ధంతి

గెరిల్లా యుద్ధం గురించి వివరించే తన రచనలలో వర్ధమాన దేశాలలో రైతాంగ విప్లవోద్యమాలు నిర్మింపబడాలని కోరుకున్నాడు. పేద దేశాలలో విప్లవాన్ని వ్యాప్తిచేయ తలపెట్టిన చే 1965లో క్యూబాలో తన అతున్నత స్థానాన్ని, హోదాని, పలుకుబడిని అన్నింటిని వదలి పెట్టి కాస్ట్రో వారిస్తున్నా వినకుండా దేశం నుండి అదృశ్యమయ్యాడు. కొద్దిమంది అనుచరులతో రహస్యంగా ఆఫ్రికా దేశమైన కాంగోలో కొంత కాలం గడిపాడు. ఆ సమయంలో ఆ దేశం యొక్క తూ ర్పు ప్రాంతంలో గెరిల్లా తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలుడయ్యాడు.1966 చివరిలో మరలా దక్షిణ అమెరికా చేరి బొలీవియా దేశంలో మిలిటరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విప్లవకారులకు నాయకత్వం వహించాడు. ఈ సమయంలోనే బొలీవియన్ సైన్యం చేత చిక్కి వారిచే 1967 అక్టోబర్ 9న వల్లెగ్రాండె అనే ప్రాంతంలో చంపబడ్డాడు. ఆనాటి నుండి చే గువేరా విప్లవానికి, తిరుగుబాటుకు చిహ్నమై ఎందరికో ఆరాధ్యుడయ్యాడు. వారి సమగ్ర జీవితం అందరికి స్ఫూర్తి కావాలి. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజల గుండెలలో వీరు, వీరి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. చెగువెర లాంటి నాయకుడు ఇక భవిష్యత్ లో పుట్టకపోవచ్చు. చెగువెర అంటేనే ఒక సాహసం, వీరోచిత పోరాటం, పీడిత ప్రజల పక్షాన వుండే జన కెరటం. వారి స్ఫూర్తితో ముందుకు వెళదాం.

**కామిడి సతీష్ రెడ్డి,**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, 9848445134

# పెరటి తోటల పెంపకాన్ని ఉద్యమంలా వ్యాప్తి చేయాలి

కఠోర దీక్షతో దేవి శరన్నవరాత్రి చేస్తున్న ప్రజలు అదే దీక్షతో పెరటి తోట పెంపకం, మంచి ఆరోగ్య ఆహార అలవాట్లకు శ్రీకారం చుడితే మెరుగైన సమాజాన్ని ఆశించవచ్చు. పండుగ పేరుతో వీధుల్లో, కూడళ్లలో దిష్టి బొమ్మల్లా ప్లాస్టిక్ బ్యానర్లు కట్టి, ప్లాస్టర్ ప్యారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను తాగే నీటిలో కలిపి డీజెలు, అసభ్యకర నృత్యాలు, వేషధారణ, రంగులు చల్లుకోవడం లాంటి అనాగరిక విధానాలకు స్వస్తి పలకాలి, ప్లాస్టిక్ వినియోగం సున్నా స్థాయికి తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలి. ప్రభుత్వం కాయగూరల విత్తనాలు, పండ్ల మొక్కలు, చెట్లు రాయితీ ధరలకు ఇవ్వాలి. పిల్లలకు సీడ్ బాల్స్ తయారు చేయడం, మొక్కలు నాటడం ప్రకృతికి దగ్గరగా జీవించడం నేర్పాలి. గ్రీన్ ఛాలెంజ్, ఐస్ బకెట్ ఛాలెంజ్ లాంటివి సెలెబ్రిటీలచే నిర్వహిస్తున్న ప్రభుత్వం, పెరటి తోటలు పెంచడం, మంచి ఆహార ఆరోగ్య అలవాట్లు ప్రోధి చేస్తు మెరుగైన సమాజానికి దోహదపడుతున్న వారి కోసం ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రచారం చేస్తే సమాజం బాగుపడుతుంది. మనం నిత్యం భుజించే వాటిలో ఆకుకూరలు, కూరగాయలు ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. ముఖ్యంగా శాఖాహారులకు పోషక పదార్థాలతో కూడిన ఆహారం సమకూరేది కేవలం కాయగూరలు ద్వారా అంటే అతిశయోక్తి కాదు. పోషకాహార నిపుణుల ప్రకారం ఒక సమతుల్యమైన ఆహారాన్ని అందుకోవాలంటే, పెద్దవారికి రోజుకు కనీసం 85గ్రా. పండ్లు , 300 గ్రా. కూరగాయలు అవసరం. కానీ, మన దేశంలో ప్రస్తుతం కాయగూరల ఉత్పత్తి ప్రకారం చూస్తే, రోజు సగటున ఒకరికి కేవలం 120గ్రా. కూరగాయలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత మూడు సంవత్సరాలుగా ధరల స్థిరీకరణ అనేది ఎక్కడా లేదు. ప్రతి కూరగాయ రేటు రెండింతలు మూడింతలు అయిన మాట వాస్తవమే. సామాన్య ప్రజలకు కూరగాయలు అందుబాటులో లేకుండా పోవడం, ఉన్నా ధర ఎక్కువగా ఉండటంతో కొనలేని పరిస్థితి. పెరటి తోటలు, మిద్దె మీద తోటలు పెంచడంతో జీవన శైలిలో మార్పులు గ్రహించవచ్చు. గృహిణులు, పిల్లలు వీటి సంరక్షణ గురించి చాల విషయాలు తెలుసుకుంటారు. ఒకప్పుడు హార్టికల్చర్, అగ్రికల్చర్ శాఖల వారు కూరగాయల విత్తనాలు ఇచ్చేవారు. బెండ, గోరుచిక్కుడు, బీర, కాకర, సొరకాయ, మిరప, టమోట;



ఆకుకూరల్లో పొన్నగంటి ఆకు, పాలకూర, చుక్కకూర, కోయగూర, గోంగూర, శిరి ఆకు, కొత్తిమీర, పుదీన ఎలాంటి వాతావరణంలో అయినా వస్తాయి. దీనికి ఎకరాల భూమి అవసరంలేదు. కేవలం ఒకటి రెండు సెంట్ల స్థలంలో అన్నీ ఏర్పాటు చేసుకోవచ్చు.

**పెరటితోటలో మొక్కల పెంపకం**

పైన చెప్పిన నిజాలను ఆధారంగా తీసుకొని, మనకోసం మనం, ఇంట్లోనే కాయగూరలను ఉత్పత్తి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి ఇంట్లో వంటగది, స్నానాలగది వృధా అయ్యే నీటిని వాడుకోవచ్చు. దీనివల్ల మన ప్రాణానికి హాని కలిగించే నిలవ నీరు, మురుగు నీరు ఏర్పడకుండా ఉంటుంది. అంతేకాక మన కూరగాయల అవసరాలనూ తీరుస్తుంది కూడా. తక్కువ స్థలాల్లో ఎక్కువ కూరగాయల చెట్లను పెంచుకోవడం వల్ల చీడ రాకుండా, ఒక వేళ వచ్చినా సులభంగా చెట్లకు పట్టిన చీడను తొలగించుకొనేందుకు వీలుగా ఉంటుంది. పైగా రసాయనాల వాడకం ఉండదు కాబట్టి కాలుష్యం ఏర్పడదు. ఇదెంతో క్షేమకరమైన విధానం కూడా. ఎందుకంటే, ఇలా ఉత్పత్తి అయ్యే కూరగాయల్లో మన ఆరోగ్యానికి భంగం కల్గించే ఈ కాయగూరల్లో ఉండవు. పెరటి తోటల పెంపకానికి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ అనుకూలమైన నెలలు. వంటింటి తోట ఎక్కడ పెంచాలనే దానికి స్థలం ఎంపిక విషయంలో మనకు పరిమితమైన అవకాశం ఉంది. ఇంటి పెరటి స్థలమే అందరికీ చివర గా అందుబాటులో ఉండే స్థలంగా చెప్పాలి. ఎందుకంటే, ఇంటిలోని వారంతా తమ ఖాళీ సమయాల్లో కూరగాయలపై తగినంత దృష్టి పెట్టడానికి వీలవుతుంది. పైగా, వంటింటి నుంచి, స్నానాలగదిలోనుంచీ వృథాగా పోయే నీటిని ఈ తోటలకు సులభంగా మళ్లించవచ్చు. ఈ కిచెన్ గార్డెన్ ఎంత పరిమాణంలో ఉండాలి అనేదానికి ఎలాంటి నియమాలు లేవు. ఐతే, మనం ఎంత స్థలం కేటాయించిన, ఎంత మందికి సరిపడా కూరలు ఉత్పత్తి చేసుకోవాలి అనేదానిపై వాటి సైజు నిర్ణయించుకోవాలి. దీనికెలాంటి నిర్ణీత ఆకార నియమాలు కూడా లేవు. ఐతే, చదరంగా ఉండే దానికన్నా దీర్ఘచతురస్రాకారంగా ఉంటేనే మంచిది. పంట కోతల ఆధారంగా ఒక మూడు సెంట్ల భూమిలో కిచెన్ గార్డెన్ ఆరంభిస్తే, కనీసం 4 నుంచి 5మంది ఉండే కుటుంబానికి సరిపడా కూరలు పండించవచ్చు. అలాగే బంతి, చామంతి, కనకాంబరం, క్రోటన్ పెంచితే ఇంటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

**డా. ముచ్చుకోట. సురేష్ బాబు,**
9989988912




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని తీరుస్తాం

రైతుల భూములు లాక్కోవద్దు


అమెరికా రేవు కార్మికుల విజయం!

లోపలి పేజీల్లో


సంపుటి 27, సంచిక: 115 | బుధవారం | 09-10-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

# జమ్ము కశ్మీర్‌లో ఎన్‌సి-కాంగ్రెస్ గెలుపు

# హర్యానాలో... బిజెపి హ్యాట్రిక్



| జమ్ము కశ్మీర్ | | |
|---|---|---|
| పార్టీ | 2024 (90) | 2014 (87) |
| నేషనల్ కాన్ఫరెన్స్ | 42 | 15 |
| బిజెపి | 29 | 25 |
| కాంగ్రెస్ | 6 | 12 |
| పిడిపి | 3 | 28 |
| సిపిఐ(ఎం) | 1 | 1 |
| ఇతరులు | 9 | 3 |
| ఇండిపెండెంట్లు | | 3 |



| హర్యానా (90) | | |
|---|---|---|
| పార్టీ | 2024 | 2019 |
| బిజెపి | 48 | 40 |
| కాంగ్రెస్ | 37 | 31 |
| జెజెపి | 0 | 10 |
| ఐఎన్‌ఎల్‌డి | 2 | 1 |
| హెచ్‌ఎల్‌పి | 0 | 1 |
| ఇతరులు | 3 | 7 |

**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీరులో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)-కాంగ్రెస్‌పార్టీ కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సాధించి అధికారం దక్కించుకుంది. ఇక హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులయ్యాయి. ఆ రాష్ట్రంలో బిజెపి హ్యాట్రిక్ సాధించింది. మూడోసారి కూడా అధికారం కైవసం చేసుకుంది. ఉధంపూర్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని దోడా అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన ఆమ్ ఆద్మీ అభ్యర్థి మేహరాజ్ మాలిక్ విజయం సాధించడంతో జమ్ముకశ్మీరులో అరవింద్ కేజ్రీవాల్ పార్టీ మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నది. ప్రాంతీయపార్టీ పీపుల్స్ డెమోక్రటిక్‌పార్టీ (పిడిపి) మూడు స్థానాల్లో గెలిచింది. ప్రజాతీర్పును గౌరవిస్తామని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇతిజా ముఫ్తీ ఎక్స్‌లో పోస్టింగ్ పెట్టారు. ఆమె అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో మెరుపులు మెరిపించిన అవామీ ఇత్తెహాద్‌పార్టీకి చెందిన ఇంజనీర్ రషీద్, గులాంనబీ ఆజాద్‌కు చెందిన డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ అజాద్‌పార్టీలు ఎక్కడా జాడలేవు. ఇక సిపిఐ(ఎం) తరఫున యూసుఫ్ తరిగామి కుల్గామ్ నుంచి ఐదవసారి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. జమ్ము కశ్మీరు అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఎవరైనా కనీసం 48 సీట్లు గెలుచుకోవాలి. నేషనల్ కాన్ఫరెన్స్‌పార్టీ అత్యధికంగా 41స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్‌పార్టీ ఆరు స్థానాల్లో, సిపిఐ(ఎం) ఒక నియోజకవర్గంలో విజయం సాధించ



డంతో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస మెజారిటీ ఈ కూటమికి లభించింది. ఇక 90 నియోజకవర్గాలలో పోటీ చేసి కేవలం 29 స్థానాలు గెలుచుకున్న బిజెపి ప్రతిపక్షంలో కూర్చోనున్నది. గతంకంటే బిజెపి ఈసారి నాలుగు సీట్లు ఎక్కువ గెలిచింది. 51 స్థానాలలో పోటీ చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ అత్యధికంగా 41 స్థానాలు గెలుచుకుని జమ్ము కశ్మీరులో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌పార్టీ కూటమి తరఫున 32 స్థానాలకు పోటీ చేసి ఆరు నియోజకవర్గాలలో విజయం సాధించింది. ఈ రాష్ట్రంలో నేషనల్ కాన్ఫరెన్స్ సారథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానున్నది. జమ్ము కశ్మీరు ప్రజలు 370వ అధికరణ రద్దుకు వ్యతిరేకమని ఈ ఎన్నికల ఫలితాలను బట్టి రుజువైందని నేషనల్ కాన్ఫరెన్స్‌పార్టీ అధ్యక్షుడు ఫారూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. రెండోసారి కూడా ఒమర్ అబ్దుల్లాయే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటారని ఆయన ప్రకటించారు. ఇంతకుముందు 2009 నుండి 2014 వరకూ ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇకిప్పుడు జమ్మూ కశ్మీరులో లెఫ్టినెంట్ జనరల్ పరిపాలనగానీ, వారి సలహాదారుల పెత్తనంగానీ ఉండబోదని, ప్రజలు ఎన్నుకున్న 90 మంది శాసనసభ్యులే పరిపాలన చేస్తారనీ ఫారూఖ్ అబ్దుల్లా అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మాదకద్రవ్యాలు వంటి అనేక సమస్యలు, ప్రజల కష్టాలు తీర్చేందుకు కొత్త ప్రభుత్వం చాలా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, తమ పార్టీని నామరూపాలు లేకుండా చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేశారని, కానీ చివరకు తమను అంతం చేయాలనుకున్నవారే అంతమైపోయారని విమర్శించారు. జమ్ము కశ్మీరు, హర్యానా రెండు రాష్ట్రాలలోనూ ఓటర్లు చాలా స్పష్టంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసి మంగళవారం ఓట్లలెక్కింపు రోజున ప్రధాన పార్టీలను దిగ్భ్రాంతికి గురిచేశారు.

**హర్యానా సిఎంగా మళ్ళీ నాయబే :** హర్యానా రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలలో పాలక బిజెపి 48 నియోజకవర్గాలలో విజయం సాధించింది. మూడోసారి కూడా ప్రభుత్వం ఏర్పాటు తరువాయి 6లో

## హర్యానా ఓటమిపై కాంగ్రెస్ ఆత్మ విమర్శ చేసుకోవాలి

డి.రాజా హెచ్చరిక



**న్యూఢిల్లీ :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని, ఈ ఓటమి ద్వారా నేర్చుకున్న గుణపాఠాలను రాబోయే మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో అమలు చేయాలని నేరభారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా కోరారు. ''ఇండియా'' కూటమి పార్టీలు హర్యానాలో వేరు వేరుగా పోటీ చేయడంతో బిజెపి మూడోసారి కూడా విజయం సాధించింది. పొత్తులు కుదరకపోవడంతో చివరి సమయంలో ''ఇండియా'' కూటమిపార్టీలు అతి విశ్వాసంతో వేరు వేరుగా పోటీచేసి అపజయాన్ని మూటగట్టుకున్నాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాన్ని కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా పరిగణించాలని, ఈ ఓటమిని గంభీరంగా తీసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలని ఒక ప్రకటనలో డి.రాజా పేర్కొన్నారు. త్వరలోనే మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుగనున్న తరుణంలో డి.రాజా ఈ హెచ్చరిక చేశారు. ''ఇండియా'' కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాట్లు చేసుకోకూడదన్న కాంగ్రెస్ ఆలోచన హర్యానాలో ఆ పార్టీకి బెడిసికొట్టిందని విమర్శించారు. అసలు హర్యానాలో ఈ విధంగా ''ఇండియా'' కూటమి పార్టీలు ఎవరికివారు వేరు వేరుగా పోటీ చేసి ఉండాల్సింది కాదన్నారు. పిటిఐ అడిగిన ప్రశ్నలకు తరువాయి 6లో



## ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఏక వ్యక్తి న్యాయకమిషన్

రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌సి వర్గీకరణ అమలు కోసం ఏక వ్యక్తి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.కమిషన్ నియామకంలో అడ్వకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉపసంఘం తీర్మానించింది ఏకవ్యక్తి కమిషన్ చట్టపరంగా పటిష్టంగా ఉండడంతో పాటు కమిషన్ సిఫారసులను అమలులోనికి వస్తే, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేలా కమిషన్ నియామకం జరిగేలా చూడాలని ఉప సంఘం ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ అమలుకు మంత్రి వర్గ ఉప సంఘం ఛైర్మన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, తరువాయి 6లో

## పంపుసెట్లకు సోలార్ ప్యానెల్స్



రైతుకు పంటతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా అదనపు ఆదాయం

త్వరలో పైలెట్ ప్రాజెక్ట్

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం

వ్యవసాయ పంపు సెట్ల వద్ద సోలార్ ప్యానెల్స్ అమరుస్తామని, దీంతో రైతులకు పంటతో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా కూడా ఆదాయం వస్తుందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలో పైలెట్ ప్రాజెక్టు చేపడతామన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఒక కళాశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరో రెండు, మూడు నెలల్లో విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖాధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విదేశీ పర్యటనలో గనులకు సంబంధించి అమెరికాలో పలు విషయాలను తెలుసుకుని చర్చించేందుకు పర్యటించానని ఆయన తెలిపారు. జపాన్‌లో సోలార్ ప్లాంట్స్, హైడ్రోజన్ పవర్‌తో పాటు విద్యుత్ నిల్వకు సంబంధించి అక్కడి నిపుణులతో చర్చించినట్లు మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు వరదల సమయంలో విద్యుత్ శాఖాధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరగాలని భవిష్యత్తులోను మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి జరగాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఈ ప్రభుత్వ పని ప్రజా సమస్యల పరిష్కారమేనని మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఫ్యూడలిస్టుల్లా వ్యవహరించిన గత ప్రభుత్వ పెద్దలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వారి తీరు పచ్చ కామెర్ల వ్యాధిగ్రస్తులను తలపిస్తుందని ఆయన అన్నారు. గత పాలకులు కమిషన్లకు కక్కుర్తి పడ్డారని అదే రీతిన ఈ ప్రభుత్వం ఉంటుందన్న భ్రమల్లో విమర్శలు చేస్తున్నారని అత్యంత ప్రజాస్వామ్యకంగా పాలన సాగిస్తున్నామని ఆయన తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని ఆర్థిక స్థితిని గాటిలో తరువాయి 6లో

## నిబంధనలు ఉల్లంఘించారో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

'నూతన స్క్రాపింగ్ పాలసీ' అమలు

రూ.296 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్

రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్



ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు చట్టాలను పకడ్బందీగా అమలు చేయనున్నామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించినవారు తిరిగి డ్రైవింగ్ లైసెన్సులు పొందే అవకాశం ఉండబోదని, నూతన వాహనాలు వారి పేరు మీద కొనుగోలు చేసుకునే వెసులుబాటు కూడా ఉండబోదని హెచ్చరించారు. రాష్ట్రంలో 'నూతన స్క్రాపింగ్ పాలసీ'ని అమలు చేస్తున్నామని, వాహనాల స్క్రాపింగ్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'సారథి వాహన్ పోర్టల్'లో చేరబోతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణ శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితరులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తామని, దీనికి సంబంధించి మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో నిబంధనలను పొందుపర్చాలని కోరారు. ఎవరినో వేధించాలన్నదే తమ ఉద్దేశం కాదని, ప్రమాదాల భారి నుంచి ప్రజలను కాపాడడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా సంవత్సరానికి ఒక లక్షా 60 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నిబంధనలు తీసుకొస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా తరువాయి 6లో



## జాన్ జె.హోప్‌ఫీల్డ్, జెఫ్రీ హింటన్‌లకు ఫిజిక్స్‌లో నోబెల్

**స్టాక్‌హోం:** ఫిజిక్స్‌లో మంగళవారం నోబెల్ బహుమతి విజేతలను ప్రకటించారు. ఈ యేటి నోబెల్ ఫిజిక్స్ ఇద్దరికి దక్కింది. రాయల్ స్విడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆ పేర్లను ప్రకటించింది. జాన్ జే హోప్‌ఫీల్డ్, జెఫరీ హింటన్ ఆ పురస్కారాలు గెలుచుకున్నారు. ఆ శాస్త్రవేత్తలు కృత్రిమ న్యూరో నెట్‌వర్క్ ద్వారా మెషీన్ లెర్నింగ్‌కు సంబంధించిన వ్యవస్థీకృత ఆవిష్కరణలు చేసినట్లు ఫిజిక్స్ కమిటీ తన ప్రకటనలో వెల్లడించింది. భౌతిక శాస్త్రంలోని ప్రామాణికమైన నిర్మాణాత్మక విధానాల ద్వారా శక్తివంతమైన మెషీన్ తరువాయి 12లో




## దీనావస్థలో ఆర్టిజన్ కార్మికులు

వెంటనే క్రమబద్ధీకరించాలి

ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు సుమారు 19వేల మంది చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తూ దీనావస్థలో ఉన్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విద్యుత్ రంగ ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తరువాయి 6లో

## ఈ నెలలోనే స్కిల్ వర్సిటీ

మొదటి విడతలో నాలుగు కోర్సులు


రూ.7 కోట్లతో రెడింగ్టన్ లాజిస్టిక్ ల్యాబ్

దసరా తర్వాత తొలి నోటిఫికేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే వినూత్నంగా ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ' ఈ నెల నుంచే కోర్సులను ప్రారంభించనుంది. యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణను అందించి జాబ్ గ్యారంటీ ఉండే కోర్సులను యూనివర్సిటీ నిర్వహిస్తోంది. వివిధ రంగాల్లో పేర్కొందిన కంపెనీలు, సంస్థల భాగస్వామ్యంతో ఈ కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పన చేస్తుంది. ఆయా రంగాల్లో నిపుణులతో విద్యార్థులకు బోధన తరగతులతో పాటు ప్రాక్టికల్స్ ను నిర్వహిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ భవనాలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ ఏడాది గచ్చిబౌలిలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో తాత్కాలికంగా యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలని ఇటీవల బోర్డ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా సమక్షంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ఈ నెలలోనే (అక్టోబర్) నాలుగు కోర్సులు ప్రారంభించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వివిఎస్‌వివి స్‌ఎస్ సుబ్బారావు తెలిపారు. లాజిస్టిక్స్, మెడికల్ అండ్ హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యధిక ఉద్యోగాల డిమాండ్ ఉన్న నాలుగు కోర్సులను మొదటి విడతలో ప్రారంభించనున్నారు. దసరా సెలవుల తర్వాత ఈ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్లు, అర్హతల పూర్తి వివరాల నోటిఫికేషన్ వెలువడనుంది. త్వరలోనే మరిన్ని కోర్సులను ప్రారంభించేందుకు స్కిల్ యూనివర్సిటీ వివిధ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోందని వైస్ ఛాన్సలర్ తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్లో లాజిస్టిక్స్ ల్యాబ్‌ను తరువాయి 6లో



## ఐదుగురు రష్యన్ పర్వతారోహకులు మృతి

నేపాల్ ధవళగిరి పర్వతారోహణలో అపశృతి

**ఖట్మండూ :** ధవళగిరి పర్వతంపై గల్లంతైన ఐదుగురు రష్యా పర్వతారోహకులు చనిపోయారు. పర్వతంపై సుమారు 7 వేల మీటర్ల ఎత్తున వారి ఆచూకీని కనుగొన్నారు. వారి ఆచూకీ కనుగొనే ఆపరేషన్‌లో భాగస్వామిగా ఉన్న హేలీ ఎవరెస్ట్ వైస్ ఛైర్మన్ మింగ్మా షేర్పా మాట్లాడుతూ ప్రపంచంలో ఏడవ అతి పెద్ద పర్వతమైన నేపాల్‌లోని ధవళగిరి అధిరోహణకు ఐదుగురు రష్యన్‌లు ఆదివారం బయలు దేరినట్లు వెల్లడించారు. వారిని అలెగ్జాండర్ దుప్యేకో, ఒలెగ్ కృగ్లోవ్, తరువాయి 12లో

# ఫోకస్

## స్ఫూర్తిదాయకం.. అంబిక జీవితం



ముంబయి డిసిపి అంబికను 'లేడీ సింగం' అని పిలుస్తారు. ఆ పేరు సంపాదించడానికి, ఆ స్థాయికి చేరడానికి ఆమె ఎంతో కష్టపడింది. వేలాది మంది యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నది. కేవలం 14 సంవత్సరాల వయస్సులోనే అంబిక వివాహం తమిళనాడులో ఒక కానిస్టేబుల్‌తో జరిగింది. 18 సంవత్సరాలు నిండేసరికి ఇద్దరు పిల్లల తల్లయింది. ఒకసారి గణతంత్ర దినోత్సవం రోజున తన భర్తతో కలిసి ఆమె పరేడ్‌ను చూసేందుకు వెళ్లింది. విధి నిర్వహణలో ఉన్న భర్త, పరేడ్ సమయంలో ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజి), డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) వంటి అధికారులకు సెల్యూట్ చేయాన్ని చూసింది. ఆ హోదా అధికారుల దర్పం ఆమెకు అర్థమైంది. తాను కూడా అలాంటి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశపడింది. కానీ, అప్పటికి ఆమె టెన్త్ లేదా మెట్రిక్ కూడా పూర్తి చేయలేదు. అయితే, ఎంత కష్టమైనా పోలీస్ ఉద్యోగం సంపాదించాలని, ఉన్నత హోదాను అందుకోవాలని పట్టుదల పెరిగింది. భర్త కూడా సహకరించడంతో నిద్రాహారాలు మాని, ఎస్‌ఎస్‌ఎల్‌సి పూర్తి చేసింది. ఒకవైపు గృహిణిగా తన బాధ్యతలు నిర్వరిస్తూనే, మరోవైపు చదువును కొనసాగించింది. పియుసిని ముగించింది. ఆ తర్వాత డిగ్రీ కూడా పాసైంది. భర్తని బతిమాలాడు, ఒప్పించి, చెన్నైలో ఐపిఎస్ కోచింగ్‌లో చేరింది. ఎంతో కష్టం మీద కోచింగ్ పూర్తి చేసింది. మూడు పర్యాయాలు పరీక్ష రాసినా పాస్ కాలేదు. దీనితో ఇంటి వద్ద పిల్లలతో ఇబ్బందులు పడుతున్నానని, కాబట్టి, యుపిఎస్‌సి పరీక్షను మానుకొని తిరిగి రావాలని భర్త కోరినా, ఆమె తన మనసు మార్చుకోలేదు. మరొక్క ప్రయత్నం చేస్తానని, అది కూడా విఫలమైతే, తప్పనిసరిగా ఇంటికి తిరిగి వస్తానని చెఇప్పంది. మరింత కష్టపడి చదివింది. యుపిఎస్‌సిని సాధించింది. 2008 బ్యాచ్‌లో ఆమె గవర్నమెంటు ట్రైనింగ్‌కు హాజరైంది. సంకల్పబలంతో డిసిపి స్థాయికి చేరింది. ఇంతటి స్ఫూర్తిదాయకమైన జీవితాలు చాలా అరుదు. అలాంటి అరుదైన మహిళ అంబిక.

## మూడు 'శతాబ్దాల' జీవితం!

మహిళ



మార్గరెట్ ఆన్ నెవ్.... 111 సంవత్సరాల జీవితాన్ని పూర్తి చేసుకోవడానికి కేవలం నెల రోజుల ముందు తనువు చాలించింది. అయితే, మూడు వేర్వేరు శతాబ్దాల్లో జీవించిన మహిళగా ఆమె చరిత్రసృష్టించింది. నెవ్ 1793లో జన్మించింది. 1903లో తుది శ్వాస విడిచింది. అంటే, 18, 19, 20 శతాబ్దాల్లో ఆమె జీవించే ఉంది. సుదీర్ఘ జీవితాన్ని అనుభవించిన నెవ్ జీవితం పూలపానుపు ఏమీ కాదు. యుక్తవయసులో ఉన్నప్పుడు మెట్ల పైనుంచి జారి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. అపస్మారక స్థితికి చేరింది. అయితే, క్రమంగా కోలుకొని, మళ్లీ తన జీవన ప్రయాణాన్ని కొనసాగించింది. ప్రమాదం ఆమె మనసు వేగాన్ని గానీ, ఆలోచనలనుగానీ, తెలివినిగానీ అడ్డుకోలేకపోయింది.

మార్గరెట్ ఆన్ నెవ్ 3 విభిన్న శతాబ్దాలలో జీవించారు.ఆమె చాలా సుదీర్ఘమైన, కథలతో నిండిన జీవితాన్ని గడిపిన అసాధారణ మహిళ. అతను 1792 లో జన్మించాడు మరియు 1903 వరకు జీవించాడు, చరిత్రలో మూడు వేర్వేరు శతాబ్దాలలో జీవించిన మొదటి వ్యక్తి. అతని జీవితం మనోహరమైన చారిత్రక క్షణాలను కలిగి ఉంది.ఆమె కేవలం ఒక అమ్మాయిగా ఉన్నప్పుడు, నెవ్ మెట్లపై నుండి తీవ్రంగా పడిపోయింది, చాలా రోజులు అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ ప్రమాదం అతన్ని ముందుకు సాగకుండా మరియు తెలివైన మనస్సును అభివృద్ధి చేయకుండా ఆపలేదు.అతను గ్వెర్న్సీ ద్వీపంలో పెరిగాడు మరియు ఫ్రెంచ్ విప్లవం యొక్క గందరగోళాన్ని ప్రత్యక్షంగా అనుభవించాడు. 1807లో, అతను తన తండ్రితో కలిసి వేమౌత్కు ప్రయాణించాడు, కానీ తుఫాను కారణంగా చెసిల్ బీచ్లో అతని ఓడ రేవుకు వచ్చింది.తరువాత, అతను ఇంగ్లాండ్లోని బ్రిస్టల్లో చదువుకున్నాడు, అక్కడ అతను సాహిత్యం మరియు కవిత్వంపై ప్రేమలో పడ్డాడు.ఆమె జీవితకాలంలో, నెవ్ జనరల్ చార్లెస్ ఫ్రాంకోయిస్ డుమౌరీజ్ వంటి చారిత్రాత్మక వ్యక్తులను కలిశారు, ఆమె తెలివితేటలు మరియు ఆకర్షణకు 'ఆధ్యాత్మిక వ్యక్తి' అని మారుపేరు పెట్టారు.1823లో, ఆమె జాన్ నెవ్ను వివాహం చేసుకుంది, అయితే ఆమె భర్త మరణంతో 1849లో గ్వెర్న్సీకి తిరిగి వచ్చింది. ఆ దుఃఖం తాళలేక 98 ఏళ్లు జీవించిన తన సోదరితో కలిసి వివిధ దేశాలకు వెళ్లాడు.అతని చివరి గొప్ప పర్యటన 1872లో ఆస్ట్రో హంగేరియన్ సామ్రాజ్యంలో భాగమైన క్రాకో అనే నగరాన్ని సందర్శించినప్పుడు.ఆమె తల్లి 99 సంవత్సరాల వరకు జీవించినందున, ఆమె కుటుంబ జన్యువులలో దీర్ఘాయువు ఉన్నట్లు అనిపించింది. మార్గరెట్ ఆన్ నెవ్ ఆ రికార్డును బద్దలు కొట్టింది, 110 సంవత్సరాల 321 రోజులకు చేరుకుంది, 1903లో కన్నుమూసింది, 111 సంవత్సరాలు పూర్తి కావడానికి కేవలం ఒక నెల మాత్రమే ఉంది.ఆమె మూడు శతాబ్దాలు జీవించింది మరియు నెపోలియన్ యుద్ధాల నుండి 20వ శతాబ్దం ప్రారంభం వరకు ప్రపంచంలోని అద్భుతమైన మార్పులను చూసింది, ఆమె చుట్టూ ఉన్న ప్రపంచానికి బలం మరియు ఉత్సుకత యొక్క వారసత్వాన్ని మిగిల్చింది.

## నేనెందుకు సిగ్గుపడాలి?



గిసెల్ పెలికా పేరు ఇప్పుడు కేవలం ఫ్రాన్స్‌లోనేకాదు... ప్రపంచమంతా మారుమోగుతున్నది. ఆమె ధైర్యాన్ని కోట్లాది మంది కొనియాడుతున్నారు... స్వాగతిస్తున్నారు. 72 ఏళ్ల వయసులో గిసెల్ న్యాయ పోరాటానికి దిగడమే ఇందుకు కారణం. సుమారు 50 సంవత్సరాల తమ వైవాహిక జీవితంలో, తన భర్త డామినిక్ తనపై ఎన్నో సందర్భాల్లో తనపై అత్యాచారానికి ఒడిగట్టాడన్నది ఆమె అభియోగం. అంతేకాదు, సుదీర్ఘమైన జీవితంలో, తనపై అత్యాచారం, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఏకంగా 51 మందిపైన కూడా ఆమె కేసు నమోదు చేసింది. మత్తు మందు ఇచ్చి తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని ఆమె తన పిటిషన్‌లో పేర్కొంది. పిల్లలు... మనుమలు... మనుమరాండ్లు కూడా ఉన్న ఆమె, ఈ వయసులో కోర్టు మెట్లు ఎక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మీడియాతో మాట్లాడుతున్నప్పుడు ఓ విలేఖరి 'ఈ వయసులో మీరు కోర్టులో పిటిషన్ వేయడం సరైనదేనా? సంకోచించడం లేదా?' అన్న ప్రశ్నకు గిసెల్ తూటాల్లాంటి మాటలతో సమాధానం ఇచ్చింది. 'నేనెందుకు సిగ్గుపడాలి? నేనెందుకు భయపడాలి? నాపై అఘాయిత్యానికి పాల్పడిన వారే సిగ్గుతో తలదించుకోవాలి. పెళ్లి అనే పదంతో భార్యను శారీరకంగా, మానసికంగా వేధించే వాళ్లు సిగ్గుపడాలి. అత్యాచారం చేసే వాళ్లు భయపడాలి. వాళ్లకు లేని జంకు నాకెందుకు' అని ఎదురు ప్రశ్న వేసి, సదరు పాత్రికేయుడి నోరు మూయించింది. తాను కేవలం తన కోసమేగాక, భర్తల చేతిలో అన్ని రకాలుగానూ హింసకు గురవుతున్న మహిళల పక్షాన న్యాయం కోరుతున్నానని ఆమె స్పష్టం చేసింది. తన భర్త డామినిక్ తరచు మత్తు మందు ఇచ్చి కోరిక తీర్చుకునేవాడని ఆమె ఆరోపించింది. అతనను కూడా ఈ అభియోగాన్ని కోర్టులో అంగీకరించాడు. మొత్తం మీద పురుషాధిక్యతపై గిసెల్ మొదలుపెట్టిన పోరాటం సర్వత్రా చర్చనీయాంశమైంది. 'భర్త' అనే హోదాను అడ్డుపెట్టుకొని, భార్య అభిప్రాయాలతో సంబంధం లేకుండా తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించే విధానికి తెరపడాలన్నది ఆమె డిమాండ్. తనపై జరిగిన లైంగిక వేధింపులపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కేసును బహిరంగా విచారించాలని కూడా ఆమె డిమాండ్ చేసింది. తద్వారా ఫ్రాన్స్‌లో స్త్రీవాదానికి ఆమె మారుపేరుగా మారింది. అత్యాచార సంస్కృతికి, పురుషాధిక్యానికి ముగింపు పలకాలని కోరింది. స్త్రీలను ఆక్షేపించడం, శారీరకంగా, మానసికంగా వేధించడం, అత్యాచారాలకు పాల్పడడం వంటి చర్యలకు ఇకపై కొనసాగకూడదని పేర్కొంటూ ఆమె దాఖలు చేసిన మరో పిటిషన్‌పై 170 మంది పురుషులు కూడా సంతకాలు చేయడం గమనార్హం. బలవంతంగా డ్రగ్స్ ఇచ్చి, అత్యాచారం చేయడం వల్ల తాను పనికి వేదనకు ఎవరు ఖరీదు కట్టగలరన్న ఆమె ప్రశ్నకు సమాధానం ఎక్కడుంది? ఆమె పట్ల దశాబ్దాల తరబడి అఘాయిత్యం జరిగినందుకు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. 'నేనెందుకు సిగ్గుపడాలి' అని గిసెల్ నిలదీయడంలో తప్పేమీ లేదు. నిజమే... ఆమె ఎందుకు సిగ్గుపడాలి. పురుషాధిక్యాన్ని ప్రదర్శించే వారే సిగ్గుపడాలి.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- సూక్ష్మ జీవినాశిని పెన్సిలిన్ దేని నుంచి లభిస్తుంది?
  ఫంగస్
- బెలారస్ దేశ రాజధాని నగరాన్ని గుర్తించండి.
  మిన్స్క్
- పాలలో ఉన్న నీటిశాతాన్ని కొలిచే పరికరం ఏది?
  లాక్టోమీటరు
- ఆర్కాట్ వీరుడిగా ప్రసిద్ధి గాంచిన బ్రిటిష్ జనరల్ ఎవరు?
  రాబర్ట్ క్లైవ్
- తిమింగలం ఏ జంతువుల రకానికి చెందుతుంది?
  క్షీరదం
- మానవాభివృద్ధి సూచికను అభివృద్ధిపరిచేది?
  యూఎన్‌డిపి
- రాజ్యాంగ అత్యవసర స్థితి ప్రకటన దేనికి దారితీస్తుంది?
  స్వేచ్ఛ హక్కు తాత్కాలిక రద్దు
- రాష్ట్రపతి రాజ్యసభకు ఎంతమంది సభ్యులను నియమిస్తారు?
  12 మంది
- స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే అంశాలను మన రాజ్యాంగం ముందుమాటలో పొందుపరిచాం. వీటికి ప్రేరణ ఇచ్చింది ఏది?
  ఫ్రెంచి విప్లవం
- మానవ దేహంలో అతిపెద్ద గ్రంథి ఏది?
  కాలేయం
- 2014–15 ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు తరలివచ్చిన ఎఫ్ డీఐల మొత్తం ఎంత?
  30.93బిలియన్ డాలర్లు
- థయామిన్ (విటమిన్ బి 1) లోపం వల్ల వచ్చే వ్యాధి ఏది?
  బెరిబెరి
- అధిక శక్తి ఉన్న ద్రవ్యాన్ని ఇలా కూడా పిలవవచ్చు.
  ఎం 1
- 'గన్ కాటన్' పేరుతో పిలిచే శక్తిమంతమైన విస్ఫోటనకారి ఏది?
  సెల్యులోజ్ నైట్రేట్
- మానవ రక్తంలో అధికశాతం ఉండేవి?
  బేసోఫిల్స్
- మానవుడిలో ఉండే మాస్టర్ గ్రంథి ఏది?
  పిట్యూటరీ
- ఏ విటమిన్ లోపం వల్ల రేచీకటి వస్తుంది?
  విటమిన్‌ఎ
- చీకటి గది ఉదంతం గురించి పేర్కొన్న వ్యక్తి ఎవరు?
  హాల్వెల్
- 'ఈస్టర్న్ స్టార్' భారీ విహార నౌక ప్రమాదం ఇటీవల ఏ దేశంలో చోటు చేసుకుంది?
  చైనా
- మొదటితరం కంప్యూటర్లలో వాడిన కీలక పదార్థం
  వ్యాక్యూమ్ ట్యూబ్స్
- టొమాటోలకు దేనివల్ల రంగు వస్తుంది?
  కెరోటినాయిడ్లు
- శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు ఏ రంగానికి సంబంధించింది?
  శాస్త్ర సాంకేతికత
- బ్రిటిష్ పాలనలో భారతదేశ మొదటి జాతీయ ఆదాయ అంచనాలను సమకూర్చినవారు?
  దాదాభాయ్ నౌరోజీ
- పెద్దమనుషుల ఒప్పందం ఎప్పుడు జరిగింది?
  1956, ఫిబ్రవరి 20

## కార్మికులను వేధించడం తగదు

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను అధికారులు వేధించడం తగదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్ హెచ్చరించారు. మంగళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట జరిగిన కార్మికుల ఆందోళనలో ఆయన మాట్లాడారు. కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్ వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన జీతభత్యాలపై, పిఎఫ్, ఇఎస్ఐలపై, కాంట్రాక్ట్ ఏజెన్సీ అవినీతిపై, కార్మికులపై జరుగుతున్న వేధింపులపై, సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్‌కు ఇప్పటికి దాదాపు ఏడుసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకుండా దాటవేసే సమాధానాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏజెన్సీ నిర్వాహకులకు అనుకూలంగా కార్మికులను నిత్యం వేధింపులకు గురి చేయడం తగదన్నారు. ఇప్పటికయిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను వేధిస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు చెన్నయ్య, మొగులన్న, రంగన్న, దేవానంద్, భాస్కర్ , యాదయ్య, రాఘవేందర్, నరసింహ, అంజి, లోకేష్, వీరాంజనేయులు, శంకర్, మన్యం, నైసన్, మున్న, శ్రీనివాస్, గంగాధర్, రాఘవేందర్, మహేష్, పద్మ, సత్యమ్మ, చంద్రకళ, వరలక్ష్మి, సునీత, పద్మ, చెన్నమ్మ, సుధా, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు

ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి శివశంకర్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** హమాలీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న మద్యం గోదాం హమాలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం గోదాంలో పనిచేసే హమాలీలతో హమాలీ కార్మికుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, ప్రావిడెంట్‌ఫండ్ సౌకర్యం కల్పించాలన్నారు. సంవత్సరానికి రెండు జతల షూ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి మద్యం గోదాం హమాలీ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, కృష్ణ, బాలయ్య, రాజు, ఉదయ్, జీవన్‌తో పాటు పలువురు హమాలీలు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే తప్పుడు ప్రచారాలు

వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** అవగాహన లేని కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను అయోమయానికి గురి చేయడానికి, కార్మికుల్లో వారి మనుగడకు ఎఐటియుసికి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకే లాభాల వాటాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం ఏరియాలోని ఆర్కే 5 గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తాము గత 20 సంవత్సరాల నుంచి కంపెనీకి ఇచ్చిన స్థూల లాభం, కంపెనీ అభివృద్ధి కొరకు ఉపయోగించే మొత్తాన్ని మినహాయించి నికర లాభాల మొత్తం నుండి కార్మికులకు పంచిన లాభాల వాటా శాతాన్ని తాము అన్ని గనులలో కార్మికులకు అర్థమయ్యే విధంగా పోస్టర్లు వేసామని తెలిపారు. అవి చూశాక ఇతర కార్మిక సంఘాలు వారి ఉనికి కోసం చేసే ప్రయత్నాలను కార్మికులు గ్రహించారన్నారు. కార్మికులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నించిన కార్మిక సంఘాలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. లాభాల్లో వాటా ప్రకటన విషయంలో ఎవరు ఎన్ని మాట్లాడినా వాటిని కార్మికులు పట్టించుకోవద్దని, గుర్తింపు కార్మిక సంఘంగా గుర్తింపు పత్రం అందడానికి 8 నెలలు ఆలస్యమైనప్పటికి తాము కార్మిక పక్షానే ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. గుర్తింపు పత్రం ఇవ్వడానికి యాజమాన్యం రాజకీయ జోక్యం వల్ల ఆలస్యం అయినప్పటికి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్టు వర్కర్స్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఎస్అండ్‌పిసి ఫిట్ కార్యదర్శి ఆడేపు మల్లికార్జున్, ఫిట్ సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి, నాయకులు మల్లేష్, శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు ఇబ్బందులు

సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** పెరగిన నిత్యావస్తువుల ధరలతో పండుగల పూట సామాన్యుల ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నెల్లుట్ల గ్రామంలో నకిర్త రాములు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో రాజారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు రోజంతా కష్టంచేస్తే వచ్చేడబ్బులతో నిత్యావసర సరుకులను కొనుక్కోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టి మండల కార్యదర్శి రావుల సదానందం, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, చీటూరి ఎల్లయ్య, కొండబోయిన యాదయ్య, సిద్దయ్య, చంద్రశేఖర్, వీరస్వామి, ఎర్రయ్య, వెంకన్న, యాదగిరి, రాజు, రవి, శ్రీనివాస్, ఆంజనేయులు, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేద వారందరికీ రేషన్ కార్డులు : సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే అర్హులైన పేద వారందరికీ రేషన్ కార్డులు అందజేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో సిపిఐ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి సొతుకు ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది సంవత్సరాల నుండి రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడమే తప్పా హామీని నిలబెట్టుకోవడంలో విఫలం చెందిందన్నారు. భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషి చేయాలని కోరారు. బతుకమ్మ పండుగ పురస్కరించుకొని మహిళలకు 500 రూపాయలు ఇస్తామని చెప్పి మాట తప్పడం జరిగిందన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలనీ కోరారు. భూపాలపల్లి పట్టణంలో భగత్ సింగ్ కాలనీలో పేదలు వేసుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని కోరారు. పట్టణంలోని సమస్యలపై భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు క్యాథరాజు సతీష్, వేముల శ్రీకాంత్, అస్లాం,లోకిని రమేష్, ఎండి షాబిర్, గడ్డం సింహాద్రి, చారి తదితరులు పాల్గొన్నారు.

## మనుగడ కొనసాగాలంటే.. సింగరేణికి కొత్త గనులు రావాల్సిందే

ఎఐటియుసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణలో సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలని, కొత్త గనుల ఏర్పాటు కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి పోరాటం చేస్తుందని గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికే వన్ సిహెచ్‌పిలో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో ప్రస్తుతం ఉన్న గనులు ఇంకో పది, పదిహేను సంవత్సరాల పాటు కొనసాగుతాయని, భవిష్యత్తులో కొత్త గనులు రాకుంటే సింగరేణి మనుగడ కొనసాగడం కష్టమన్నారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు కోసం ఎఐటియుసి పోరాటం చేస్తుందన్నారు. సింగరేణిలో కార్మికులు ఎన్నో రకాల ఆర్థిక బెనిఫిట్స్ ఐన దీపావళి బోనస్, లాభాల్లో వాటా, దసరా అడ్వాన్సు, ఇంక్రిమెంట్లు, ఇన్సెంటివ్‌లు పొందుతున్నప్పటికిని, కొత్త గనులు రాకుంటే ఇవన్నీ ఉండవని ఆయన అన్నారు. లాభాల్లో వాటా ప్రకటన విషయంలో ఎవరు ఎన్ని మాట్లాడినా వాటిని కార్మికులు పట్టించుకోవద్దని, ఎందుకంటే దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థ లో లేని హక్కును పోరాడి సాధించింది ఎఐటియుసి అని ఆయన అన్నారు. కార్మికులకు నష్టం జరుగుతె ఎఐటియుసి ఊరుకోదని ఆయన అన్నారు. సింగరేణి లో గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్, టిబిజికెఎస్ లు కార్మికులకు మేలు చేసిందేమీ లేదని, 2015 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం.ఎం.డి.ఆర్ చట్టానికి బి.ఆర్.ఎస్ పార్లమెంటు సభ్యులు మద్దతు ఇవ్వడం వల్ల కోట్ల రూపాయలు ఖర్చు చేసి గుర్తించిన బొగ్గు బ్లాక్ లను సింగరేణి కి ఇవ్వకుండా టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు వారికి ఇస్తే వాటిని ప్రారంభించే పరిస్థితి లేదని ఆయన అన్నారు. సంస్థ గుర్తించిన గనులను సింగరేణి కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ కు చెందిన 29 వేల కోట్ల రూపాయలు బకాయిలు గత ప్రభుత్వంt చెల్లించలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా 4వేల కోట్ల రూపాయలు బకాయి ఉందని, దీని వల్ల సింగరేణి లో గనుల విస్తరణ, ప్రతి నెలా వేతనాలకు యాజమాన్యం ఇబ్బందులు పడుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి బాకీ ఉన్న 33 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు దసరా పండుగ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, బ్రాంచి కోశాధికారి ఎస్ వెంకట్ రెడ్డి, డిపార్ట్మెంట్ కార్యదర్శి బండి మల్లేశ్, నాయకులు దొంత సాయన్న, మానాల శ్రీనివాస్, కారంపూడి వెంకన్న, బలుసు రవి, నాగేంద్ర కుమార్, బుడిమె సమ్మయ్య, జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన ..

# కార్పొరేషన్లను బాగుచేయాలి

**చైర్మన్లు, ఎండిలు కలిసికట్టుగా కృషి చేయాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో గడిచిన 5 ఏళ్లుగా అన్ని కార్పొరేషన్ల పనితీరు కుంటు పడిందని, వాటన్నింటిని గాడిలో పెట్టి తిరిగి పూర్వ వైభ్వం తెచ్చేందుకు చైర్మన్లు, ఎండి లు కృషి చేయాలని వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ఇందుకు ప్రభుత్వం తరఫున తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. రైతన్న, నేతన్న సంక్షేమం మనందరి బాధ్యతా అని అందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఉద్ఘాటించారు. మంగళవారం సచివాయలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ పరిధిలోని అన్ని కార్పోరేషన్ల చైర్మన్లు, ఎండిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చేనేత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ సెక్రటరి రఘునందన్ రావు , సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఎండి ఉదయ్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగ రాఘవ రెడ్డి, ఎండి యాస్మిన్ బాషా,గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు, ఎండి లక్ష్మీ, మార్క్ ఫెడ్ చైర్మన్ మారం గంగా రెడ్డి, ఎండి శ్రీనివాస్ రెడ్డి, కోపరేటివ్ యూనియన్ చైర్మన్ మోహన్ రెడ్డి, ఎండి అన్నపూర్ణ, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఎండి శ్రీ రాములు, హౌజింగ్ ఫెడ్ చైర్మన్ నవనీత రావు, ఎండి పూర్ణచందర్, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ ఎండి కేశవులు తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమం కోసం, వారికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే చర్యలు తీసుకునేందుకు కృషిచేస్తుందని మంత్రివర్యులు పేర్కొన్నారు.మాట్లాడుతు, ఈ కామర్స్, చేనేత లక్ష్మీ వంటి కార్యక్రమాలను ప్రజలలో విస్తృత ప్రచారం చేసి, టెస్కో ద్వారా అమ్మకాలు పెంచేందుకు ప్రణాళిక బద్దంగా తగిన చర్యలు తీసుకోవాలని టెస్కో ఎండీ సూచించారు. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను 10 ప్రభుత్వ శాఖల నుంచి రూ.234.80 కోట్ల విలువైన యూనిఫాం, బెడ్డింగ్ మెటీరియల్ కోసం టెస్కో కు ఆర్డర్లు వచ్చాయని టెస్కో ఎండి శైలజా రామయ్యర్ మంత్రికి వివరించారు. ఈ కామర్స్ ద్వారా 2.3 కోట్ల అమ్మకాలు నిర్వహించామని చెప్పారు. తెలంగాణ వేర్ హౌసింగ్ కార్పోరేషన్, తెలంగాణ ఆయిల్ ఫెడ్, తెలంగాణ మార్క్ ఫెడ్, తెలంగాణ స్టేట్ సీడ్ కార్పోరేషన్, తెలంగాణ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీల గురించి ఒక్కొక్కటిగా ఆయా ఎండీలు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఉన్న వేర్ హౌసింగ్ గోదాముల వివరాలు, నిల్వ సామర్థ్యం, ప్రస్తుత నిల్వలు వివరిస్తు, 100శాతం నిల్వ సామార్థ్యాన్ని వినియోగించే విధంగా ప్రణాళికలు సిద్ధంచేశామని వేర్ హౌసింగ్ ఎండి లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా తెచ్చిన సాఫ్ట్ వేర్ లో కొన్ని మార్పులు సూచిస్తు, గోదాములలో సెన్సార్ల ద్వారా ఉష్ణోగ్రత, తేమలను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవిధంగా ఉండాలని, గోదాములకు వచ్చే ప్రతి వాహన వివరాలను క్యాప్చర్ చేసేవిధంగా చూడాలని, ఏఐ టెక్నాలజీ వాడుతూ, మానవ జోక్యం తగ్గేటట్లు చూసుకోవాలని చెప్పారు. గారు గత ఏడాది కాలంగా చేపట్టిన వివిధ కార్యక్రమలను మంత్రికి మార్క్ ఫెడ్ ఎండి వివరిస్తూ ఎరువుల సరఫరా మానిటరింగ్ మరింత సమర్థవంతంగా చేయాలని, అంతేగాక ప్రభుత్వం తరఫున రైతుల వద్ద మద్ధతు ధరకు సేకరించిన జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, కంది ఇతరత్ర పంటలను అనుకూల మార్కెట్ ధరలకు విక్రయించాలని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి వరి కాక ఇతరత్రా ఉత్పత్తయ్యే అన్ని రకాల పంటలను ప్రస్తుతం ఉన్న 25శాతం పరిమితిని ఎత్తివేస్తు, 100 శాతం ఉత్పత్తులను మద్ధతు ధరతో కొనుగోలు చేసే విధంగా అనుమతుల కోసం విజ్ఞప్తి చేయాలని సెక్రటరీ వ్యవసాయశాఖ సూచించారు. విత్తనాభివృద్ధి సంస్థ ఎండి గతప్రభుత్వం హయంలో గత 5 ఏళ్లుగా ఎలాంటి నిధులు రాలేదని, ఆర్థిక నిర్వహణ కూడా అంతంత మాత్రంగా ఉందని తెలిపారు. విత్తనోత్పత్తిని విస్తరణకు సంబంధించి మంత్రిసూచనమేరకు వరి మాత్రమే కాకుండా ఇతర విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. .ఆగ్రోస్ ఎండి మాట్లాడుతూ, వ్యవసాయ యాంత్రీకరణ నిధులు లేకపోవడంతో గత 5 ఏళ్లుగా సంస్థ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. దీంతో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాలను పునరుజ్జీవం చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఎండిని మంత్రి తుమ్మల ఆదేశించారు.

### ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు..

# బేసిక్ వేతనం అమలు చేయాలి

**శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడండి, అండగా ఉంటాం కూనంనేని సాంబశివరావు పిలుపు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానంలో గత 15 ఏళ్లకుపైగా పనిచేస్తున్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం క్యాడర్ ఫిక్స్ చేసి బేసిక్ వేతనం ఇవ్వాల్సి ఉన్నా తక్కువ జీతాలతో శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్స్ స్కీం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం యూనియన్ అధ్యక్షులు ఎం.నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న హెల్త్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంస్థ తమ అవసరాలకు తగ్గట్టుగా 70 రకాల క్యాడర్ల ఉద్యోగులను నియమించుకుని ఆ కేడర్లకు సమానమైన జీతభత్యాలు చెల్లించకుండా అతి తక్కువ జీతాలు ఇవ్వటం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా నుండి పల్లె వరకు అన్ని స్థాయిల్లో ఈ ఉద్యోగులు పేద ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు నిత్యం కృషి చేయడం ద్వారానే రాష్ట్రంలో ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందుతున్నాయని, ఈ విషయాలను అధికారులు పట్టించుకోకుండా కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి వివరాలు తెలియజేస్తానని ఆయన హామీఇచ్చారు. ఎన్‌హెచ్ఎం పనిచేస్తున్న 17 వేల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహించామని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈనెల 16న చలో కమిషనర్ కార్యాలయం చేపట్టామని యూనియన్ అధ్యక్షులు ఎం.నరసింహ తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగులకు గత పిఆర్‌సిని నేటి కూడా అమలు చేయడంలేదని, తక్షణం బకాయిలను విడుదల చేయాలన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాలసుబ్రమణ్యం,బాబు యాదవ్, బి.జ్యోతి, పల్లె దవఖాన డాక్టర్స్ శ్రీనివాస్, మహేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కుల గణన విధివిధానాలపై కసరత్తు పూర్తి

**మరో రెండు రోజుల్లో సీనియర్ మంత్రుల కీలక భేటీ**
**నెల రోజుల్లో కులగణన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వ ఆలోచన**
**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి కులగణన విధి విధానాలపై కసరత్తు దాదాపుగా పూర్తి కావచ్చిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం కీలక భేటీ నిర్వహించనుందని తెలిపారు. కుల గణన ప్రారంభమైన నాటి నుంచి నెల రోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆలోచన అని మంత్రి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రిపొన్నం ప్రభాకర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేంనరేందర్ రెడ్డి, బిసి కమిషన్ సభ్యులు, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పంచాయతీ రాజ్ సెక్రటరీ లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, బిసి కమిషనర్ బాల మాయాదేవి, లా సెక్రటరీ రాజశేఖర్ ముఖ్య అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం బిసి రిజర్వేషన్స్ ఖరారు చేయడానికి ప్రభుత్వం బిసి కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, ఇందులోభాగంగా కుల గణన కోసం అసెంబ్లీలో, క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కులగణనకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు న్యాయపరంగా చిక్కులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు కర్ణాటకలో బిసి కమిషన్, బీహార్‌లో జిఎడి, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ ద్వారా సర్వే చేసిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు మంత్రి చెప్పారు.

అక్కడ డోర్ టూ డోర్ పూర్తి స్థాయి సర్వే నిర్వహించారని, ఇందులో మూడు రాష్ట్రాల్లో చేసిన బెస్ట్ పాలసీ నీ తీసుకొని ఇక్కడ అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. మరోవైపు ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వం వర్గీకరణ మీద సబ్ కమిటీ సమావేశాలు కొనసాగుతుండటంతో కులగణన సర్వే నివేదిక ఎస్‌సి వర్గీకరణకు కూడా అవసరం కానున్న నేపథ్యంలో పూర్తి స్థాయి కులాల గణన చేసి, వారికి అవసరమైన డేటా తీసుకునేలా చేసే అంశంపై చర్చించామన్నారు. నివేదిక పారదర్శకంగా ఉండేందుకు జిఎడి, పంచాయతీరాజ్, రెవెన్యూ ఈ మూడు శాఖల్లో ఏదైనా ఒకే శాఖ ద్వారా కులగణన చేపట్టాలని, ఇందుకు సంబంధించి రెండు రోజుల్లో సీనియర్ మంత్రులతో ప్రభుత్వం కీలక సమావేశం ఏర్పాటు చేసి ఇందులో నిర్ణయం తీసుకోనుందని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

### డిజిపి కార్యాలయంలో ..

# ఘనంగా బతుకమ్మ వేడుకలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిజిపి కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిపి డాక్టర్ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, సిఐడి చీఫ్ శిఖాగోయల్, అదనపు డిజిపి మహేష్ భగవత్, అర్గనైజేషన్ డిజిపి స్వాతిలక్రా, ఐజీలు ఎం.రమేష్, వి.సత్యనారాయణ, ఐపిఎస్ అధికారులు రమేష్‌నాయుడు, గజరావు భూపాల్, రెమారాజేశ్వరీతో పాటు డిజిపి కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**అబ్కారీ భవన్‌లో ..**

తెలంగాణ సంస్కృతి సంప్రాదాయాల్లో మహిళలకు ప్రత్యేకంగా వచ్చే పండుగ... బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజుల పాటు పసుపు గౌరమ్మను పూజించి పూలతో ఏర్పాటు చేసిన బతుకమ్మ చుట్టూ పది చుట్లు తిరిగినా అమ్మవారు కరుణిస్తారనే నమ్మకం మహిళల్లో ఉంటుందని శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ అన్నారు. మంగళవారం ఎక్సైజ్ భవన్‌లో పని చేసే మహిళ ఉద్యోగులందరు కలిసి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.

బతుకమ్మ పాటలో ఉద్యోగులు ఆటాపాటా నిర్వహించి దాండియా ఆడారు. లలితాత్రిపుర సుందరి దేవాలయంలో నవరాత్రులు జరుపుతున్నారు. కె.విజయలక్ష్మి, విజయలతో మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 19, 20 తేదీలలో గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవాలు

**రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ పిలుపు**

**ప్రజాపక్షం / హైదరాబాద్:** కల్లుగీత వృత్తిరక్షణ, వృత్తిదారుల హక్కుల సంక్షేమం కోసం ఏర్పాటైన గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవాలను ఉభయ తెలుగు రాష్ట్రాలలో అక్టోబర్ 19, 20 తేదీలలో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. వృత్తిరక్షణ, ఆధునీకరణ, ఉపాధి గ్యారెంటీ లక్ష్యంగా రాష్ట్ర వ్యాపితంగా గీత వృత్తిదారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 1957లో నాటి వరంగల్ జిల్లా గార్లలో ఏర్పడిన గీత పనివారల సంఘం నిర్వహించిన చారిత్రాత్మక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా వేలం విధానం రద్దు చేయబడి కల్లు గీత సహకార సంఘాలకు, టిఎఫ్‌టిల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, వన పెంపకానికి భూమి, కల్లు గీత వృత్తి ఆధునీకరణకు ప్రభుత్వాలతో పోరాడి సాధించుకున్నట్లు తెలిపారు. మద్య నిషేధం పేరుతో కల్లు గీత వృత్తి రద్దుకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో జరిగిన అన్ని కుట్రలను విచ్ఛిన్నం చేసి జాతీయ స్థాయిలో గీత పనివారల సంఘం అగ్రనాయకులు ధర్మ భిక్షం, ఎస్.కుమారన్ నేతృత్వంలో వృత్తిని రక్షించుకున్నామని, ఈ పోరాటంలో గీత పనివారల సంఘం ప్రముఖ పాత్ర వహించిందని ఆయన పేర్కొన్నారు. ఈ నూతన ప్రభుత్వం గీత వృత్తిదారులకు సేఫ్టీ పరికరాలను అందజేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా గీత వృత్తిదారుల వన పెంపకానికి పది ఎకరాల ప్రభుత్వ భూమి, కల్లు దుకాణాల ఏర్పాటుకు వెయ్యి గజాల స్థలం, అందుకు కావాల్సిన ఆర్థిక ప్రోత్సాహం, ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ పెంపుదల, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### రూ.10.61కోట్ల

# డిజిటల్ స్కామ్‌లో ఇద్దరి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డిజిటల్ స్కామ్ కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ ఇద్దరు నిందితులు రూ.10.61 కోట్ల డిజిటల్ స్కామ్‌కు పాల్పడినట్లు శిఖా గోయల్ తెలిపారు. వీరిని బెంగుళూరులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. సెప్టెంబరు 10,2024న హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళకు ముంబై పోలీసుగా నటిస్తూ సైబర్ క్రైమ్ నిందితులు బెంగుళూర్‌కు చెందిన వినయ్ కుమార్ (23), మారుతి (28)లు ఫోన్ చేశారు. ఆ మహిళ ఆధార్, ఫోన్ నెంబర్లను ఉపయోగించి బ్యాంక్ ఖాతాలు తెరిచారని, మనీల్యాండరింగ్ కార్యాకలాపాలకు పాల్పడ్డారని ఫోన్‌లో నిందితులు భయపెట్టారు. నిందితులు బాధితుల ఫోన్‌కు ఇడి, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాల నుంచి నకిలీ లేఖలు పంపారు. ఈ నేరానికి 3 నుండి 7 సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. విచారణ జరుపుతున్నారనే నెపంతో, వారు ఆన్‌లైన్‌లో వీడియో కాల్ ద్వారా తమకు సహకరించమని బాధితుడిని బలవంతం చేశారు. బాధితుడు మోసగాళ్ల నియంత్రణలో ఉన్న ఖాతాల్లోకి మొత్తం 10.61 కోట్లను బదిలీ చేయడంలో తప్పుదారి పట్టించాడు. బాధితులు తాము మోసపోయామని గ్రహించి టిజిసిఎస్‌బి అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌పి దేవేందర్‌సింగ్, డిఎస్‌పి ప్రసాద్, సిఐ అశోక్‌నాయక్, ఎస్ఐ శివ, కానిస్టేబుల్స్ నయీమ్, శివలు బెంగుళూరులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు

**అప్రమత్తంగా ఉండాలి...**

సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వారి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రపరచుకోవాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గోప్యమైన సమాచారాన్ని పంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ముఖ్యంగా తెలియని వ్యక్తులు లేదా ధృవీకరించలేని మూలాధారాలతో కేవలం ఫోన్ లేదా ఆన్‌లైన్‌లో చట్టబద్ధమైన పోలీసు విచారణ నిర్వహించబడదని ప్రజలు గుర్తుచుకోవాలన్నారు. తెలిసినా, తెలియకపోయినా తమ బ్యాంకు ఖాతాలను ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ఏదైనా మోసపూరిత చర్యను అనుమానించినట్లయితే, వెంటనే టిజిసిఎస్‌బి హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## 2029లో కేంద్రంలో ప్రాంతీయ పార్టీలే కీలకం : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హర్యానా,కశ్మీర్ ఎన్నిలక ఫలితాలను పరిశీలిస్తే 2029లో బిజెపి,కాంగ్రెస్‌కు సాధారణ మెజార్టీ సాధ్యం కాదనేది స్పష్టమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. బలమైన ప్రాంతీయ పార్టీలే తదుపరి కేంద్రం ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించనున్నాయని, ఈ విషయాన్ని తాము ఎప్పటినుంచో చెబుతున్నామని కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను, సెక్యులరిజాన్ని కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. హర్యానాలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని కెటిఆర్ సూచించారు. చెప్పే మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇటువంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఒక్కో రాష్ట్రంలో ఒక్క గ్యారంటీని పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసిందన్నారు. ఎన్నికలు తర్వాత కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు ఒక చిత్తుకాగితంతో సమానంగా మారిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ రంగాన్ని సమాధి చేసి, పదేళ్ల ప్రగతికి పూర్తిగా పాతరేసిన కాంగ్రెస్ పార్టీని ఆ పాపం వెంటాడటం తథ్యమని కెటిఆర్ హెచ్చరించారు.

**కశ్మీర్‌లో బిజెపిని, హర్యానాలో కాంగ్రెస్‌ను విశ్వసించలేదు: హరీశ్‌రావు**

కశ్మీర్‌లో బిజెపిని, హర్యానాలో కాంగ్రెస్‌ను విశ్వసించలేదని, ఈ రెండు జాతీయ పార్టీల పట్ల ప్రజల్లో విముఖత ఉన్నదనేది సుస్పష్టమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల గారడీని హర్యానా ప్రజలు విశ్వసించలేదనేది ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫలితాలు చూసిన తర్వాతనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలు, దృష్టి మళ్లింపు రాజకీయాలు మానుకుని, ఆరు గ్యారెంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు.

## నాపై వచ్చినవి తప్పడు ఆరోపణలు

**హెచ్‌సిఎ మాజీ అధ్యక్షుడు అజహరుద్దీన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తనపై వచ్చిన ఆరోపణలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అధ్యక్షులు ఎండి అజహరుద్దీన్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయానికి విచారణ నిమిత్తం అజహరుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ..తాను హెచ్‌సిఎ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సమయంలో ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామాగ్రి కొనుగోళ్లకు సంబంధించి రూ.20 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఆయన స్పదించారు. ఈ విషయంపై గతంలో ఇడి అధికారులు విచారణ నిమిత్తం తనకు నోటీసులు జారీ చేయడంతో విచారణకు హాజరయ్యానన్నారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని తెలిపారు. తన హయంలో డబ్బులు దుర్వినియోగం అయ్యాయనే మాట అవాస్థమని తెలిపారు. తనకు పడనివారు లేనిపోని ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇడి దర్యాప్తు చేపట్టిందన్నారు. త్వరలో తాను నిర్ధోషినని తేలుతుందన్నారు.

## తెలంగాణలో మరో రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేశామన్నారు. మంగళవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం నుంచి పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పారు.

# అమిత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తున్నాం : బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మావోయిస్టులను 2026 నాటికి ఏరివేస్తామని, అప్పటి వరకే వారు ఆఖరి ఊపిరి పీల్చుకునేది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ తీవ్రంగా ఖండించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టుల సంగతి పక్కన పెడితే మరీ ఆర్థిక ఉగ్రవాదులకు కేంద్రం అండ ఎప్పటివరకు ఉంటుందో అమిత్ షా స్పష్టం చేయాలని ఈ సందర్భంగా బోస్ డిమాండ్ చేశారు. ఈమధ్య ఛతీస్‌ఘడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారని, దానితో రెచ్చిపోయిన హోంమంత్రి అమిత్ షా 2026 నాటికి నక్సలైట్లు ఈ దేశంలో 2026 నాటికి మావోస్టుల ఉనికి లేకుండా చేస్తామని పేర్కొనడం దుర్మార్గమన్నారు.

అయితే ఆర్థిక ఉగ్రవాదులైన ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించటంలో సామాజిక నీతి ఏంటో అమిత్ షా చెప్పాలన్నారు. ఇది ఒకవిధమైన రాజకీయ వివక్ష కాదా? ఒకనాడు మన దేశంలో పదుల సంఖ్యలో బిలీయనీర్లు ఇప్పుడు వందల సంఖ్యలో పెరగటాన్ని ఏమంటారని అని మండిపడ్డారు. పాలకులు దీనిని అభివృద్ధి అని ముద్దుగా పిలిస్తే ప్రజలు మాత్రం ఆర్థిక ఉగ్రవాదం అంటున్నారని, దీనికి కేంద్రమంత్రి అమిత్‌షా సమాధానం ఇవ్వాల్సిందేనన్నారు. మావోయిస్టుల అంశానికి సంబంధించి వారు వ్యతిరేకిస్తున్న భూ కేంద్రీకరణ, ఆర్థిక కేంద్రీకరణ, ఆర్థిక అసమానతలు, దోపిడీ లాంటి సామాజిక రుగ్మతులను పరిష్కారం చేయకుండా వారిని రూపుమాపుతామని ప్రకటన చేయటంలో అర్థం లేదని ఆయన అన్నారు. సమాజంలో దోపిడీ అసమానతలు ఉన్నంతకాలం తిరుగుబాట్లు తప్పవని ప్రపంచ చరిత్ర చెపుతున్న సత్యమని, అవి ఏ రూపంలో ముందుకువస్తాయో ఆనాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు నిర్ణయిస్తాయని, కానీ పాలకులు దానిని తెలుసుకోవటం మంచిదని అని బోసు హితవుపలికారు.


**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

NIT No. 33/SE(M)/SBZ/GHMC/2024-25, తేది: 08.10.2024

**పని పరిధి:** జిహెచ్ఎంసి లోని వివిధ ప్రధాన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రీ-కాస్ట్ రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణానికి ప్రతిపాదన కోసం అభ్యర్థన **(4వ పిలుపు)**, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** ఆర్ఇపి వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొను (తేది & సమయం): 09.10.2024@3.00PM, సూపరింటెండింగ్ ఇంజనీరింగ్ కార్యాలయం, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి వద్ద ప్రీ-బిడ్ సమావేశం: 14.10.2024@3.00PM, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 22.10.2024@1.00PM., **అధికారి పేరు & చిరునామా:** సూపరింటెండింగ్ ఇంజనీరింగ్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930374. మరిన్ని వివరాలను ఈ కార్యాలయం యొక్క టెండర్ నోటిఫికేషన్ నోటీసు బోర్డులో http://www.ghmc.gov.in వద్ద చూడవచ్చు.

**సం/- సూపరింటెండింగ్ ఇంజనీరింగ్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి**

DIPR R.O. No. : 5115-PP/CL/ADVT/1/2024-25 Date: 08-10-2024

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**సరూర్‌నగర్ సర్కిల్-5**

NIT.No. 14/EE5/SRNR/GHMC/2024-25, తేది: 07-10-2024

**పని పేరు:** బతుకమ్మ పండుగ (1) పని కొరకు ఏర్పాట్లు. **అంచనా విలువ:** రూ.0.60 లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది మరియు సమయం:** 09.10.2024న మ.3.01గం.ల వరకు, . **సంప్రదించవలసిన చిరునామా:** శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి. సెల్: 9989930602. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి**

DIPR R.O. No. : 5097-PP/CL/ADVT/1/2024-25 Date: 08-10-2024

**శ్రీ రతికి హనుమాన్ దేవాలయము & మఠం**
**(దేవాదాయ శాఖ తెలంగాణ)**
**కర్బలా మైదాన్, జీరా, సికింద్రాబాద్ - 500003**

**ట్రస్ట్‌బోర్డు ఏర్పాటుకు బహిరంగ ప్రకటన**

తెలంగాణ, దేవాదాయశాఖ, హైదరాబాద్, డిప్యూటీ కమిషనర్‌వారు ఈ క్రింద పేర్కొన్న సంస్థకు వారసత్వరహిత ప్రాతిపదికపై ఒక ధర్మ మండలి (ట్రస్టు బోర్డు)ని ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేయడమైనది. 1987 నాటి (చట్టం 30/87) తెలంగాణ చారిటబుల్ మరియు హిందూ మత సంస్థల మరియు దేవాదాయ చట్టానికి 2007/33లో చేసిన సవరణలకు అనుగుణంగా సెక్షన్ 15 సబ్-సెక్షన్ (2) ప్రకారం ఈ బహిరంగ ప్రకటన వెలువడిన 20 రోజుల తర్వాత ధర్మ మండలిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ధర్మమండలిలో సభ్యత్వం నిమిత్తం ఆసక్తిగల వ్యక్తులు తమ దరఖాస్తులను పంపుకోవచ్చును. చట్టంలోని సెక్షన్ 17 సబ్-సెక్షన్ (3) కింద నిర్దేశించిన నిబంధనల మేరకు నిర్దేశించిన ఫారమ్-2 ప్రొఫార్మా ప్రకారం ఈ దరఖాస్తులు చేసుకోవచ్చును. ఈ బహిరంగ ప్రకటన వెలువడిన 20 రోజులలోపుగా డిప్యూటీ కమిషనర్, దేవాదాయశాఖ, తెలంగాణ, హైదరాబాద్ వారికి ఈ దరఖాస్తులు పంపవలెను.

1. ఆర్‌సి. నెం. ఎ2/389/2024 తేదీ : 09-09-2024 శ్రీ మహదేవ్ దేవాలయం, నల్లగుట్ట, సికింద్రాబాద్.
2. ఆర్‌సి. నెం. ఎ2/411/2024 తేదీ : 09-09-2024 శ్రీ గోపాల్‌మందిర్, రెజిమెంటల్ బజార్, సికింద్రాబాద్.
3. ఆర్‌సి. నెం. ఎ2/409/2024 తేదీ : 09-09-2024 శ్రీ మున్నా లాల్ ఛారిటబుల్ ట్రస్ట్, రెజిమెంటల్ బజార్, సికింద్రాబాద్.

**సం/- కె.రాజేష్ కుమార్**
ఎగ్జిక్యూటివ్ అధికారి,
శ్రీ రతికి హనుమాన్ దేవస్థానం & మఠం, జీరా, సికింద్రాబాద్.
ఇమెయిల్: bhavanasharma4399@gmail.com
Cell: 9912152507

**సం/- డిప్యూటీ కమిషనర్**

DIPR R.O. No. : 5150-PP/CL/ADVT/1/2024-25 Date: 08-10-2024

**IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY**

**O.S.No. 232 OF 2024**

Between:

1) Godari Raj Kumar, S/o Late Rajalingu, Aged: 21 Years, Occu: Labour, R/o HNo. 2-161, Lakshminagar, Bhupalpally, Jayashankar Bhupalpally District.
2) Godari Ramya, S/o Late Rajalingu, Aged: 18 Years, Occu: Labour, R/o H.No. 2-161, Lakshminagar, Bhupalpally, Jayashankar Bhupalpally District

...Plaintiffs

And

1. The State of Telangana through District Collector, Jayashankar Bhupalpally District.
2. The Tahsilclar, Bhupalpally, Jayashankar Bhupalpally District.
3. The General Manager, Singareni Collieries Company Ltd. Bhupalpally, Jayashankar Bhupalpally District
4) To whom so it may ever concern

...Defendants

**NOTICE**

Please take notice that the above Plaintiffs filed the suit against the Defendants to declare them as legal heirs of the diseased i.e. **Late Godari Rajalingu, S/o Rayamallu.** Any person or persons having any objection may file their objections before the above mentioned Hon'ble Court. on **05-11-2024 at 10-30 A.M.** either personally or through an advocate with due objections. If nobody appears before the Hon'ble Court on the said date, the matter will be heard and decided on merits.


// By Order of the Hon'ble Court//

**Sd/-PAGADALA ANANDA RAO ADVOCATE**
Bhupalpally, Jayashankar Bhupalpally District.

# ఇజ్రాయెల్‌పై భారీ దాడి చేసిన హెజ్బొల్లా

**బీరుట్‌లో హెజ్బొల్లా ప్రధాన కేంద్రంపై ఇజ్రాయెల్ క్షిపణులు**
**గాజాపై వైమానిక దాడుల్లో 25 మంది పాలస్తీనా వాసుల హతం**

## హైఫా నగరంపై 100 రాకెట్లు ప్రయోగం



**బీరుట్ :** ఇజ్రాయెల్‌పై లెబనాన్ నుంచి హెజ్బొల్లా భారీగా రాకెట్ దాడులను కొనసాగిస్తోంది. తీర ప్రాంత పట్టణమైన హైఫాపై పెద్ద ఎత్తున రాకెట్‌లను ప్రయోగిస్తోంది. మంగళవారం ఒక్క రోజే ఏకంగా 100 రాకెట్‌లతో ఆ నగరంపై దాడి చేసింది. మరోవైపు హెజ్బొల్లా కేంద్రం ఉన్న దక్షిణ లెబనాన్‌లోని బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలపై ఇజ్రాయెల్ పెద్ద ఎత్తున క్షిపణి దాడులు చేస్తోంది. అలాగే సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 25 మంది పాలస్తీనా వాసులు హతమయ్యారు. ఇందులో ఐదుగురు పిల్లలు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు లెబనాన్ నుంచి తమ వైపు 105 రాకెట్‌లు వచ్చాయని, వాటిలో ఎక్కువ భాగాన్ని చేధించామని ఇజ్రాయెల్ మిలిటరీ తెలిపింది. హైఫా నగరంపై పెద్ద ఎత్తున రాకెట్‌లను ప్రయోగించగా, 70 ఏళ్ళ మహిళకు గాయాలయ్యాయని, అనేక భవనాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయని ఇజ్రాయెల్‌లోని స్థానిక మీడియా తెలిపింది.

**ఇజ్రాయెలీలను నిర్వాసితులను చేస్తాం : హెజ్బొల్లా**

తాము హెజ్బొల్లా ఇజ్రాయెల్ దేశం లోపలికి తమ రాకెట్లను సంధించడం ద్వారా మరింత మంది ఇజ్రాయెలీలు తమ నిర్వాసితులవుతారని హెజ్బొల్లా తాత్కాలిక నేత షేక్ నయీమ్ ఖాసెం హెచ్చరించారు. తమ మిలిటరీ సామర్థ్యం ఇప్పటికీ చెక్కుచెదరలేదన్నారు. లెబనాన్‌లో వారం రోజుల క్రితం నుంచి జరిగిన భారీ వైమానిక దాడులలో తమ సీనియర్ కమాండర్‌లను కోల్పోయినప్పటికీ , వారి స్థానాలలో భర్తీ చేశామని చెప్పారు. తమపై ఇజ్రాయెల్ దాడులకు నెల రోజులు పూర్తయిన నేపథ్యంలో ఆయన ఒక టెలివిజన్ ప్రకటన ద్వారా సందేశాన్ని విడుదల చేశారు. గత వారం లెబనాన్‌పై ఆకస్మిక దాడుల చేసిన తరువాత ఇజ్రాయెల్ మరింత ముందుకు పోలేకపోయిందని షేక్ నయీమ్ ఖాసెం అన్నారు. గాజా లో కాల్పుల విరమణ ప్రకటించేంత వరకు ఇజ్రాయెల్‌పై తాము దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమ నాలువగ మిలిటరీ విభాగం రంగంలో దిగి పశ్చిమ దిశగా వెళ్తున్నట్లు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించినప్పటికీ, అదంతా సరిహద్దులోని చిన్న ప్రాంతానికే పరిమితమైంది. తాము హెజ్బొల్లా మౌలికసదుపాయాలను ధ్వంసం చేశామని, మంగళవారం నాడు సీనియర్ కమాండర్ సుహేల్ హుస్సేనీని చంపేసామని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. తాము వందలాది రాకెట్‌లను, డజన్‌ల కొద్ది డ్రోన్‌లను సంధిస్తున్నామని, అనేక పట్టణాలు, నివాస ప్రాంతాలలు మంటల్లో చిక్కుకున్నాయని ఖాసెం తెలిపారు. హస్సన్ నస్రల్లా స్థానంలో త్వరలోనే కొత్త నాయకుడి పేరును హెజ్బొల్లా ప్రకటిస్తుందని తెలిపారు.




**శనివారం బెర్లిన్‌లో అగ్రదేశాల భేటీ**

బెర్లిన్ పశ్చిమాసియా, ఉక్రేన్ యుద్ధాలలో తాజా పరిణామాలపై చర్చించేందుకు శనివారం నాడుక జర్మనీ దేశంలోని బెర్లిన్‌లో అమెరికా, యుకె, ఫ్రాన్స్, జర్మనీ నేతలు భేటీ కానున్నారు. ఈ విషయాన్ని బ్రిటీష్ ప్రధాని కీర్ స్టార్మర్ అధికార ప్రతినిధి తెలిపారు.

### ఏడాదిలో 175 మంది జర్నలిస్టుల హతం

గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన ఏడాది కాలంలో 175 మంది జర్నలిస్టులు హతమయ్యారని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రతినిధి టిమ్ డాసన్ తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగానే ఇజ్రాయెల్ గాజాలో జర్నలిస్టులను చంపేస్తుందని ఆయన అన్నారు.

## అత్యధిక మిలిటరీ డ్రోన్‌లు కలిగిన దేశాలివే

**తొలి రెండు స్థానాలలో అమెరికా, టర్కీ**



ఇటీవల కాలంలో దేశాల మధ్య యుద్ధాలు, ఘర్షణలలో పెనుమార్పులు సంభవించాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. అందులో భాగంగా తమ వైపు నుంచి ప్రాణ నష్టం లేకుండా ఎదుటి పక్షానికి నష్టం కలిగించేలా డ్రోన్‌ల వినియోగం కదన రంగంలో పెరిగింది. ఇప్పటికే రష్యా – ఉక్రేన్, ఇజ్రాయెల్ –ఇరాన్–లెబనాన్‌ల ఘర్షణల్లో డ్రోన్‌ల వినియోగం గురించి వింటున్నాము. మిలిటరీ ఆపరేషన్‌లు డ్రోన్‌లు విడదీయరాని భాగంగా మారిపోయాయి. భవిష్యత్తులో యుద్ధాలలో డ్రోన్‌లు కీలక పాత్ర పోషించనున్నాయి. దీంతో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు అంతర్జాతీయంగా వివిధ దేశాలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. శతృపక్షంపై బాంబు దాడులు చేయడం, వారి సిగ్నలింగ్ వ్యవస్థను జామ్ చేయడం, శతృశిబిరంలో ఫోటోలు, విడియోలు తీసుకురావడం, తమ సైన్యానికి క్లిష్ట సమయాల్లో ఆహారం, సమాచారం అందించేందుకు డోన్‌లను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వివిధ దేశాల వద్ద మిలిటరీ డ్రోన్‌లు వివరాలను పరిశీలిస్తే టాప్ టెన్ దేశాలు వద్ద ఉన్న సంఖ్య ఇలా ఉంది.

**అమెరికా – 13,000, టర్కీ – 1,421, పోలాండ్ – 1,209, రష్యా – 1,050, జర్మనీ – 670, ఇండియా – 625, ఫ్రాన్స్ – 591, ఆస్ట్రేలియా – 557, దక్షిణ కొరియా – 518, ఫిన్‌లాండ్ –412**



## మిలిటరీ సూపర్ పవర్‌గా మారుతాం : కిమ్ జాంగ్ ఉన్

**సియోల్ :** మిలిటరీ సూపర్ పవర్‌గా, ప్రధాన అణు శక్తిగా మారేందుకు ముమ్మర కృషి చేస్తున్నట్లు ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ ఉన్ అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ నేషనల్ డిఫెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ కొరియా ద్వీపకల్పంలో వ్యూహాత్మక సమతూకాన్ని ఉల్లంఘిస్తే అది యుద్ధమే అవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతికూలతలను నియంత్రించేందుకు, పరిస్థితిని నియంత్రణలో ఉంచుకునేందుకు మిలిటరీ సూపర్‌పవర్‌గా, అణు శక్తిగా మారే దిశగా అడుగులు వేస్తున్నామని కిమ్ అన్నారు. అమెరికా, కొరియా రిపబ్లిక్‌ల మిలిటరీ కూటమి సంపూర్ణంగా అణు ఆధారితంగా మారిపోయాయని, కాబట్టి తాము కూడా అత్యున్నత స్థాయిలో మిలిటరీ సంసిద్ధత కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలో అతి పెద్ద అణు శక్తితో తలపడేందుకు తాము అణ్వాయుధాలను ప్రయోగిస్తామని కిమ్ హెచ్చరించారు.

## ఉక్రేన్ కీలక పట్టణంపై రష్యా పట్టు




ఉత్తర ఉక్రేన్‌లోని వ్యూహాత్మక పట్టణం టొరెట్స్క్‌లోకి రష్యా బలగాలు మంగళవారం నాడు ప్రవేశించాయి. ఈ ప్రాంతం కోసం దీర్ఘకాలంగా పోరు సాగుతోంది. ఈ విషయాన్ని ఉక్రేయిన్ మిలిటరీ ధృవీకరించింది. టొరెట్స్క్ పట్టణంలో సోమవారం అర్థరాత్రి భీకర పోరు సాగినట్లు వెల్లడించింది. డోనెట్స్క్ ప్రాంతంపై మాస్కో నియంత్రణకు టొరెట్స్క్ పట్టణం ఆధీనం చేసుకోవడం కీలక పరిణామం. పరిస్థితి అస్థిరంగా ఉందని, పట్టణంలోని ప్రతి ప్రవేశ ద్వారం వద్ద పోరు సాగుతోందని ఉక్రేన్ మిలిటరీ అధికార ప్రతినిధి అనస్తాసియా బొబొవ్నికోవా తెలిపారు. గత ఆగస్టు నుంచి ఈ పట్టణాన్ని కైవసం చేసుకునేందుకు రష్యా ముమ్మర యత్నాలు సాగించింది. చుట్టుపక్కల గ్రామాలను స్వాధీనం చేసుకుంటూ తాజాగా టొరెట్స్క్ పట్టణం శివారులో ప్రవేశించింది.





## హ్యారీస్‌కు స్వల్ప ఆధిక్యత

**వాషింగ్టన్ :** డెమొక్రాట్ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారీస్ తన సమీప రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై స్వల్ప ఆధిక్యత సాధించింది. రాయ్‌టర్స్, ఐపోస్స్ పోల్‌లో కమలాకు 46 శాతం పాయింట్‌లు రాగా, ట్రంప్‌కు 43 శాతం లభించాయి. నాలుగు రోజుల పోల్ సర్వేలో ఈ ఫలితాలు వచ్చాయి. సెప్టెంబర్‌లో ట్రంప్ 6 శాతం పాయింట్‌లతో వెనుకబడగా, అది మూడు శాతానికి తగ్గింది. ఆర్థిక అంశాలే ప్రధానమైనవని పోల్‌లో పాల్గొన్నవారు తెలిపారు. జీవన వ్యయం సమస్యను పరిష్కరించడంలో ట్రంప్ వైఖరి సరైందని 44 శాతం మంది భావించగా, హ్యారీస్‌కు 38 శాతమే మద్దతు పలికారు.

### బంగ్లాదేశ్‌లో రాజ్యాంగ సంస్కరణ కమిషన్ ఏర్పాటు

**ఢాకా :** రాజ్యాంగాన్ని సమీక్షించి, అవసరమైన సిఫార్సులను కోరుతూ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తొమ్మిది మందితో కూడిన రాజ్యాంగ సంస్కరణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్ – అమెరికన్ ప్రొఫెసర్ అలీ రియాన్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ 90 రోజులలో బంగ్లాదేశ్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం వార్తా సంస్థ బిఎస్ఎస్ తెలిపింది. కమిషన్‌లో విద్యార్థి ప్రతినిధిగా మహ్‌ఫూజ్ ఆలం, ఢాకా యూనివర్సిటీ న్యాయ విభాగ ప్రొఫెసర్‌లు సుమయ్యా ఖైర్, ముహమ్మద్ ఇక్రాముల్ హఖ్, బారిస్టర్ ఇమ్రాన్ సిద్దిఖీ, సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ షరీఫ్ భుయాన్, బారిస్టర్ ఎం.మొయిన్ ఆలం ఫిరోజీ, రచయిత ఫిరోజ్ అహ్మద్, రచయిత, మానవహక్కుల కార్యకర్త ముస్తేన్ బిల్లాలు సభ్యులుగా ఉంటారు.

## సోలార్ ప్యానెల్స్

(3వ పేజీ తరువాయి)

పెడుతున్నామని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు, స్కావెంజర్లు, మిషన్ భగీరథ కార్మికులు, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్, కాస్మోటిక్ ఛార్జీలు తదితర చెల్లింపులు ప్రారంభించామన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ బిల్లులను కూడా చెల్లిస్తున్నామన్నారు. మూసీ నది సుందరీకరణపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వం మాదిరి కేసిఆర్ నిర్ణయంతోనే ప్రభుత్వం నడిచినట్లు మా ప్రభుత్వం నడవదని మంత్రి వర్గం కూర్చుని ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటామని భట్టి తెలిపారు. ప్రజాస్వామిక పద్ధతిలో పాలన సాగిస్తున్నామని విశ్వ నగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటున్న తరుణంలో ఇక్కడ ప్రకృతి వనరులను సంపదగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బిఆర్ఎస్ చేయలేని పని కాంగ్రెస్ చేస్తున్నందుకు విమర్శలు వ్యక్తమవుతున్నాయని ఆయన ఆరోపించారు. బలవంతంగా ఖాళీ చేయించకుండా అక్కడ నివసించే వారికి మెరుగైన వసతులు, నివాసం కల్పించిన తర్వాతే ఖాళీ చేయిస్తామన్నారు. పేద ప్రజలు మురికిలో మగ్గుతుంటే దానిని పట్టించుకోకుండా వారిని అక్కడే ఉంచాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి, ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఎంఎల్‌ఎలు రాందాస్ నాయక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులు

(3వ పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ఆనాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా మారుస్తానని ఆర్భాటం చేసి ఆర్టిజన్లు అనే ముద్దు పేరుతో కార్మికుల జీవితాల్లోకి చికటి నింపారని కూనంనేని సాంబశివరాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న విద్యుత్ రంగ ఆర్టిజన్ కార్మికులకు గత 10ఏండ్లుగా పదోన్నతులు లేకుండా వేతనాలు పెంచకుండా ఇబ్బందులపాలు చేస్తున్నారని నిరంతరం పరిశ్రమల్లో విద్యుత్ సరఫరాల్లో కీలకపాత్ర పోషిస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ఆర్టిజన్‌ల జీవితాలు ఇబ్బందుల పాలవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ చేసినటువంటి మోసాన్ని ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అందరికి వారి వారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు విద్యాసాగర్ గిరి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రవేటుపరం చేయాలని కుట్రలు పన్నుతున్నదని, ఇలాంటి దుర్మార్గమైనటువంటి ఆలోచనను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం మొత్తం ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్రాజ్, ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి వి.యస్.బోస్‌లు మాట్లాడుతూ ఆర్టిజన్ అంటే చిత్రకారుడని పదం వస్తుందని, నిరంతరం ప్రజలందరికి విద్యుత్తు అందిస్తూ వెలుగులు నింపుతున్న ఆర్టిజన్లు గత 10ఏండ్ల నుంచి ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారని తక్షణం ప్రభుత్వం ఆర్టిజన్లకు బేసిక్ పే తో కూడిన వేతనాలు, గ్రాట్యుటీ, పెన్షన్, కారుణ్య నియామకాలు చేపట్టాలని ఎపిఎస్ఇబి రూల్స్ అమలు చేసి ఆర్టిజన్స్ను కన్వర్ట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఎఐటియుసి కార్యదర్శులు శింగు నర్సింహ్మారావు, నరాటి ప్రసాద్, యూనియన్ నాయకులు తెలంగాణ ఎలక్ట్రిసిటీ అధ్యక్షులు రావుల మురళి, ఆర్టిషన్ నాయకులు బానోతు శంకర్, బండారి లక్ష్మయ్య, అల్లం ఓదేలు, కేలోతు క్రిష్ణ, రామయ్య, రాజునాయక్, ఉమా, రామయ్య, రవి, శారద, రాములు, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్టిజన్స్ నూతన రాష్ట్ర కమిటీ..**

గౌరవాధ్యక్షులుగా కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే కొత్తగూడెం, గౌరవ సలహాదారులు శింగు నర్సింహ్మారావు, రాష్ట్ర అధ్యక్షులు నరాటి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదేలు, రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి బి.లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శులుగా నూనావత్ రాజు నాయక్, కె.క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా యం.రామయ్య, పడిగే శారదలను ఎన్నుకోవటం జరిగింది.

## డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

(3వ పేజీ తరువాయి)

వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నామని, ఇప్పటి వరకు 8 వేల లైసెన్స్‌లను రద్దు చేసినట్టు వివరించారు. ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ వాహనాలు, ఆర్‌టిసి బస్సులు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయన్నారు. త్వరలోనే కొత్తగా 113 మంది వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల భర్తీ చేయబోతున్నామన్నారు. జిహెచ్ఎంసి ఉన్న వాహనాలు ఏదైనా నిబంధనలు పాటించాల్సిందేనని, ప్రభుత్వ వాహనాలకు కూడా నిబంధనలు వర్తిస్తాయని వివరించంఆరు. ఇరు రాష్ట్రాలకు సంబంధించిన రవాణా శాఖ అంశాలు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చిస్తారన్నారు. కర్నాటక,మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలు అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేసేలా జిఒ 28ను జారీ చేశామని పొన్నం వివరించారు.

**రూ.296 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్**

వాహనాల ఫిట్‌నెస్ చెకింగ్ నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాకు ఒక్కటి, హైదరాబాద్ జిల్లాకు నాలుగు చొప్పున మొత్తం 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నట్టు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఒక్క స్టేషన్‌కు రూ.8 కోట్ల చొప్పున మొత్తం రూ.296 కోట్లు ఖర్చు అవుతుందని వివరించారు. వచ్చే నెలలో రహదారులభద్రత వారోత్సవాలను ఈ సారి నెల రోజుల పాటు నిర్వహించనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

**స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేస్తే రాయితీ: ఇలంబర్తి**

రవాణ శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ 15 సంవత్సరాలు నిండిన వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేస్తే జీవిత ట్యాక్స్‌లో ఫీజు రాయితీ ఉంటుందని వెల్లడించారు. స్క్రాపింగ్ జరిగిన రెండు సంవత్సరాల వరకు ఎప్పుడు కొత్త వాహనం కొనుగోలు చేసినా, అందులో జీవిత ట్యాక్స్‌లో ఫీజు రాయితీ ఉంటుందన్నారు. పాత బకాయిలు ఉన్నా వాహనం స్క్రాప్‌కు వెళ్తే, వన్ టైమ్‌సెటిల్‌మెంట్ చేసేలా అవకాశం కల్పించామని వివరించారు. ప్రభుత్వ వాహనాల ప్రకారం సెక్షన్ 52ఎ ప్రకారం రెన్యువల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ చేయమన్నారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కు పంపించకుండా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అదనంగా టాక్స్ కట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు 8సంవత్సరాలలోపుప్రతి సంవత్సరం/ త్రైమాసిక పన్నుపై పది శాతం రాయితీ ఇస్తామన్నారు.

## ఆత్మ విమర్శ చేసుకోవాలి

(3వ పేజీ తరువాయి)

ఆయన సమాధానాలు చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. బిజెపితో ప్రజలు విసుగెత్తిపోయారన్న విషయం జమ్మూ కశ్మీరు ఎన్నికల్లో రుజువైందని చెప్పారు. ''ఇండియా'' కూటమి పార్టీలు పరస్పరం అవగాహనతో, విశ్వాసంతో కలిసి పనిచేయాలి. సీట్ల సర్దుబాట్ల విషయంలో పరస్పరం అనుకూల పద్ధతులలో సర్దుకుపోవాలి, హర్యానాలో అసలు ఇలా (బిజెపి గెలుపు) జరిగి ఉండకూడదు'' అన్నారు. జమ్మూ కశ్మీరులో ఎన్నికల ఫలితాలు బిజెపికి వ్యతిరేకంగా ఉన్నాయని, ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, జమ్మూ కశ్మీరులో బిజెపి అనుసరించిన వినాశకరమైన రాజకీయాలను ప్రజలు తోసిపుచ్చారని డి.రాజా అన్నారు. అఖిలభారతస్థాయిలో అన్ని రాష్ట్రాలలో ''ఇండియా'' కూటమి పార్టీలతో కాంగ్రెస్‌పార్టీ మరింత అనుకూలమైన పద్ధతులలో సీట్లసర్దుబాటువిషయంలో వ్యవహరించాలని కోరారు.

**బిజెపి రాతను గోడకే పరిమితం : తరిగమి**

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి రాసిన రాత గోడకే పరిమితమైందని, కేంద్ర ప్రభుత్వం, దాని విధానాలను వ్యతిరేకించిన జమ్ముకశ్మీర్ ఓటర్లు మాత్రం అధికారం మాదేనని విర్రవీగిన బిజెపికి తగిన బుద్ధి చెప్పారని సిపిఐ(ఎం)సీనియర్ నాయకుడు ఎంవై.తరిగమి ఎద్దేవా చేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎన్నికల ఫలితాల వార్తలు నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సి) కాంగ్రెస్ కూటమిదేనని వెలువడుతున్న నేపథ్యంలో తరిగమి స్పందించారు. తరిగమికి చెందిన సిపిఐ(ఎం)పార్టీ ఎన్‌సికాంగ్రెస్ కూటమిలో భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సందర్భంగా కూటమి హవా కొనసాగుతున్నదన్న వార్తల నేపథ్యంలో ఆయన మంగళవారం నాడు పిటిఐ' వీడియోలలో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌లో 2018సంవత్సరం నుంచి బ్యూరోక్రాట్లు, లెఫ్టినెంట్ గవర్నర్ పాలన సాగుతోంది తప్ప ప్రజల ప్రాతినిధ్యమే లేదన్నారు.'వారి పాలన కష్టాలను తీవ్రతరం చేస్తే, తాజాగా అవతరించనున్న సెక్యులర్ ప్రభుత్వంలో జమ్ముకశ్మీర్ ప్రజలు మంచిగా ఊపిరిపీల్చుకుంటారు' అని తరిగమి చెప్పారు. చాలాకాలం తర్వాత జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, ట్రెండ్ మంచిని ప్రోత్సాహించే విధంగా ఉండటం శుభపరిణామం అన్నారు. ఈ ఫలితాల ధోరణి చూస్తే సెక్యులర్ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే తాను విశ్వసిస్తున్నానని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో ఈ సారి కశ్మీర్‌లో కమలం వికసిస్తుందని బిజెపి చెప్పినప్పటికీ కమలం వికసించడానికి ఇది సరైన సమయం కాదని అన్నారు. బహుశా కమల వికాసం చూసేందుకు నిరీక్షించకుండా తొందర ఏమిటని ప్రశ్నించారు. పిడిపి ప్రసిడెంట్ మెహబూబా ముఫ్తీ నేషనల్ కాన్ఫరెన్స్‌కాంగ్రెస్ పార్టీ కూటమిలో భాగంగా ఉండి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ జమ్ముకశ్మీర్‌లో ఈ ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు సెక్యులర్, బిజెపి యేతర పార్టీలన్నీ ఏకం కావాలన్నారు. పిడిపి ఆలోచనా విధానం కూడా సెక్యులర్ మార్గంలోనే ఉంటాయని, అందువల్ల పిడిపి కూడా ప్రభుత్వ ఏర్పాటులో తనవంతు పాత్ర నిర్వర్తించాలని తరిగమి కోరారు.జమ్ముకశ్మీర్ అసెంబ్లీకి ఐదుగురు ఎమ్మెల్యేలను లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేయడం గురించి ప్రశ్నించగా అది 'పూర్తిగా అప్రజాస్వామికం' అని తరిగమి పేర్కొన్నారు.

## ఏక వ్యక్తి న్యాయకమిషన్

(3వ పేజీ తరువాయి)

సితక్కతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతాకుమారి,అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి,బి.సి కమిషన్ చైర్మన్ నిరంజన్,న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి, ఎస్.సి అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ ఐఎఎస్ అధికారులు బుర్రా వెంకటేశం, లోకేష్ కుమార్, దానకిశోర్, టి.కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ విషయంలో ఇప్పటికే అధికారుల బృందం తమిళనాడు,పంజాబ్ రాష్ట్రాలలో పర్యటించి అధ్యయనం చేసిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఉపకులాల వర్గీకరణ ఉంటుందని, అందుకు సంబంధించిన పూర్తి సమాచారం ఉద్యగ నియామకలతో సహా నివేదికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎస్‌సి వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు గాను మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల వారీగా పర్యటించ నున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు.మంత్రి సితక్క మాట్లాడుతూ కాలపరిమితి ప్రకారం ఎస్‌సి వర్గీకరణ అధ్యయనాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే యుద్ధప్రాతిపదికన బిసిల సాంఘిక, ఆర్థిక,ఓటర్ల గణన చేపట్టాలని సూచించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలన్నారు.

## తెలంగాణాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ కేంద్రం ఏర్పాటు : మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అహ్మదాబాద్ లోని ఎంట్రప్రెన్యూర్ షిప్ డెవలప్మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఇడిఐఐ) భాగస్వామ్యంతో తెలంగాణాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తితో ఉందని ఐటి,పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం ఇడిఐఐ డైరెక్టర్ జనరల్ డా. సునీల్ శుక్లా మంత్రిని కలిసి తమ సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ, వివిధ సంస్థల భాగస్వామ్యంతో ఒక కన్సార్టియం నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలో ఇడిఐఐ శిక్షణ కేంద్రాలు 17 రాష్ట్రాల్లో ఇప్పటికే ఏర్పాటయ్యాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణాలో ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ కేంద్రం ద్వారా వచ్చే నాలుగేళ్లలో 50 వేల మంది యువతకు మధ్య, చిన్న,తరహా, సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పేందుకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని ఆయన వివరించారు. ఏటా కనీసం 5 వేల మంది సొంతంగా ఉపాధి కల్పించుకునేలా, శిక్షణ తర్వాత 6 నెలల వరకు ఇడిసి సహకారం అందిస్తుందని చెప్పారు. కోవిడ్ సమయంలో అమ్మకాలు లేక నష్టపోయిన ఎంఎస్ ఎంఈ లకు ఆర్థిక సహకారం అందించి కోలుకునేలా చేస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్ కార్ట్ ఆన్లైన్ మార్కెటింగ్ సంస్థల తరహాలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒఎన్‌డిసి ప్లాట్ ఫాం ద్వారా ఉచితంగా మార్కెటింగ్ చేసుకోవచ్చని తెలిపారు. బేటీలో ఇడిఐఐ గోవా ఎంట్రప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ సెంటర్ ఇన్ ఛార్జి డా. అబ్దుల్ రజాక్ కూడా పాల్గొన్నారు.

## ఎన్‌సి–కాంగ్రెస్ గెలుపు

(3వ పేజీ తరువాయి)

చేసేందుకు ప్రజల తీర్పు పొందింది. కాంగ్రెస్ పార్టీ 37 స్థానాలు గెలుచుకుంది. దేవీలాల్ మనుమడు అభయ్‌సింగ్ చౌతాలాకు చెందిన ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ రెండుచోట్ల గెలిచింది. ఇతరులకు మూడుస్థానాలు లభించాయి. అరవింద్ కేజ్రీవాల్‌కు చెందిన ఆమ్ ఆద్మీపార్టీ ఒక్కసీటు కూడా గెలుచుకోలేదు. గెలిచిన ప్రముఖులలో నాయబ్‌సింగ్ సైని, భూపేందర్ సింగ్ హుడా, ఇండిపెండెంట్ సావిత్రి జిందాల్ ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన వినేశ్ ఫోగట్ జులనా నుండి గెలిచారు. ఓడిన ప్రముఖులలో అభయ్‌సింగ్ చౌతాలా ఉన్నారు. ఉదయం నుండీ ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్‌పార్టీ వెనుకంజలోనే ఉంది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాలలో కూడా అసెంబ్లీలకు ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో హర్యానా ఎన్నికల ఫలితాలు బిజెపిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. హర్యానాలో పది సంవత్సరాలు అధికారం చెలాయించిన తర్వాత బిజెపిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత సహజంగానే నెలకుని ఉంటుందని, మూడోసారి ఇక కాంగ్రెస్‌పార్టీయే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు ఎంతో ధీమాగా అంచనాలు వేశారు. కానీ చివరకు ఎగ్జిట్ పోల్స్‌ను కూడా ఈ ఫలితాలు తలకిందులు చేశాయి. ఇక మళ్ళీ నాయబ్ సింగ్ సైనీనే ముఖ్యమంత్రిగా బిజెపి ఎంచుకుంటుందని అందరూ భావిస్తున్నారు. ఐతే బిజెపి హర్యానా నాయకుడు అనిల్ విజ్ కూడా ముఖ్యమంత్రి పదవిపై కన్ను వేశారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తాను ఎంతో విశ్వాసంతో ఉన్నానని ఓట్ల లెక్కింపు జరుగుతున్న సమయంలోనే నాయబ్ సింగ్ సైనీ వ్యాఖ్యానించారు.

## ఈ నెలలోనే స్కిల్ వర్సిటీ

(3వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసేందుకు ప్రముఖ గ్లోబల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ కంపెనీ రెడింగ్టన్ ముందుకు వచ్చింది. దీనికి దాదాపు రూ.7 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడింది. లాజిస్టిక్స్ రంగానికి సంబంధించిరెండు షార్ట్ టర్మ్ కోర్సులను యూనివర్సిటీ ప్రారంభించనుంది. వేర్ హౌసింగ్ ఎగ్జ్యుటివ్, కీ కన్జైనర్ ఎగ్జిక్యూటివ్ పేర్లతో ఈ కోర్సులను నిర్వహిస్తుంది. వీటి నిర్వహణకు లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారం అందిస్తోంది. నర్సులకు ఉన్నతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సెలెన్స్ (ఎఫ్ఐఎన్ఇ) పినిషింగ్ కోర్సును యూనివర్సిటీ ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తోంది. అపోలో మెడ్ స్కిల్ లిమిటెట్‌తో కలిసి ఈ కోర్సు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

# చెరువులను గుర్తించేందుకు హైడ్రా భారీ కసరత్తు

**సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో సమీక్ష**

హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్‌కు చెరువులపై.. పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించిన సర్వే ఆఫ్ ఇండియా అధికారులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గొలుసుకట్టు చెరువులకు ప్రసిద్ధి చెందిన నగరంలో అసలు ఎన్ని చెరువులుండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయనే లెక్కలు తేల్చేందుకు సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి హైడ్రా పనిచేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో చెరువులను గుర్తించేందుకు మంగళవారం సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో హైడ్రా అధికారులు సమీక్ష చేపట్టారు. హబ్సిగూడలో ఉన్న సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి మంగళవారం హైడ్రా అధికారుల బృందంతో కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వెళ్లారు. సర్వే ఆఫ్ ఇండియా డైరక్టర్ బిసి పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబ్రత పాలిట్‌తో పాటు ఇతర అధికారులతో హైడ్రా ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన పాత మ్యాప్‌లను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. 1971–72 సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులు ఉన్నాయి. ఎంత విస్తీర్ణంలో ఉండేవి. ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి?, నాలాలు ఎలా.., ఎంత విస్తీర్ణంలో ఉండేవి. ఇప్పుడు ఎంత మేర కబ్జా అయ్యాయి అనే అంశాలు మ్యాప్‌ల ద్వారా పరిశీలించారు. దశాబ్దాల క్రితం నాటి మ్యాప్‌లతో పాటు.. నేటి పరిస్థితిని సరిపోల్చుతూ చెరువులు, నాలాల వివరాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా కమిషనర్‌కు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వివరించారు. ఇప్పటికే హెచ్ఎండిఏ, ఇరిగేషన్, జిహెచ్ఎంసి నుంచి సేకరించిన చెరువుల జాబితాతో.. సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి, చెరువులు, నాలాల పరిస్థితి, కనుమరుగైన చెరువులపై అవగాహన కల్పించారు. సర్వే ఆఫ్ ఇండియా అందించిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా సేకరించిన డేటాను డిజిటలైజేషన్‌తో పాటు.. అసలు చెరువుల విస్తీర్ణం ఎంత, నాలాల పొడవు, వెడల్పులను నిర్ధారించి, పూర్తి వివరాలతో నివేదికను సిద్ధం చేస్తున్నారు. చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లను శాస్త్రీయ విధానంలో నిర్ధారించిన అనంతరం చర్యలను చేపట్టేందుకు కసరత్తు చేయనున్నారు. ప్రాధాన్య క్రమంలో చెరువులను ఒక దాని తర్వాత ఒకటిగా పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టనుంది.

# సంప్రదాయం, ఆధునికత కలబోత తెలంగాణ

**లాస్ ఏంజెల్స్‌లో తెలంగాణ టూరిజం రోడ్ షోలో మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఘనమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం కేంద్రంగా పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనతో ముందుకెళుతున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు, వారసత్వాన్ని కాపాడుకునేందుకు.. నూతన పర్యాటక విధానాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణకు పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటకుల, ప్రపంచ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. లాస్ ఎంజెల్స్‌లోని డబుల్ ట్రీ హోటల్లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు , విదేశీ ప్రతినిధులు, పర్యాటకులు, అక్కడి అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయం, ఆధునికత రెండింటి కలబోత తెలంగాణ అని అభివర్ణించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వ సంపద, సహజమైన ప్రకృతి అందాలు, కనువిందు చేసే జలపాతాలు, నదులు, సెలయేర్లు, దేవాలయాలు, తెలంగాణ జానపద కళలు, ఎకో టూరిజం, మెడికల్ టూరిజం, బతుకమ్మ పండుగ గొప్పతనం, పెట్టుబడుల అవకాశాలను మంత్రి హైలైట్ చేశారు. రాష్ట్ర ప్రజల సాంస్కృతిక జీవన విధానాలు, ఆతిథ్య సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, పండుగలు పర్యాటకుల మనసులను దోచుకుంటాయని, కొత్త ప్రదేశాలను చుట్టేసి, కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకోవాలని అంతర్జాతీయ పర్యాటకులకు తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానం పలికారు. అలాగే పర్యాటకంతో పాటు తెలంగాణలో పెరుగుతున్న పెట్టుబడుల అవకాశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ నగరం దేశంలో మినీ ఇండియా గా ప్రసిద్ధి పొందిందని, ఆ నగరం ప్రపంచ స్థాయి ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు కేంద్ర బిందువుగా ఎదిగిందని పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ గురించి పరిచయం చేస్తూ, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఐటి, హెల్త్ కేర్, ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో అద్భుతమైన పెట్టుబడులు కల్పించుకోవచ్చని తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడిదారుల ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. ప్రకాష్ రెడ్డి, సాన్ ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా కాన్సుల్ జనరల్ చిట్టిరెడ్డి శ్రీపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు 10,006 అభ్యర్థులకు నియామక పత్రాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో బుధవారం నియామక పత్రాలను అందజేయనున్నారు. ఇటీవల 11,062 పోస్టులకు డిఎస్‌సి పరీక్షలు నిర్వహించారు.

ఇందులో 1056 పోస్టులు కోర్టు కే సులో ఉన్నందున మిగిలిన 10,006 మందికి ని యామకపత్రాలను అందజేయనున్నారు. ఇందు లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2629 పోస్టులు ఉండగా, 2515 నియమకపత్రాలను ఇవ్వనున్నారు. అలాగే 727 లాంగ్వేజ్ పండిత్ పోస్టులకు గాను 685 మందికి, 182 పిఇటి పోస్టుల కు గాను 145 మందికి, 6508 ఎస్‌జిటి పోస్టులకు గాను 6277 మందికి, 220 ఎస్ఎ పోస్టులకుగాను 103 మందికి,796 ఎస్‌జిటి పోస్టుల కు గాను 281 మొత్తం 11,062 పోస్టులకు గా ను 10,006 మందికి నియామక పత్రాలను అందజేయనున్నారు.

## ఎవరి మీద కక్షతో హైడ్రా?: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**'మూసీ' ప్రక్షాళనను ప్రారంభించిందే నాటి బిఆర్ఎస్ ప్రభుత్వమని,ఈ పనులకు రూ.16,500 కోట్లతో డిపిఆర్‌ను తయారు చేశామని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. హైడ్రా,మూసీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైందని ఆరోపించారు. బడే భాయ్ నోట్ల రద్దుతో ఏం తప్పు చేశారో, ఇక్కడ చోటా భాయ్ హైడ్రా విషయంలో అదే తప్పు చేశారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ హైడ్రాను ఎవరి మీద కక్షతో తెరపైకి తీసుకొచ్చారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ ఎవరి కోసమో చెప్పాలని, ఢిల్లీకి కప్పం కట్టేందుకే మూసీ సుందరీకరణ అని చెబుతున్నారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తాబేదార్ల కోసమే హైడ్రా, మూసీ వచ్చిందని ఆరోపించారు. మూసీ సుందరీకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగిందా?,దీనిపైన చర్చకు భట్టి విక్రమార్క సిద్ధమా అని జగదీష్ రెడ్డి అన్నారు. ఎఫ్‌టిఎల్‌లో ఉన్న ప్రాజెక్టులను కూలగొట్టే దమ్ము 'నీకు, నీ ముఖ్యమంత్రి'కి ఉన్నదా అని భట్టిని ప్రశ్నించారు. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని, ఉన్నత స్థాయి అధికారులు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండపడ్డారు. సోషల్ మీడియా వారిని చూసి భయపడుతున్న రేవంత్ రెడ్డికి కెసిఆర్ కావాలా అని ప్రశ్నించారు. స్థానిక పరిస్థితుల ఆధారంగానే హర్యానా ఎన్నికల్లో బిజెపి గెలిచిందన్నారు.

# రుణమాఫీకి మరో రూ.5వేల కోట్లు

**ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం**

**వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన రైతుల రూ.2లక్షల వరకు ఉన్న పంట రుణాలను నూటి కి నూరు శాతం ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి స్పష్టం చేశారు. రుణమాఫీపై బిజెపి, బిఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ మనుగడ కోసం ఇష్టానుసారంగా మాట్లాడుతూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి భవాని రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుండగానే ప్రభుత్వం ఏదో నిలిపి వేసినట్లు బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై గగ్గోలు పెడుతున్నారన్నారు. గత 10 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎందుకు లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేయలేకపోయిం దో చెప్పాలని కోదండరెడ్డి డిమాండ్ చేశారు. అ దేవిధంగా కేంద్రంలో వరసగా మూడోసారి అధికారం చెలాయిస్తున్న బిజెపి ఎప్పుడైనా ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలో రుణ మాఫీ చేయాల న్న కనీస అలోచన కూడ చేయలేదన్నారు. అలాం టి రాష్ట్ర అర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయి నా రైతులను అప్పుల ఊబిలో నుంచి బయటికి పడేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేస్తోందని, దీనిని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అభినందించాల్సింది పోయి అసంబద్ధంగా మాట్లాడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికే కేవలం 27 రోజుల్లో 22 ల క్షల మందికి రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసిందని, మిగిలిన వారి వివరాలు సరిగ్గా లేకపోవడం కారణంగా వాటిని సరి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే 10లక్షల దరఖాస్తుల్లో 6 లక్ష ల దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని, ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కాగానే అర్హులైన వారందరికీ రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రభు త్వం ముందుగా అనుకున్న రూ.31వేల కోట్లు మాత్రమే అవసరమైతే అదనంగా మరో రూ. 5వేల కోట్లు కూడ పెట్టేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

### ప్రజాధనం వృథా చేయం

ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా ప్రజలు కష్టపడి పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బులని, వీటిని గత ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలో దుర్వినియోగం చేయబోదని కోదండరెడ్డి తెలిపారు. అందుకే ప్రతి పథకం అమల్లోనూ ప్రభుత్వం ఆచి తూచి వ్యవహరిస్తోందన్నారు. రైతు భరోసాను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందని, వచ్చే పంట కాలం నుంచి అర్హులైన రైతులందరికీ రైతులకు రైతు భరోసా అందించబోతున్నామని కోదండరెడ్డి రైతులకు శుభవార్త చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యాటనపై బిఆర్ఎస్ ,బిజెపి పార్టీల నేతలు పదే పదే ఆరోపణలు చేయడం తప్ప ప్రతిపక్ష పార్టీలుగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సలహాలు, సూచనలు చేయలన్న కనీస సో యి కూడ లేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి గా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లడం తప్పా అన్ని ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తైవాన్ నుంచి పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా తెలంగాణా ఐటీ, పరిశ్రమల శాఖ, తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టిసిసి) సంస్థలు ద్వైపాక్షిక సహకార ఒప్పందపై సంతకాలు చేసాయి. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుంది. మంగళవారం రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టిజిఐఐజి) కార్యాలయంలో ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, టిసిసి ఉపాధ్యక్షుడు సైమన్ లీ మధ్య ఈ ఎంఓయూ జరిగింది. తైవాన్ నుంచి పెట్టుబడులను రాబట్టేందుకు టిసిసి హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. తైవాన్ కంపెనీలు రాష్ట్రంలోకి ప్రవేశించడంలో టిసిసి కీలక మాధ్యమంగా నిలుస్తుంది. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగింది. మార్కెట్ ఎంట్రీ అధ్యయనాలు, పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిచడం, తెలంగాణాను అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది.కార్యక్రమంలో ఇండియా తైపీ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ మన్హర్ సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

## కేంద్రం గుణపాఠం నేర్చుకోవాలి : ముఫ్తీ



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్ణయాత్మక తీర్పు నుంచి కేంద్ర ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ హితవుపలికారు. త్వరలో ఏర్పాటు కానున్న నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వ విజయంపై అభినందనలు తెలిపిన ఆమె, తమ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఎన్నికల ఫలితాల విడదల సందర్భంగా ముఫ్తీ మీడియాతో మాట్లాడారు. 'అద్భుతమైన విజయం సాధించినందుకు ఎన్‌సి నాయకత్వాన్ని అభినందిస్తున్నాను. ప్రజలు ముఖ్యంగా ఆగస్టు 5, 2019 తర్వాత అనేక సమస్యలను ఎదుర్కొన్నందున హంగ్ అసెంబ్లీ కాకుండా స్థిరమైన ప్రభుత్వం కోసం ఓటు వేసినందుకు జమ్ము కశ్మీర్ ప్రజలను అభినందించాలనుకుంటున్నాను. స్థిరమైన, బలమైన ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చాలా ముఖ్యమైనదని ముఫ్తీ పేర్కొన్నారు. స్పష్టమైన ఫలితాలు రాకపోతే కొంత దురదృష్టం జరిగేదన్నారు. ఈ తీర్పు నుంచి కేంద్రం గుణపాఠం నేర్చుకోవాలని, ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని పిడిపి అధినేత్రి పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వ వ్యవహారాలకు అడ్డుపడితే అంతకంటే ఘోరం మరొకటి ఉండదని ఆమె చెప్పారు. ఎన్‌సి,కాంగ్రెస్ కూటమి సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తుందని, బిజెపితో పోరాడుతుందని ప్రజలు భావించారన్నారు. కూటమి గెలుపునకు అదే అతిపెద్ద కారణం చెప్పారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో కూడా తమ పార్టీ కోసం పనిచేసిన నాయకులు, క్యాడర్‌కు పిడిపి చీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. గుండె నిబ్బరం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని, ఎన్నికలతో ప్రజల సమస్యలు తీరవని ఆమె పేర్కొన్నారు.

## జమ్ముకశ్మీర్‌లో ఖాతా తెరిచిన 'ఆమ్ ఆద్మీ'

**దోడా:** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆమ్ ఆద్మీ పార్టీ' (ఆప్) గెలుపు ఖాతా తెరిచింది. దోడా అసెంబ్లీ నియోజకవర్గంలో 'ఆప్' అభ్యర్థి మేహరాజ్ మాలిక్ గెలుపొందారు. తన సమీప బిజెపి ప్రత్యర్థి గజయ్ సింగ్ రాణాపై ఆయన 4,770 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. మాలిక్ గెలుపుతో పంజాబ్, గుజరాత్ తర్వాత మరో రాష్ట్రంలో 'ఆప్' ఖాతా తెరిచినట్టు అయింది. దోడా నియోజవర్గంలో గెలుపొందిన ఆప్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మేహరాన్ మాలిక్‌కు ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అభినందనలు తెలిపారు. బిజెపిపై మీరు చేసిన పోరాటం, గెలిచిన తీరు అభినందనీయని అన్నారు. ఈ గెలుపుతో ఐదో రాష్ట్రంలో ఆప్ అడుగుపెట్టిందని, ఇందుకు పార్టీ నేతలు, కార్యకర్తలందరినీ అభినందిస్తున్నానని ట్వీట్ చేశారు. మరోవైపు, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 'ఆప్'ను నిరాశపరచారు. మరి కొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలతో పాటు ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఆప్‌కు హర్యానా, జమ్ముకశ్మీర్ ఫలితాలు కీలకంగా మారాయి.

**అతివిశ్వాసం పనికిరాదు–కేజ్రీవాల్ :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఒంటరిగా బరిలోకి దిగి చతికిలబడింది. ఈ క్రమంలో అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల్లో అతివిశ్వాసం పనికిరాదని వ్యాఖ్యానించారు. ''ఎన్నికలు సమీపిస్తున్నాయి. వాటిని మనం తేలిగ్గా తీసుకోకూడదు. ఎప్పుడూ అతివిశ్వాసంతో ఉండకూడదనేది ఈ ఎన్నికలు నేర్పిన పాఠం. ప్రతి ఎన్నిక, ప్రతి స్థానం కఠినమైనదే. విజయం కోసం కష్టపడిపనిచేయాలి. అంతర్గత పోరు ఉండకూడదు'' అని పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఆప్.. ఈ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలడం బిజెపి లాభించిందనే చెప్పొచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసివస్తుందని అంచనా వేసిన హస్తం పార్టీ ఆశలు తలకిందులయ్యాయి. చివరకు ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తారుమారయ్యాయి. ఇక త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఫలితాలతో ఆప్ అప్రమత్తంగా వ్యవహరించనుంది.

# జమాత్, ఇంజనీర్ రషీద్, ఆజాద్.. అడ్రస్ గల్లంతు

**శ్రీనగర్:** పదేళ్ల తర్వాత జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వం ఏర్పడుతోంది. నేషనల్ కాన్ఫరెన్స్‌కాంగ్రెస్ కూటమి అధికార పగ్గాలు చేపట్టడం దాదాపు ఖాయం కా గా, చిన్న పార్టీలకు మాత్రం ఈ ఎన్నికల్లో గ్రహణం పట్టిం ది. ఈ పార్టీలు కూడా ఇటీవల వరకూ వార్తల్లో ప్రముఖంగానే ఉన్నప్పటికీ ఫలితాలు మాత్రం ఆ పార్టీలకు మొండిచేయి చూపించాయి. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నాటికి నిషేధిత 'జమాత్–ఇ–ఇస్లామి' ఎన్నికల ప్రక్రియలోకి అడుగుపెట్టింది. దశబ్దాలుగా ఎన్నికలను బహిష్కరిస్తూ వచ్చిన జమాతే ఈసారి ఎన్నికల్లో తనదైన ముద్ర వేసుకుంటుందని అంతా అంచనా వేశారు. ఇంజనీర్ రషీద్‌కు చెందిన అవామీ ఇత్తెహాద్ పార్టీ అనూహ్యంగా జమాత్‌తో వ్యూహాత్మక పొత్తు పెట్టుకుని బరిలోకి దిగింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాను ఇంజనీర్ రషీద్ ఓడించడంతో అంచనాలు కూడా ఎక్కువయ్యాయి. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో జమాత్ మద్దతుతో 10 మంది అభ్యర్థులు రంగంలోకి దిగారు. అయితే వారిలో కొంత మంది ఆ తర్వాత నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. జమా త్ మద్దతుతో దిగిన అభ్యర్థులంతా ఎన్నికల ఫలితాల కౌ టింగ్‌లో తమ తమ నియోజవర్గాల్లో వెనకబడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించిన ఇంజనీర్ రషీద్ 'మార్క్' ఎక్కడా అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించకపోవడం మరో విశేషం. ఆయన పార్టీ మద్దతిచ్చిన ఒకే ఒక అభ్యర్థి, అది కూడా ఇంజనీర్ రషీద్ తనయుడు ఖుర్షీద్ అహ్మద్ షేక్ మధ్యాహ్నం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి స్వల్ప ఆధిక్యంలో ఉన్నా రు. పిడిపి అభ్యర్థి ఆ తర్వాత రౌండ్లలో పుంజుకున్నారు.

### ఆజాద్‌కు చుక్కెదురు

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా కేంద్రంలో కీలక పదవు లు నిర్వహించిన గులాం నబీ ఆజాద్ 2022లో ఆ పార్టీతో తెగతెంపులు చేసుకుని సొంతంగా 'డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ ఆజాద్ పార్టీ'ని స్థాపించారు. ఆయన పార్టీ సైతం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ వెనకబడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆజాద్ పార్టీ మూడు స్థానాలకు పోటీ చేసి ఆ మూడింట్లోనూ ఓటమి చవిచూసింది. ఆ తర్వాత చాలా మంది నేతలు పార్టీని వీడారు.

### ఓటమికి కారణాలేంటి?

కాగా, ఈ పార్టీల ఓటమికి కారణాలేమిటనే దానిపై విశ్లేషకుల అంచనాలు మొదలయ్యాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌కాంగ్రెస్ కూటమి ఓట్లను చీల్చేందుకే బిజెపి ఈ పార్టీలను తెరపైకి తెచ్చిందనే అభిప్రాయాలు ఉండటమే ప్రధాన కారణంగా వీరు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రచారం కోసం ఇంజనీర్ రషీద్‌కు బెయిల్ ఇవ్వడం కూడా ఈ అభిప్రాయాలకు ఊతం ఇచ్చిందంటున్నారు. మెహబూబా ముఫ్తీకి బిజెపితో సాన్నిహిత్యం ఉందనే అభిప్రాయం కూ డా పిడిపిని దెబ్బతీసిందని అంటున్నారు. ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ సైతం శ్రీగుఫ్వారా–బిజెహార నియోజకవర్గం నుంచి ఓటమిని చవిచూశారు. 2018లో జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం కుప్పకూలేంత వరకూ బిజెపితో కలిసి మెహబూబా ముఫ్తీ ప్రభుత్వాన్ని నడిపారు. ఆ తర్వాత ఏడాదికి 370 అధికరణను కేంద్రం రద్దు చేసి జమ్ముకశ్మీర్ రాష్ట్రా న్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టింది.

## సిఎం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా మద్దతు ఇస్తాం



**ముంబయి :** మహారాష్ట్రను రక్షించుకునేందుకు మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్పి)లు ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా అందుకు తాము మద్దతు తెలుపుతామని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. మం గళవారం ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. వచ్చే నెలలో జరిగే అ సెంబ్లీ ఎన్నికలకు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో అడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా బూటకపు కథనాలను ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మహాయుతి ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన 'లడ్కీ బెహెన్'పై ఠాక్రే మండిపడ్డారు. ప్రజాసొమ్మును పథకాల ద్వారా వారికే ఇస్తూ 'మహారాష్ట్ర ధర్మం'కు ద్రోహం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. 288 అసెంబ్లీ స్థానాలకు వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యం లో మహారాష్ట్రను కాపాడేందుకు కాంగ్రెస్ లేదా ఎన్‌సిపి (ఎస్పి) ప్రకటించిన ఏ ముఖ్యమంత్రికై నా తాము మద్దతు ఇస్తామని ఠాక్రే చెప్పారు. అ యితే గతంలో ఎవరు ఎక్కువ సీట్లు గెలుస్తారు అ నే లాజిక్‌తో వెళ్లకుండా ముందుగా ఎంవిఎ తరుపున ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని థాక రే పట్టుబట్టిన విషయం తెలిసిందే. అయితే ఇప్పు డు మనసు మార్చుకుని కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) ప్రకటించిన ఏ అభ్యర్థికైనా తాను మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు.

## హర్యానా ఫలితాల్లో జాప్యం లేదు

**అన్నీ అసత్య ఆరోపణలే : ఇసి**




**న్యూఢిల్లీ :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువరించడంలో, ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించడంలో జాప్యం జరిగిందని, తాజా సమాచారాన్ని ఇవ్వడంలో ఇసి నత్తనడక నడిచిందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం సమాధానం ఇచ్చింది. ఈ ఆరోపణలకు విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు లేవని ఎన్నికల సంఘం స్పష్టం చేసిం ది. బాధ్యతారాహిత్యంగా, నిరాధారంగా, ఎలాంటి ప్రామాణికతలూ లేకుండా, మోసపూరితమైన మాటలతో పరోక్షంగా అసత్యానికి విశ్వసనీయత చేకూర్చే ప్రయత్నంగా ఉందని ఎన్నికల సంఘం ఘాటుగా స్పందించింది. అంతకుముందు మంగళవారం ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకూ ఎన్నికల ఫలితాల ప్రకటన మందగించిందని విమర్శిస్తూ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ ప్రధాన ఎన్నికల అధికారికి ఒక లేఖ రాశారు. హర్యానా ఎన్నికల అప్‌డేట్స్ వెలువరించడంలో నత్తనడక నడుస్తున్నారని, చాలా నెమ్మదిగా వ్యవహరిస్తూ జాప్యం చేస్తున్నారనీ, వివరింపసాధ్యంగాని రీతిలో నెమ్మళంగా వ్యవహరించారని ఆ లేఖలో విమర్శించారు. ఓట్ల లెక్కింపు వివరాలను తక్షణం ఎప్పటికప్పుడు ప్రకటించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రధాన ఎన్నికల అధికారిని జైరామ్ రమేశ్ ఆ లేఖలో కోరారు. ఈ లేఖను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అదే విధంగా మరో పోస్టింగ్ కూడా చేస్తూ, హర్యానా అదంపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చందర్ ప్రకాశ్ 1,426 ఓట్ల తేడాతో గెలిచినప్పటికీ ఎన్నికల సంఘం ఆ ఫలితాలను, సంబంధిత సర్టిఫికెట్‌ను వెబ్‌సైటులో ఇవ్వలేదని విమర్శించారు. ఈ జాప్యానికి కారణం వివరించాలని నిలదీశారు. ఐతే హర్యానా, జమ్మూ కశ్మీర్‌లలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మొత్తం అభ్యర్థులందరి సమక్షంలో జరిగిందని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది.

**జూడాల ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావంగా**

## 50మంది సీనియర్ డాక్టర్లు రాజీనామా

కోల్‌కతా : దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమై సంచలనం సృష్టిస్తున్నఆర్‌జి కర్ మెడికల్ కాలేజి,హాస్పిటల్ హత్యాచార ఘటనపై ఒకవైపు నిరసనలు పశ్చిమబెంగాల్ సర్కార్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, మరోపక్క మరికొందరు డాక్టర్లు ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ ఆమరణ నిరాహారదీక్షలలో పాల్గొనడం, వైద్యుల మూకుమ్మడి రాజీనామాలు మమతా బెనర్జీ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కోల్‌కతా ఆర్‌జి కర్ హాస్పిటల్‌లో ఆగస్టు 9న హత్యాచారానికి గురైన ట్రైనీ మహిళా డాక్టర్ అభయకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మెడికోలకు సంఘీభావంగా ఆర్‌జి కర్ హాస్పిటల్‌కు చెందిన 50మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. ప్రభుత్వఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌జి కర్ హాస్పిటల్‌లో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ల (హెచ్‌ఒడి)తో మంగళవారం ఉదయం జరిగిన ఒక సమావేశంలో సీనియర్ డాక్టర్లు అందరం ఈ మూకుమ్మడి నిర్ణయం తీసుకున్నామని వారు చెప్పారు. ఒక కారణం కోసం అలుపెరుగని నిరవధిక పోరాటం కొనసాగిస్తున్న యువ డాక్టర్లకు సంఘీభావం తెలియజేసేందుకే సమావేశంలో అప్పటికప్పుడు ఆర్‌జి కర్ హాస్పిటల్‌కు చెందిన 50మంది సీనియర్ డాక్టర్లు అందరం మూకుమ్మడిగా రాజీనామా పత్రాలపై సంతకాలు చేశాం అని సీనియర్ డాక్టర్ ఒకరు 'పిటిఐ'కు తెలియజేశారు. అయితే ఆర్‌జి కర్ హాస్పిటల్‌లోని తమ సహచరుల అడుగుజాడల్లోనే నడిచేందుకు ఎన్‌ఆర్‌ఎస్ మెడికల్ కాలేజి, హాస్పిటల్‌కు చెందిన సీనియర్ డాక్టర్లు సమాయత్తం అవుతున్నారని ఆయన చెప్పారు. ఆగస్టు 9న హత్యాచారానికి గురైన పోస్ట్ గ్రాడ్యుయేట్ మహిళా డాక్టర్‌కు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన జూనియర్ డాక్టర్లకు పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ డాక్టర్స్ (జెపిడి) కూడా సంఘీభావం ప్రకటించింది. ఆరోగ్య సంరక్షణ విధానంలో వేళ్లూనుకున్న అవినీతికి ముగింపు పలకాలనే డిమాండ్‌ను కూడా వారు ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లారు. గత నాలుగు రోజులుగా జూనియర్ డాక్టర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన లేదని జెపిడి ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆక్షేపించింది.

## తిరిగి భూవాతావరణంలోకి 'పిఎస్ఎల్‌వి–37'

**బెంగళూరు :**ఏడేళ్ళక్రితం అంతరిక్షంలోకి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి–సి 37 అవశేషభాగం అనుకున్నవిధంగానే తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అంతరిక్షంలో పేరుకుపోతున్న చెత్తను తొలగించేందుకు నిర్దేశించిన నిబంధనల మేరకు ఉపగ్రహాలను ప్రయోగించిన తర్వాత వాటి తాలూకు అవశేషాలు స్థిరకక్ష్యలలో ఉండకుండా దిగువభాగంలోకి చేరిపోవడం, తర్వాత సందర్భాన్ని బట్టి సముద్రజలాల్లో కూల్చివేయడం పరిపాటిగా ఉంటుంది. అంతర్జాతీయ అంతరిక్ష వ్యర్థాలకు సంబంధించిన నిబంధనల ప్రకారం 2030 నాటికి ఈ వ్యర్థాలను తొలగించి అంతరిక్షాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగానే ఇస్రో చేపట్టిన సానుకూల చర్యల్లో భాగంగా పిఎస్ఎల్‌వి–సి 37 వ్యర్థభాగం ముందుగా అనుకున్నవిధంగానే భూ వాతావరణంలోకి కిందికి వచ్చి చేరింది. 2017 ఫిబ్రవరి 17న ఈ వాహకనౌక 104 కంటే ఎక్కువ ఉపగ్రహాలను రికార్డుస్థాయిలో అంతరిక్షంలోకి మోసుకువెళ్ళింది. ఇందులో కార్టోశాట్–2డి కూడా ప్రధానమైన పేలోడ్‌గా ఉంది. దీంతోపాటు 103 ఉపగ్రహాలను ఇది మోసుకువెళ్లి చరిత్ర సృష్టించింది. దీనిని అంతరిక్షంలోకి పంపిన తర్వాత ఈ వ్యర్థ భాగం ఎగువభాగంలో ఉండేది. క్రమంగా క్షీణించింది. దీని కదలికలను ఇస్రో ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంది. ఈ ఏడాది సెప్టెంబరు నుండీ ఇస్రోకు చెందిన భద్రత, అంతరిక్ష కార్యకలాపాల సుస్థిర నిర్వహణా వ్యవస్థ (ఐఎస్4ఓఎం) దీనిని పరిశీలిస్తూనే ఉంది. ఇది అక్టోబరు మొదటివారం నాటికి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తుందని ఐఎస్4ఓఎం అంచనావేస్తున్నది. అందుకు అనుగుణంగానే ఇది ఈనెల 6వ తేదీన ఇది భూవాతావరణంలోకి వచ్చింది. ఇది ఉత్తర అట్లాంటిక్ సముద్రంపై కేంద్రీకృతమై ఉంది. అంతర్జాతీయ అంతరిక్ష వ్యర్థాల మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఎనిమిదేళ్ళకాలంలో దీనిని పరిష్కరించాల్సి ఉంది. ప్రస్తుతం అప్పర్‌స్టేజిలో ఉండే ఈ అంతరిక్ష వ్యర్థాల జీవిత కాలాన్ని ఐదు సంవత్సరాలకు తగ్గించారు. ఇంజన్‌ను రీస్టార్ట్ చేయడం ద్వారా దానిని స్థిరకక్ష్యనుండి మెల్లిగా కిందికి దించుతారు. పిఎస్ఎల్‌వి–సి 38, పిఎస్ఎల్‌వి–40, పిఎస్ఎల్‌వి–43, పిఎస్ఎల్‌వి–56, పిఎస్ఎల్‌వి–సి 58 తరహాలోనే దీనిని కూడా ఎత్తు తగ్గించి కిందికి దించుతారని ఇస్రో వర్గాలు మంగళవారంనాడు తెలియజేశాయి.



## కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** బతుకమ్మ పండుగ వేడుకలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో మంగళవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తొలత బతుకమ్మకు పూజ కార్యక్రమాలు నిర్వహించి మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగినులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలను ఘనంగా ఆటపాటలతో నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సంక్షేమ శాఖ అధికారిణి జరీనా, డి.ఆర్.డి ఓ నర్సింహులు, డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఇస్రా నాయక్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగినులుఅ అంగన్ వాడి టీచర్ లు, సఖి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రెటరీలతో రివ్యూ

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** మండల పరిషత్ కార్యాలయము ఉండవెల్లిలో పంచాయతీ సెక్రెటరీలతో రివ్యూ మీటింగ్ తీసుకోవడం జరిగింది ఈ సమావేశంలో గ్రామాలలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులు, ఎల్ఆర్ఎస్ ప్రగతి నివేదిక ఎంతవరకు వచ్చిందో అదేవిధంగా మహాలక్ష్మి గ్యాస్ లెటర్స్ పంపిణీ గురించి, మల్టీపర్పస్ వర్కర్స్‌కు జీతములు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ లో జమ చేయడం జరిగింది వాటిని మల్టీపర్పస్ వర్కర్స్ కొరకు జీతాలకు వినియోగించాలని చెప్పడం జరిగింది ఇతర అంశములపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశము లో చర్చించండి.



## శ్రీ మహాలక్ష్మీదేవిగా బంగారు మైసమ్మ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** దసర శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 44వ జాతీయ రహదారి పక్కన, ఐబి డాగ్ బంగ్లా సమీపంలో ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవత 6వ రోజు మంగళవారం శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కావేరమ్మపేట, జడ్చర్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్న కాశి విశ్వనాథ్ సుధ దంపతులు హాజరై ముందుగా గణపతి పూజ నిర్వహించి శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతకు అభిషేకం దేవి నవరాత్రోత్సవ ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించి అన్నం పాయసం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోనెల నరేందర్ మహేశ్వర దంపతులు, ఘనాతే విజయ్ కుమార్, భక్తులు శ్రీనివాసులు సీత, జయమ్మ, నరేష్ నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే వాకిటి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం / మాగనూర్ :** కొద్ది రోజుల క్రితం కరెంట్ షాక్‌తో మరణించిన రాకేష్ గౌడ్ కుటుంబానికి ఐదు లక్షల చెక్కును ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం అందించారు. మాగనూర్ మండల పరిధిలోని నేరడగం గ్రామానికి చెందిన తుంకూర్ రాకేష్ గౌడ్ కొద్ది రోజుల క్రితం కరెంట్ షాక్‌తో పొలం దగ్గర మరణించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడికి డిపార్ట్మెంట్‌తో మాట్లాడి ఆర్థిక సహాయం ఇప్పించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ , నాయకులు ఆనంద్ , మాజీ సర్పంచ్ ఆశోక్‌గౌడ్ , మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, ఎం. నాగరాజు, బాలప్ప, వెంకటేష్ , అంజప్పతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెక్కం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



**ప్రజాపక్షం / చిన్నంబావి:** దసరా పండుగను పురస్కరించుకొని బెక్కం గ్రామంలో బిపిఎల్ క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్ హాజరై క్రికెట్ పోటీలను ప్రారం భించారు. ఆటలు మానసిక ఉల్లాసా నికి , చక్కటి దేహదారుఢ్యానికి దోహ దపడతాయని యువకులు డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఆటలు ఆడి మంచి ఆరోగ్యాన్ని పొందాలని ఈ సందర్భంగా కొత్త కళ్యాణ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈదన్న, మాజీ సర్పంచ్ కురుమూర్తి, మాజీ ఉప సర్పంచ్ సుగుణరెడ్డి, మండడి కృష్ణ, బెక్కం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామస్వామి, హోటల్ రాముడు, కురుమూర్తి కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీను, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## రాజావారి ఆతిథ్యం స్వీకరించిన రాచాల

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి రాజావారు రాజా శ్రీకృష్ణదేవరావు, యువ రాజావారు ఆరుద్రదేవరావు లను బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి రాజావారు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వారు వనపర్తి జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాజావారిని కలిసిన వారిలో కావలి రాములు, సంపత్ కుమార్ రెడ్డి, గౌతమ్ శంకర్ గౌడ్ , మ్యాదరి రాజు తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా సరిహద్దుల్లోని పెబ్బేరు పోలీస్ స్టేషన్ రంగాపూర్ శివారులోని కృష్ణానది పక్కన ఒక గోదాంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీసులకు నమ్మదగిన సమాచారం. ఈ మేరకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు స్పెషల్ సిసిఎస్ , సిఐ రవిపాల్ , పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి, సిబ్బంది, వనపర్తి పోలీసులు సంయుక్తంగా పేకాట స్థావరంపై దాడి నిర్వహించి 15 మందిని అరెస్టు చేసి 6,35,600 నగదు , 4 కార్లు, 4 బైక్‌లు , 15 మొబైల్స్ ఫోన్‌లు స్వాదీనం చేసుకొని పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది.

# పోలీసు సిబ్బంది ఆయుధాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి

### జిల్లా ఎస్‌పి రావుల గిరిధర్



ప్రజాపక్షం / వనపర్తి : వనర్తి జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీసు అధికారులు సిబ్బందికి జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ పట్టాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ ఏడాది ఫైరింగ్ ప్రాక్టీసు 3 రోజులు నిర్వహించారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీసులో పోలీసులు వారి విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీసులో చేయించారు. ఒక్కొక్కరికి పది రౌండ్లు చేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సాయిదలాల అదనపు ఎస్పీ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫైరింగ్ చేసి ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు. జిల్లా ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టీసులో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అదేవిధంగా ఫైరింగ్‌లో ప్రతిభను కనబర్చిన పోలీసు అధికారులు , సిబ్బందినని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయుదాలను క్రమం తప్పకుండా శుభ్రపర్చుకోవాలని ఆదేశించారు. సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యమని మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించాలి. చెడు అలవాట్లకు లోనుకాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ , అప్పలనాయుడు, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లు, సురేందర్ , మగ్దం భారీ జిల్లాలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్య బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అక్టోబరు పది నుండి వారం రోజుల పాటు తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్, సండోజి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల వారిని మానసికంగా చైతన్య పరిచేందుకు తలపెట్టిన మానసిక ఆరోగ్య అవగాహన సదస్సులకు సంబంధించిన పూర్తి వివరాలతో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ కృష్ణగోపాల్ బండారి సంయుక్తంగా రూపొందించిన మానసిక ఆరోగ్య బ్రోచర్ ను సోమవారం సాయంత్రం రాష్ట్ర వైద్య అరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల పదవ తేదిన పిల్లలకు, పదకొండున టీనేజ్ వారికి, పన్నెండున యువతీ యువకులకు, పదమూడో తేదీన బాలికలు, స్త్రీలకు, పదునాల్గో తేదిన విద్యార్థులు, నిరుద్యోగులకు, పదిహేనో తేదీన తల్లిదండ్రులకు వారోత్సవాల ముగింపు రోజు పదహారో తేదీన వాయోవృద్ధుల కొరకు విడివిడిగా మానసిక ఆరోగ్య ఉపయోగాలు, మానసిక ఆరోగ్య అవగాహన సదస్సు లను నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు ఉచిత కన్సల్టేషన్, కౌన్సెలింగ్ సేవల కొరకు హెల్ప్ లైన్ నెంబర్ 9440488571 లేదా 04035717915 నెంబర్లపై ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మానసిక నిపుణులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో పాఠకులకు మెరుగైన సౌకర్యాలు

### జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** గ్రంథాలయానికి చదువుకోవడానికి వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సందర్శించారు. ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకం అయిన గోవర్ధన్ సాగర్ కలెక్టర్‌కు స్వాగతం పలకగా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రంథాలయంలో ఉన్న సదుపాయాలపై సిబ్బందితో ఆరా తీశారు. గ్రంథాలయానికి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం , దిన పత్రికల సౌలభ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ , కౌన్సిలర్లు, గ్రంథాలయం సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనలో పండుగ పూట పస్తులు!

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో మహిళల అతిపెద్ద పండుగ బతుకమ్మను సైతం మహిళ చిరుద్యోగులు సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడిందని.. ఆశాలు, అంగన్‌వాడీలు, పార్ట్ టైం లెక్చరర్లు పండుగ పూడ సైతం పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి 1వ తేదీన వేతనాలు వేతనాలు ఇస్తామని చెపుతున్నప్పటికి ఆచరణలో అమలుకావటం లేదన్నారు. పోలీసులకు పది నెలలుగా సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వటం లేదన్నారు. ప్రతి నెల హోంగార్డు జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారన్నారు. మున్సిపల్ ఆర్పీలకు సైతం మూడు నెలలుగా జీతాలు లేక పండుగను సంతోషంగా జరుపుకోవటం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు రాక ఇబ్బం ది పడుతున్నారన్నారు. ఆనందంగా జరుపుకోవాల్సిన పండుగలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలోవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ, ఉస్మానియా, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సైతం వేతనాలు సక్రమంగా రావటం లేదన్నారు. పండుగ పూట వేతనాలుఇవ్వక చిరు ఉద్యోగుల ఉసురు పోసుకుంటుంది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమని విమర్శించారు. అవ్వ,తాతాలకు, బీడి కార్మికులు, వితంతులు, దివ్యాంగులకు సైతం రెండు నెలల పింఛన్ పెండింగ్‌లో ఉందన్నారు. మూసి నది ప్రక్షాళన కోసం 1.50 లక్షలకోట్లు వెచ్చిస్తామన్న రేవంత్‌రెడ్డి సర్కార్ పెండింగ్‌లో ఉన్న రెండు నెలల పింఛన్ ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారంటీలను నమ్మి భవిష్యత్ కోసం కాంగ్రెస్‌ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసినయువతఒక్కసారి ఆలోచించాలన్నారు. ఈ దసరాకు మీ ఊళ్లకు వస్తున్న యువత కాంగ్రెస్ చేసిన మోసాన్ని కుటుంబసభ్యులకు వివరించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి రెండు లక్షలఉద్యోగాలు ఇస్తానని మో సం చేసిందన్నారు. నిరుద్యోగులకు 4వేల నిరుద్యోగ భృతి ఇస్తానని కాంగ్రెస్‌నేత ప్రియాం క గాంధీతో హామీనిప్పించారని, కాని ఆచరణలో అమలు చేయక మోసం చేశారన్నారు. పంటలు చేతికొచ్చిన పంటల పెట్టుబడి సాయం అందలేదన్నారు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి బోగస్ అన్న కాంగ్రెస్ మాటలపై చర్చించాలన్నారు. బియ్యంతో పాటు నిత్యవసర ధరలు కాంగ్రెస్ వచ్చాక బాగపెరిగాయన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపా రం ఆగం అయి లక్షల మంది రోడ్డున పడ్డారన్నారు.మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సంపత్, గుండు భూపేష్, శ్రీకాంత్‌రెడ్డి, ఏల్లారెడ్డి,ఎడ్ల సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అంతకు ముందు ఆశా వర్కర్లు తమకు వేతనాలు రావటం లేదని మాజీ మంత్రి హరీష్‌రావుతో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

# వయనాడ్ బాధితులకు త్వరగా సహాయం ఇవ్వండి

### కేంద్రానికి కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి

తిరువనంతపురం : వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలమంది మరణించిన ప్రకృతి విలయంలో బాధిత కుటుంబాలకు సత్వరం సహాయం అందజేయాలని కేరళ ప్రభుత్వం మంగళవారం నాడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మూడు నెలలు గడచినాగానీ కేంద్ర ప్రభుత్వం ఈ ప్రకృతి విలయానికి బలైన బాధిత కుటుంబాలకు చెప్పిన ప్రకారం ఎలాంటి సహాయం అందించలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. రాష్ట్రానికి సహాయం అందజేస్తామని కేంద్రం చెప్పిందని ఆయన గుర్తుచేశారు. ఈ ఏడాది జులై 30వ తేదీన వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో అపార ప్రాణ నష్టం, ఆస్తినష్టం వాటిల్లింది. ఛూరలశ్మాల, ముండక్కైలలో ఈ ప్రకృతి విలయం సంభవించింది. ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాలని కోరింది. ఈ విషయంలో కేంద్రానికి గట్టిగా విజ్ఞప్తి చేయాలని పినరయి విజయన్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రకృతి వైపరీత్య ప్రతిస్పందన నిధి కింద అదనపు సహాయాన్ని త్వరగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రానికి అండగా నిలబడేందుకు ఈ సహాయాన్ని త్వరగా ఇవ్వాలని మోదీ ప్రభుత్వాన్ని పినరయి విజయన్ పాలనాయంత్రాంగం విజ్ఞప్తి చేసింది. ప్రధానమంత్రికి ఈ మేరకు ప్రత్యక్ష విజ్ఞప్తి కూడా చేశారు. ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల రూ.1,200 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని తయారుచేసి కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వానికి అందజేశారు. అదనపు సహాయం ఇవ్వాలని కోరారు. పూర్తి వివరాలతో విజ్ఞాపన పత్రం అందించినాగానీ కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయం సంబంధిత నిధి నుండి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని విజయన్ ప్రభుత్వం విమర్శించింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఈ నెల 3వ తేదీన కేరళ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం చేసినట్లు ముఖ్యమంత్రి విజయన్ పేర్కొన్నారు. ఈ ప్రకృతి వైపరీత్యంవల్ల విరిగిపడిన కొండరాళ్ళు, మట్టిపెళ్ళలూ పున్నపురుఘా నదిలో ఎనిమిది కిలోమీటర్ల దూరం వరకూ ప్రవహించి కొట్టుకుపోయాయని, గంటలకు 100 కి.మీ వేగంతో ఈ వ్యర్థాలు ప్రయాణం చేశాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వాస్తవానికి కేవలం 20 నుండి 40 మీటర్లు మాత్రమే వెడల్పుగా ఉండే ఈ నది దీనివల్ల 200 నుండి 300 మీటర్లకు విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 231 మంది మరణించారు. 222 శరీర విడిభాగాలను ప్రమాద ప్రదేశం నుండి, మనలప్పురంలో ఛలియార్ నది నుండి సేకరించి ఒకచోటకు చేర్చారు. 17 కుటుంబాలకు చెందిన 58 మంది ఈ ప్రకృతి విలయంలో శిథిలమయ్యారు. ఆరుగురు పిల్లలతోసహా ఇరవైఒక్కమంది అనాథలుగా మారారు. 173 మృతదేహాలను, శరీరాలలోని విడి అవయవాలను కూడా గుర్తించారు. 212 శరీర అవయవాలను ఖననం చేశారు. 431 డిఎన్ఎ శాంపిల్స్‌ను పరీక్షించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకూ 64 మందిని గుర్తించారు. ఇంకా 47 మంది ప్రజలు జాడ తెలియకుండాపోయారని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వానికి సవివరంగా తెలియజేశారు.

# వైమానిక దళం ఎప్పటికప్పుడు మారాలి

### ఐఎఎఫ్ 92వ వార్షికోత్సవ పరేడ్‌లో భారత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్ సందేశం

**చెన్నై :** ప్రపంచ భద్రతా వాతావరణం స్థిరమైన ప్రవాహ స్థితిలో ఉన్నందున, ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను తీర్చుకోవడానికి భారత వైమానిక దళం (ఐ.ఎ.ఎఫ్) తనను తాను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారంనాడు భారత వైమానిక దళం 92వ దినోత్సవ ం సందర్భంగా చెన్నైకు సమీపంలోని తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద నిర్వహించిన పరేడ్ ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అమర్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు బలమైన, సమర్థవంతమైన వైమానిక దళాన్ని కలిగి ఉండాల్సిన అవసరాన్నిఈ ప్రదర్శన ప్రతిబింబించిందన్నారు. మన జాతీయ ప్రయోజనాలను సవాల్‌చేసే ఎలాంటి ఆకస్మిక పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత వైమానిక దళం ఎల్లవేళలా సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని అమర్‌ప్రీత్‌సింగ్ నొక్కిచెప్పారు. అందకు మనం మరిన్ని మెరుగైన సామర్థ్యాలను వినియోగించాలన్నారు. ఈనాటి బహుళ ప్రదేశాల వాతావరణంలో విమానం బయట ఆలోచనా విధానం నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. దీనికి నవకల్పనతోపాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం జోడిచాలని అమర్‌ప్రీత్‌సింగ్ సూచించారు. ఆధునిక యుద్ధంలో ఎప్పుడూ అభివృద్ధిచెందుతున్న సవాళ్లను స్వీకరించాలన్నారు. దీనికోసం వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం, నిర్వహణా సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా భారతీయ వైమానిక దళం గణనీయ పురోగతిని సాధించిందని తెలియజేశారు. ఈ ఏడాది భారతీయ వాయుసేన వార్షికోత్సవాన్ని జరుపుకోవడంలోని ముఖ్యోద్దేశాన్ని వివరిస్తూ 'సాక్షం, సశక్త్, ఆత్మనిర్భర్' ఈ మూడు అంశాలు మన ఆకాంక్షలను చక్కగా వర్ణించేవని అమర్‌ప్రీత్‌సింగ్ ఉదహరించారు.ఈ వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన పరేడ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసిన అధికారులను ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.



## కొనసాగుతున్న దేవీ నవరాత్రులు

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని కోనాపూర్ గ్రామంలో దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం లక్ష్మి దేవి అవతారంలో దుర్గాదేవికి ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మందరాజేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వాసు మల్లేష్, సందీప్‌రెడ్డి, అరుణ్, సురేష్‌తోపాటు ఆజాద్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ప్రారంభోత్సవానికి సిద్ధమైన అభివృద్ధిపనులు

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైనట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్‌తోపాటు అభివృద్ధిపనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దసరా వేడుకలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి పర్యటన ప్రారంభించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండారెడ్డిపల్లి అభివృద్ధి కమిటిచైర్మన్ సీఎం సోదరుడు ఎనుములకృష్ణారెడ్డి, మాజీజడ్పిటిసి కెవిన్‌రెడ్డి వేమారెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, బికెరెడ్డిపల్లి వెంకటయ్యయాదవ్, పర్వతాలు, రాఘవేందర్, వంశీ, అనిల్, జిల్లా వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా గణాంకదర్శన పుస్తకం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా ముఖ్య ప్రణాళికశాఖ తయారుచేసిన జిల్లా గణాంకదర్శిని జిల్లా హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్202223ను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ విడుదల చేశారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రమును ప్రగతిపథంలో నడిపించుటకు గణాంకాలు ఆయువుపట్టు అని ఈసమాచారం అందరికి ఉపయుక్తముగా ఉంటుందని తెలుపుతూ గణాంకశాఖ జివిఎస్‌డిపి తలసరి ఆదాయం లెక్కింపుచేసి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ప్రపంచానికి తెలుపుటలో తోడ్పడుతుందని తెలిపారు. ఈగణాంకదర్శిని పుస్తకంద్వారా గణాంకాలు రూపకల్పన , సమాచారం ఆధారంగా పలు నిర్ణయాలు తీసుకోవడంలో చాలా ఉపయోగకరంగా ఉంటుందని పలు అంశంపై సమాచారం సేకరణ , విశ్లేషణవలన జిల్లా అభివృద్ధికి తోడ్పడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి భూపాల్‌రెడ్డి, ఉపగణాంక అధికారులు, సీనియర్ సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## లలితాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా ఐదోరోజు అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వడం జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణరాష్ట్రహౌసింగ్ రెవెన్యూ సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ ట్రస్టుచైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, రమేష్, జగదీశ్వర్, శ్రీధర్, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పనులపై శిక్షణ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని సమావేశమందిరంలో మండల కార్యదర్శులకు ఉపాధిహామీ సిబ్బందికి ఉపాధిహామీ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడిఓ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ లేబర్‌బడ్జెట్ పనుల గుర్తింపు ఎలా చేసుకోవాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపిఓ లక్ష్మణ్‌నాయక్, శిక్షణ రిసోర్స్‌పర్సన్‌లు ఏపివో తాహిర్, నర్సింహ్మా, ఈశ్వర్‌జి, ఇసి దేవేందర్‌గౌడ్, కిషన్ పాల్గొన్నారు.

## నేడు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని వివిధ గ్రామాలకుచెందిన కల్యాణలక్ష్మి కి దరఖాస్తుచేసుకున్న లబ్ధిదారులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతులమీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను అందజేయనున్నట్లు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ గ్రామాలకు చెందిన 40మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి లబ్ధిదారులు విధిగాహాజరై చెక్కులను తీసుకోవాలని కోరారు.




## మాదకద్రవాల్య వినియోగంపై ఉక్కు పాదం మోపాలి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై అధికారులు ఉక్కు పాదం మోపాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ , అధ్యక్షులు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడారు. గంజాయి, కొకైన్ , నల్ల మందు, ఫెరాయిన్ తదితర మాదకద్రగ్యాలకు యువత విద్యార్థులు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వనపర్తి పట్టణంలో గతంలో గంజాయి పట్టుబడ్డ సందర్భాలు ఉన్నాయన్నారు. వీటివల్ల అనర్థాలను యువత విద్యార్థుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పేరెంట్స్ యువజన విద్యార్థి సంఘాల ద్వారా యువతలో చైతన్యం కలిగించాలన్నారు. జిల్లా కేంద్రంలో కేజి నుంచి పీజీ వరకు ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు అన్నగాళ్ల రమణ, విష్ణు, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ జిల్లా సమీకృత కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో భాగంగా సర్వే చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన వారిలో నిజమైన పేదలకు, అర్హత కలిగిన వారిని కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు అయ్యేలా రాజకీయ పార్టీలు పనిచేయాలన్నారు. మండలంలో పలు గ్రామాల్లో సిసి రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు సలాంకు ఎంపి రఘురాంరెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గుండె సంబంధిత చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాంను మంగళవారం ఆయన స్వగృహంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడు సలాం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నీటిపారుదల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, చంద్రశేఖర్, సిపిఐ త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, బోడా వీరన్న, ఎస్‌కె చానా, శేఖర్ నాయక్, మజీద్, యాకూబ్ జాని, ఖాసీం, పాషా, రెహ్మాన్, జహీరుద్దీన్, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.


## స్వాతంత్ర్య సమర యోధురాలు సామ్రాజ్యం మృతి

నివాళులర్పించిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/బోనకల్ :** బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు మందడపు సామ్రాజ్యం(90) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె మృతదేహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యదేవర పామీదత్‌లు కలిసి ఎర్ర జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సామ్రాజ్యానికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. సామ్రాజ్యం భర్త మందడపు పుల్లయ్య సిపిఐ నాయకుడిగా పనిచేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సొసైటీ డైరక్టర్ కొంగర రామారావు, శాఖ కార్యదర్శి గుడిద కృష్ణ, వంగాల నరసింహ, ఏలూరి రమేష్, సిపిఎం నాయకులు మందడపు శ్రీనివాసరావు, పారుపల్లి పూర్ణచంద్రరావు, మందడపు రామారావు, కాంగ్రెస్ నాయకులు గంగసాని రాఘవరావు తదితరులున్నారు.

## పారుపల్లిని పరామర్శించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు



**ప్రజాపక్షం/బోనకల్ :** మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు పారుపల్లి రాఘవయ్య కుమారుడు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు పారుపల్లి నరసింహారావుకు ఇటీవల వెన్నుముక శస్త్ర చికిత్స ఖమ్మంలోని ప్రవేట్ ఆసుపత్రిలో జరిగింది. మంగళవారం ఇటీవల పారుపల్లి రాఘవయ్యను ఆయన స్వగృహంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్‌కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సొసైటీ డైరక్టర్ కొంగర రామారావు, సిపిఐ శాఖ కార్యదర్శి గుడిద కృష్ణ, వంగాల నరసింహ, ఏలూరి రమేష్ తదితరులు పరామర్శించారు.




ఢిల్లీలో 79వ వియత్నం జాతీయ దినోత్సవ కార్యక్రమానికి హాజరైన సిపిఐ ప్రధాన కార్యాదర్శి డి.రాజా, కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ

# మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని తీరుస్తాం

పాలేరు రిజర్వాయర్‌లో 7 లక్షల చేప పిల్లలను వదిలిన మంత్రి పొంగులేటి





**ప్రజాపక్షం/కూసుమంచి :** కులవృత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ రాజ్యంలో వందశాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లలను విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం వద్ద ఎంపి రఘురాంరెడ్డి, రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ సాయి, ఐటిసి చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి 7 లక్షల చేప పిల్లలను పాలేరు రిజర్వాయర్‌లో వదిలారు. మరోదఫా మరో ఏడు లక్షల చేప పిల్లలను వదలనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల భారీవర్షాలు, వరదలతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, వారికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం తీరుస్తుందని హామీ ఇచ్చారు. వరదలతో ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్న వారికి త్వరలోనే ఇళ్లు ఇస్తామన్నారు. కూసుమంచి తహసీల్దార్‌ను వరద బాధిత కుటుంబాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపిఒ రామచంద్రరావు, మాజీ ఎంపిపిలు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, బానోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు మాదాసు, జొన్నలగడ్డ రవికుమార్, మంకెన శ్రీనివాసరావు, కేశవరెడ్డి, చాట్ల పరశురాం, బజ్జురు వెంకట్ రెడ్డి, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కొర్ర రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యం

**తిరుమలాయపాలెం :** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పర్యటించిన మంత్రి పొంగిలేటి, జల్లేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ అక్టోబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద కుటుంబ కార్డులు అందించేందుకు సర్వే జరుగుతుందనిన్నారు. కుటుంబ కార్డు ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, పెన్షన్, రుణమాఫీ మొదలగు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో 35మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు, 48 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఆర్‌డిఒ గణేష్, తహసీల్దార్ పివి. రామకృష్ణ, ఎంపిడిఒ సిలార్ సాహెబ్, ఎఒ సీతారామరెడ్డి, డిటి. నరసింహారావు, ఎంపిఒ సూర్యనారాయణ, ఎపిఎం అలివేలు మంగ, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు లహరి, వీరయ్య, పంచాయితీ కార్యదర్శులు రమేష్, సుజాత, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థినిని సన్మానించిన మంత్రి

**ఖమ్మంరూరల్ :** ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో సీటు సాధించిన వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన చిట్యాల లక్ష్మిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన విద్యార్థిని అభినందించి, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పాలేరు కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్‌నాయక్, మొహమ్మద్ హఫీజూద్దీన్, శేషిరెడ్డి పాల్గొన్నారు.



# విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే అధికారులపై చర్యలు

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/బోనకల్ :** ఫైలాన్ నిర్మాణంపై అధికారుల సమన్వయం లేకపోతే ఎలా అని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు సుకుంటామని హెచ్చరించారు. మంగళవారం మండలం పరిధిలోని గోవిందాపురంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 401లో ఇంటిగ్రేటెడ్ రెసిడేన్షియల్ స్కూల్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్‌కు ఫైలాన్ నిర్మాణం చేసే ప్రదేశాన్ని తొలుత అధికారులు ఇంటిగ్రేటెడ్ స్థలమంటూ అధికారులు చూపించారు. అక్కడే జిల్లా కలెక్టర్ వివరాలు అడగడంతో జిల్లా అర్‌అండ్‌బి ఎస్ఇ హేమలత, ఇఇ తానేశ్వర్, మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ అదే సమయంలో మరో చోటకు వెళ్ధామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు చూసిన స్థలం ఎవరిదని ప్రశ్నించారు. ఇది పట్టా భూమి అని, మరో కొద్ది దూరం ఉందని తహసీల్దార్ సమాధానం చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మీరు వచ్చి మూడు గంటలు అవుతుందని ఇంతవరకు ఏమి చేశారని ప్రశ్నించారు. సమన్వయం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఈ తీరు సరికాదని హెచ్చరించారు. కిలోమీటరు దూరంలో గల ఇంటిగ్రేటెడ్ స్థలం వెళ్లి అక్కడ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 11న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శంఖుస్థాపన చేసే కార్యక్రమం వివరాలు, సభ నిర్వహించే స్థలాన్ని ఎస్ఇ, ఎఇలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాధికారి ఏటూరి సోమశేఖర సభకు ఐదు వందల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. దీంతో కలెక్టర్ సభకు సరిపోయే విధంగా టెంట్‌లు, నీటి వసతి ఇతరత్ర ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎంపిడిఓ వివిఎస్ శాస్త్రి, ఆర్‌అండ్‌బిఈఈ శ్రీకాంత్, ఆర్‌ఐ లక్ష్మణ్, రెవెన్యూ, అర్‌అండ్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్ఫార్మర్ నెపంతో గిరిజనుడిని హతమార్చిన మావోయిస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** పోలీస్ ఇన్ఫార్మర్ అంటూ మావోయిస్టులు ఓ గిరిజనుడిని హతమార్చిన సంఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పోశంపల్లి అటవీ రేంజ్ పరిధిలో గల దుబ్బరపాడు గ్రామానికి చెందిన తాటికన్నయ్య మావోయిస్టుల సమాచారాన్ని చేరవేస్తూ పోలీస్ ఇన్ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, ఇంట్లో నిద్రిస్తున్న కన్నయ్యను మాట్లాడే పనుందని బయటకు తీసుకొచ్చి ప్రజాకోర్టు నిర్వహించి మావోయిస్టులు హతమార్చారు. కన్నయ్య 15సం.లుగా మావోయిస్టులకు సానుభూతిపరుడిగా వ్యవహరిస్తూ, దళ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడని, దళాల కీలక సమావేశాలు, ఏఏ నాయకులు హాజరవుతున్నారు, ఏ ప్రాంతంలో సమావేశం జరుగుతుందని అనే సమాచారాన్ని చేరవేయడంతో పాటు ఫొటోలు తీసి మరీ పోలీసులకు చేరవేస్తున్నట్లు మృతదేహం వద్ద వదిలిన పోస్టర్‌లో మావోయిస్టులు పేర్కొన్నారు. పోలీస్ ఇన్ఫార్మర్లుగా ఎవరు వ్యవహరించినా వారికి ఇదే గతి పడుతుందని మావోయిస్టులు హెచ్చరించారు. ఇన్‌ఫార్మర్ వ్యవస్థ కారణంగానే అత్యంత దట్టమైన అడవిలో రహస్యంగా జరిగే సమావేశాల వివరాలు బహిర్గతం అవుతున్నాయని, ఇలాంటి పద్దతులు మానుకోవాలని పోస్టర్‌లో హెచ్చరించారు.

## ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ

సిడిపిఒ ఉదయశ్రీ

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని సిడిపిఒ ఉదయశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలతో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ పల్లె జీవితాన్ని ప్రకృతి రమణీయతను



ఆవిష్కరించేలా పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. నృత్యాలతో, ఆటపాటలతో సంతోషంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్న అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గీత, స్వరుప, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్యసేవలు

అంకుర ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాలు

120 పడకలతో నేడు ప్రారంభం

మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నం కృష్ణప్రసాద్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అత్యాధునీక సౌకర్యాలతో ఖమ్మం ప్రజలకు వైద్య సేవలు అందించడమే అంకుర ఆసుపత్రి లక్ష్యమని వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉన్నం కృష్ణప్రసాద్ తెలిపారు. అంకుర ఆసుపత్రి నూతన భవన ప్రారంభోత్సవ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఉన్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్త్రీలు, పిల్లలకు సంబంధించిన అంశాలలో అంకుర ఆసుపత్రి ప్రత్యేక వైద్య చరిత్ర కలిగి ఉందన్నారు. అంకురా హాస్పటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలో దేశ వ్యాప్తంగా 14 కేంద్రాలలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్య సేవలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మంలో విశిష్ట సేవలను అందిస్తున్న అంకురా ఆసుపత్రి రోగులకు మెరుగైన సౌకర్యాలు, వైద్య సేవలను



అందించాలనే లక్ష్యంతో కొత్తగా 120 పడకల సామర్థ్యంతో నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ఈ నూతన భవనంలో అత్యాధునీక సాంకేతికతతో అన్ని వయస్సుల మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు అంకురా బృందం నిరంతరం పని చేస్తుందన్నారు. అంకురాలో నిపుణులైన శిశు వైద్యులు, ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్టులు, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది వైద్య సేవలను అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖమ్మం కేంద్రంలో అన్ని సౌకర్యాలతో ఆదివారం నూతన భవనంలో అంకురా ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అంకురా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల పాల్గొన్నారు.

# అభ్యంతరకర పోస్టింగ్‌లపై పోలీసులకు ఫిర్యాదు

తక్షణ చర్యలు తీసుకోండి : టియుడబ్ల్యూజె (ఐజెయు)



**ప్రజాపక్షం/ఖమ్మం :** అభ్యంతరకర పోస్టింగ్‌లు పెడుతూ యూనియన్ నేతలపై దుష్ప్రచారం చేస్తున్న గుద్దేటి రమేష్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ టియుడబ్ల్యూజె (ఐజెయు)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎసిపి రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. స్వయం ప్రకటిత ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఉన్న గుద్దేటి రమేష్ యూనియన్‌పైన, యూనియన్ నేతలపైనా స్థంభాద్రి హౌజింగ్ సొసైటీ బాధ్యులపైనా సోషల్ మీడియా గ్రూపుల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలను దూషించడంతో పాటు అనైతిక చర్యలకు పాల్పడుతున్నాడని, తన పోస్టింగ్‌ల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యక్తిగత నిందారోపణలకు పాల్పడుతున్నాడని తెలిపారు. అంతర్గత విషయాలను ప్రస్తావిస్తూ యూనియన్‌కు నష్టం చేయడంతో పాటు నేతల ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నాడని, వ్యక్తులను టార్గెట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడి నాయకులు ఎస్‌డి ఖదీర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి శివానంద, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి కూరాకుల గోపి, కోశాధికారి నామ పురుషోత్తం, సంఘం నాయకులు ఏనుగు వెంకటేశ్వరరావు, జనార్ధనాచారి, వేణుగోపాల్, సాగర్, నాగేందర్‌రెడ్డి, కళ్యాణ్, కె.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించండి

ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు షేక్ కరామత్ ఆలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** బకాయిపడిన నాలుగు వాయిదాల డిఎలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు షేక్ కరామత్ అలీ, ప్రధాన కార్యదర్శి దొడ్డా వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు కొణిజర్లలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మూడు వాయిదాల కరువుభత్యం విడుదల చేయకుండా బకాయి పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లోనే పెండింగ్ ఉన్న డిఎలు ఇస్తామని చెప్పి పదినెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించి జిపిఎఫ్, టిఎస్ జిఎల్ఐ, సప్లమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు గత పిఆర్సీ బకాయిలు మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్ తదితర వేలాది బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికి సంబందిత ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌రావు, సంఘం నాయకులు సైదా, అల్తాఫ్, శ్రీధర్, నరసింహారావు, ఫ్లలయ్యచారి, అరుణాకర్, జానకీరాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల నుంచి భూములు లాక్కోవద్దు

పరిశ్రమలకు కౌలుకు భూమి ఇవ్వాలి

టోల్‌గేట్ల వద్ద ట్రాక్టర్లకు మినహాయింపునివ్వాలి

ఎస్‌కెఎం దక్షిణ భారత సమావేశం



**బెంగళూరు :** రైతుల నుండి భూములు లాక్కోవడాన్ని ఆపాలని, పరిశ్రమలకు ఇచ్చే భూమి రైతుల పేరు మీదే ఉంచాలని, పరిశ్రమలకు వాటిని కౌలుకు ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) దక్షిణ భారతదేశ రాష్ట్రాల సదస్సు డిమాండ్ చేసింది. టోల్ గేట్ల దోపిడీ నుండి రైతులను కాపాడాలని, టోల్ గేట్లలో రైతుల వద్ద ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని కోరింది. అన్ని రాష్ట్రాల, జిల్లాల కేంద్రాలలో నవంబర్ 26న జరిగే రైతుల ప్రదర్శనలు విజయవంతం చేయాలని నిర్ణయించింది. నవంబర్ 15 లోపు రాష్ట్రాల సదస్సులు నిర్వహించాలని తీర్మానించింది. ఎస్‌కెఎం జాతీయ నాయకులు డాక్టర్ దర్శన్ పాల్, డాక్టర్ సునీలం, కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన బెంగళూరులో ఐదు దక్షిణ రాష్ట్రాల సదస్సు జరిగింది. సమావేశంలో చివరి సెషన్‌లో ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాలను మీడియా సమావేశంలో డాక్టర్ సునీలం, కృష్ణ ప్రసాద్, డాక్టర్ దర్శన్ పాల్, బిజు కృష్ణన్, రావుల వెంకయ్య, వడ్డే శోభనాద్రీశ్వరావు ఎక్స్ ఎంపి, పశ్య పద్మ, ప్రభాకర్, (తెలంగాణ) భయ్యా రెడ్డి( కర్ణాటక), బడగల పుర నాగేంద్ర, కే బాలకృష్ణ (తమిళ నాడు), దక్షిణ రాష్ట్రాల రైతు నాయకులు వెల్లడించారు. ఉద్యమాన్ని పటిష్టవంతం చేయటంలో ఆదివాసి, మహిళ, వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, భూమి సమస్యకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతుల నేతలు సూచించారు. రైతు అనుకూల పరిశ్రమలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ దోపిడి ఆరికట్టాలని, రైతులను రుణ ఊబిలో చిక్కుకోకుండా చూడాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పనిచేయాలని అన్నారు. సాగునీటి వాడకంపై చైతన్యం పెంచాలని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి. పర్యావరణ హితమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రైతు నేతలు కోరారు. జిఎం పంటలను విత్తనాలను వ్యతిరేకించాలని, చెరుకు రైతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూసేకరణ ఆపాలని,ప్రైవేట్ మార్కెట్‌లను ఏర్పాటు చేయవద్దని కోరారు. మతతత్వాన్ని వ్యతిరేకించాలని, ఆదివాసీలను వ్యవసాయ కూలీలను ,మహిళ రైతులను, కౌలు రైతులను ఎస్‌కెఎంలో భాగస్వామ్యం చేసుకోవాలని ఎస్‌కెఎం నేతలు సూచించారు. అన్ని స్థాయిలలో ఎస్‌కెఎం కమిటీలను ఏర్పాటు చేయాలని, సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని, విద్యుత్తు బిల్లును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ చేయవద్దని రైతులకు (57 సంవత్సరాలు నిండిన) అందరికీ నెలకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలి అని, పంటల భీమాను అమలు చేయాలని, ఈ డిమాండ్లతో పాటు స్థానికంగా ఉన్న డిమాండ్లను కలుపుకొని ఉద్యమాన్ని పోరాటాన్ని కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది.

## పనుల్లో నాణ్యత పాటించాల్సిందే

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏఎంఎస్ ఏజెన్సీ కాంట్రాక్టర్లతో ఎం.డి. మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. సకాలంలో పనులు చేపట్టడంతో పాటు నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్ 1 విజయరావు, సిజిఎంలు, జిఎంలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# మహానగరి

హైదరాబాద్ రంగారెడ్డి

## అమలుకానీ ఆరు గ్యారంటీలు

టిడిపి సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం దగ్గరకు వస్తున్నా నేటికి ఆరు హామీలకు అతిగతీ లేదని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మూసీ నది నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిచేసిందో చెప్పాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాల రాజ్ గౌడ్, రవీంద్రాచారి, శ్రీనివాస్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు పూర్తి

హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్‌లో ద్వారకా తిరుమల కాలనీ నుండి రెడ్డి కాలనీ వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రంకులైన్ నిర్మాణం పూర్తి చేస్తే కాలనీలపై వరద ప్రభావం లేకుండాపోతుందని ఆమె తెలిపారు. పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ మల్లికార్జున గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బిఆర్‌ఎస్‌కు లేదు

ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ శ్రీనునాయక్



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిన హక్కు బిఆర్‌ఎస్‌కు లేదని ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ శ్రీను నాయక్ విమర్శించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదని, షాద్‌నగర్ నుండి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బిఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు దేవగిరి నవీన్, వినోద్‌నాయక్, వేణు నాయక్, రాజు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు గాలికొదిలేసి.. మూసీలో మునిగితేలుతున్న సిఎం

సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను గాలికొదిలేసి మూసీ నది సుందరీకరణ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాల్‌ఛల్ చేయడం విడ్డూరంగా ఉందని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మెన్ రాజావరప్రసాద్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజావరప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి అధికారం రాగా నే గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు ఇవ్వాలని, లేని పక్షంతో అమరణ దీక్ష చేసేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ నేతలు గుండు అశోక్, రాజశేఖర్, సాయిలు ఉన్నారు.

## ఎంఇఒ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో గండిపేట్ మండల ఎంఇఒ కార్యాలయాన్ని రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎంఇఒ విజయ్ కుమార్, మేయర్ లత ప్రేమ్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేందర్,సాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, మల్లేష్, ప్రేమ్ కుమార్, సురేష్ గౌడ్, సంగారెడ్డి పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగించాలి

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ లోని టీచర్స్ కాలనీ పేస్2లో కాలనీ రోడ్లు ఆక్రమించి గేదెల షెడ్లు నిర్మాణం చేసిన వారిపై జిహెచ్‌ఎంసి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. మంగళవారం టీచర్స్ కాలనీ ఫేస్2లో నూతన సీసీ ఏర్పాటుకు రోడ్డును పరిశీలించగా పూర్తి గేదెల షెడ్డు ఉండడంతో వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కొత్ర శివ, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, సాయిరెడ్డి, భూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ డ్రైనేజీ సమస్యలు తలెత్తిన వెంటనే ఆప్రాంతానికి స్మార్ట్ ఎస్ఎస్‌సీజే మిషన్‌తో సిబ్బంది వెళ్లి సమస్యల పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సావిత్రి, డ్రైవర్ లక్ష్మీ కాంత్, యుజీడీ టీం అరుణ్, సంతోష్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనే లక్ష్యంగా వివక్షలేని సమాజం కోసం

# 'బతుకమ్మ' ఆడుదాం.. పాడుదాం

సిపిఐ మహిళా నేతల పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమసమాజ స్థాపనే లక్ష్యంగా వివక్షలేని సమాజంకోసం 'బతుకమ్మ' ఆడుదాం పాడుదాం అంటూ తెలంగాణ ఆడపడుచులకు సిపిఐ మహిళా నేతలు పిలుపునిచ్చారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి నేతృత్వంలో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో భాగంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 'వేపకాయల బతుకమ్మ' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జాతీయ సీనియర్ నాయకురాలు డా. బి.వి. విజయలక్ష్మి మాట్లాడుతూ చారిత్రాక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 'బతుకమ్మ' పాటలే మహిళా ఉద్యమకారులకు ప్రేరణ కలిగించాయని గుర్తు చేసారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిరంకుశ నిజాంకు వ్యతరేకంగా పోరాడేందుకు 'బతుకమ్మ' జానపద పాటలు కీలక పాత్ర పోషించాయని, ప్రజల సమీకరణకు, చైతన్యవంతం చేయడానికి ఎంతో తోడ్పడ్డాయని చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేది అట్టడుగువర్గాలేనని, వారి 'బతుకమ్మ' వంటి జానపద ఆట, పాటలే తెలంగాణ ఔన్నత్యాన్ని చాటుతున్నాయని తెలిపారు. భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ పూలను పూజించే బతుకమ్మ పండుగా తెలంగాణ కు మాత్రమే ప్రత్యేకమైనదని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుంటారని తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకురాలు పి. ప్రేమ్ పావని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో 'బతుకమ్మ' ఖండాంతరాలు దాటి విశ్వవ్యాప్తమైందన్నారు. అంతకు ముందు హైదరాబాద్, హిమాయత్ నగర్ ఎఐటియూసి కార్యాలయం నుండి నిలోఫర్ కేఫ్ పార్కింగ్ గ్రౌండ్ వరకు డప్పు చప్పుళ్ళు, మహిళల కోలాటాల ప్రదర్శనలతో సిపిఐ మహిళా శ్రేణులు రంగురంగుల ఫులతో పేర్చిన 'బతుకమ్మలతో ఊరేగింపుకు వెళ్లారు. అక్కడ మహిళలంతా తెలంగాణ అస్తిత్వాన్ని చాటుతూ అలంకరించిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ తమ అట, పాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం ట్యాంక్ బండ్ లో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ, వి.ఎస్. బోస్, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి. బి. స్టాలిన్, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహలు ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎఫ్.ఐ, డబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం. సదాలక్ష్మి, నేతలు పడాల నళిని, శ్రీదేవి, లక్ష్మి, కృష్ణవేణి, శివాని పాల్గొన్నారు.






## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం కమిషనర్ ఆమ్రపాలి చార్మినార్ జోన్‌లోని అత్తాపూర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్, మీర్ ఆలం ట్యాంక్, బహదూర్ పుర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ, స్థితిగతులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఈ విషయంలో ప్రజలకు పరిశుభ్రత పాటించేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటోల కదలికలను, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించేలా పర్యవేక్షించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. సి అండ్ డి వేస్ట్‌ను ప్రత్యేక వాహనాల ద్వారా తరలించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై ఏర్పడిన పాట్ హోల్స్‌ను పూడ్చి వేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వాణిజ్య ప్రాంతాలలో వ్యర్థాలు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రాజేంద్ర నగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను ఆదేశించారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు హర్షణీయం

జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గుజ్జ కృష్ణ మాట్లాడుతూ సుమారు రూ.5 వేల కోట్లు వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలతో ఒకే క్యాంపస్‌లో ఎస్.సి, ఎస్.టి. బిసి, మైనారిటీ విద్యార్థులు కోసం ఈ సంవత్సరమే అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ నిర్మించి ప్రారంభించడం శుభపరిమాణం అన్నారు. సమావేశంలో కోలా జనార్ధన్,నీల వెంకటేష్, నేతలు వేముల రామకృష్ణ, నంద కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



## చందనాఖాన్ మరణం పట్ల ఎఐటియుసి సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యాటకశాఖ మాజీ ముఖ్యకార్యదర్శి చందనాఖాన్ మరణం పట్ల ఎఐటియుసి తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో చందనాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి పర్యాటకశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ బోస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, ఎటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పల్లె నరసింహ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి,ఏఐటియుసి నగరనాయకులు చెట్టుకింద శ్రీను నివాళులర్పించారు.

## రూ.7వేల కోట్ల స్కామ్..20వేల మంది బాధితులు

హైదరాబాద్‌లో కూడా బాధితులు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మరో భారీ కుంభకోణం బయటపడింది. అధిక లాభాల పేరుతో డబ్బులు వసూలు చేసిన 'డిబి స్టాక్ బ్రోకింగ్ కంపెనీ' దుకాణం ఎత్తివేసింది. సుమారు రూ.7వేల కోట్ల స్కామ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా బాధితులు 20వేల మంది వరకు ఉంటారని అంచనా. అయితే హైదరాబాద్‌కు చెందిన కూడా ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోవడంతో సైబరబాద్ ఆర్థిక నేరాల విభాగంలో ఫిర్యాదు చేయడంతో డిబి స్టాక్ బ్రోకింగ్ చైర్మన్ అసోంకు చెందిన దీపాంకర్ బర్మన్‌తో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినటుల డిఎస్‌పి ప్రసాద్ తెలిపారు.ఇంకా కేసు దర్యాప్తులో ఉందన్నారు.. వచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన వారంతా సుమారు రూ6 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఈ కేసుకు సంబంధించి అసోంలో ఎఫ్ఐఆర్ చేశారని, నిందితుడి తండ్రిని ఇప్పటికే అరెస్టు చేయగా ప్రధాన నిందితులు పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితులు డిబి స్టాక్ బ్రోకింగ్ పేరుతో 2018 నుంచి బాధితుల నుంచి పెట్టుబడులు స్వీకరిస్తున్నట్లు తెలిసింది. అధిక వడ్డీ రాబడితో పథకాలను అందించడం ద్వారా వేలాది మంది క్లయింట్లను తనవైపు తిప్పుకున్నాడు. 120 శాతం వడ్డీతో వార్షిక, 54శాతంతో అర్ధ వార్షిక, 7 శాతం వడ్డీ అందించే నెలవారి పథకాలు వీరి సంస్థలో ఉన్నాయి. డిబి స్టాక్ బ్రోకింగ్‌లో రూ.11లక్షలు పెట్టుబడి పెట్టినట్లు సెప్టెంబర్ 23న పోలీసులకు ఫిర్యాదు చేశాడు బాధితుడు. అధిక వడ్డీ రిటర్న్స్ ఆశచూపి డబ్బు లు కట్టించుకున్నట్లు అతడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్కామ్ వెలుగు చూసింది.

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అమ్మవారి అశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండేందుకు కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని ఎంతో ప్రాచీనం విశిష్టి కలిగిన బంగారు మైసమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ముఖ్యఅతిథిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్, యువ నాయకుడు మధు, పులిమామిడి రాజేష్ గౌడ్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లడ్డు యాదవ్, ప్రదీప్ ముదిరాజ్, రాజేష్, నాగరాజు, సాయి రామన్, శంకర్, మనోజ్, అజయ్, అభిలాష్, శ్రీకాంత్, మంజునాథ్, రామస్వామి, రంజన్, సాయికిరణ్, హరీష్, వినయ్, కార్తీక్, దేవాలయ అర్చకులు మనీష్, మణికంఠ పాల్గొన్నారు.

### శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బిఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, హస్తినాపురం,హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలో కొలుదీరిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో ఏర్పాటు చేసి న అమ్మవారిని స్థానిక ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కాలనీ వాసులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు పి. కృష్ణ, రాజిరెడ్డి, సుమన్ గౌడ్, రవి ముదిరాజ్, శ్రీనాథ్, సదానంద్‌రెడ్డి, రాఘవేంద్రరావు, సతీష్, చరణ్, ఉమ మహేశ్వర్ పాల్గొన్నారు.



**చంపాపేట:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను దసర పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, చంపాపేట డివిజన్ పరిధి శుభోదయ కాలనీలో నెలకొల్పిన అమ్మవారిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఉత్సవ నిర్వాహకులు కాలనీ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు రవి ముదిరాజ్, శ్రీనాథ్, సదానంద్ రెడ్డి, ఉమ మహేశ్వర్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూల పండుగ బతుకమ్మ





రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రకృతిలో లభించే పూలను పూజించే వేడుక "బతుకమ్మ పండుగ" అని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమంలో కలెక్టర్ శశాంక ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డిఆర్ఓ సంగీతలతో కలిసి పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సిపిఓ సౌమ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, పిడి మెప్మా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ భవన్‌లో బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిడిపి రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత గడ్డి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో తెలుగు మహిళలు బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. కార్యక్రమంలో తిరునగరి జ్యోత్స్న, కాట్రగడ్డ ప్రసూన, సూర్యదేవర లత, మేక సుభాషిణి, ప్రమీల, సరస్వతి, ఆశాబిందు, సురేఖ, లలిత, శశికళ, మల్యావతి, జాన్సీ, అజ్మీరా ప్రేమలత, అజ్మీరా రాజునాయక్, శ్రీనివాసానాయుడు, మ్యాడం రామేశ్వర్ రావు, పోలంపల్లి అశోక్, పైడి గోపాల్ రెడ్డి, కసిరెడ్డి శేఖర్ రెడ్డి, వేజెండ్ల కిశోర్, శ్రీశైలం మహానంది, నాయుడు రామకోటేశ్వర్ రావు, రత్నాకర్‌రావు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## అమ్మవారికి కౌన్సిలర్ పూజలు



ప్రజాపక్షం/దమ్మాయిగూడ: దేవి నవరాత్రులను పురస్కరించుకుని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధలోని 5వ వార్డుల్లో పలు అమ్మవార్ల మండపాలను అరవ రోజు శ్రీ లక్ష్మి అవతారంలో నెలకొన్న అమ్మవారిని స్థానిక కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహకులు కౌన్సిలర్ దంపతులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వహక సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

మేడ్చల్ మల్కాజ్‌గిరి | వికారాబాద్

## నాగారం కమిషనర్ సిబ్బందితో సమావేశం



ప్రజాపక్షం/నాగారం: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంచార్జి కమిషనర్ నాగమణి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలి టీ కార్యాయలంలో డోర్ టు డోర్ చెత్త సేకరించే ఆటో డ్రైవర్లు, జవాన్‌ల తో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్షం చేయకుండా శుభ్రం చేయాలని, ఇంటి యజమానులను ఎక్కువ డబ్బులు డిమాండ్ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజన్ చంద్రశేఖర్,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బొంతు రామ్మోహన్‌కు సిపిఐ నాయకులు పరామర్శ



ప్రజాపక్షం/చర్లపల్లి: జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ ఇటీవల మృతి చెందడంతో సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బొంతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలు వారి నివాసంలో చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్‌రావు, కె ధర్మేంద్ర లు పాల్గొన్నారు.



## ఆటోస్టాండ్ కోసం వినతి

ప్రజాపక్షం/చర్లపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్‌ను కోరారు. చర్లపల్లి రైల్వే స్టేషన్(బిఆర్‌టియు)లో ఆటోస్టాండ్‌కు ఏర్పాటు కోసం ఎంపి రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ఇచ్చిన వినతిని రైల్వే డిఆర్‌ఎంకు పంపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామాంజనేయులు, గోపాల్ నాయక్, రమేష్, పి నరేష్, జయరాజ్, శ్రీనివాస్, నర్సింగ్‌నాయక్,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి పూజల్లో ఎంఎల్‌ఎ బండారి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని ఇంద్రనగర్ శివాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవిని సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. జంపాల్‌రెడ్డి, అంజయ్య, గణేష్, నవీన్‌గౌడ్, కుమార్, ప్రవీణ్, నిసార్, మల్లికార్జున, రాజు, సంతోష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'రావణ మేళా'కు పటిష్ట బందోబస్తు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: నేరేడ్‌మెట్‌లో జరుగునున్న రావణమేళ కార్యక్రమం దృష్ట్యా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని నేరేడ్‌మెట్ సిఐ సందీప్‌కుమార్ తెలిపారు. గత 23 ఏళ్లుగా కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలో మహాశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లను మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగ ఇనస్పెక్టర్ నరసింహాతో కల్సి పరిశీలించారు. నేరేడ్‌మెట్, మల్కాజిగిరిల ప్రధాన రహాదారిలో జరిగే ఈ కార్యక్రమం కారణంగా ఓల్డ్ పిఎస్ నుండి దీన్‌దయాల్ నగర్, సంతోషిమానగర కృప కాంప్లెక్స్‌ల మీదుగ ట్రాఫిక్ మళ్ళింపులు ఉంటాయన్నారు. నిర్వాహకులు జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కొడంగల్ అభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ ఎంఎల్‌ఎ : బిఆర్‌ఎస్‌పై ఫైర్

ప్రజాపక్షం / కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి అడ్డుకోవడమే కాకుండా రైతులను రెచ్చగొట్టి పాదయాత్రలు చేస్తే చూస్తే ఉరుకునేది లేదని కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజులు మాట్లాడుతు ఎన్నో ఏళ్ల తరువాత కొడంగల్ నియోజకవర్గం నుంచి మన ఎంఎల్‌ఏ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఎంతో హర్షించదగ్గ విషయమని అందులో బాగంగానే అన్ని రంగాలలో వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు యత్నిస్తున్న రేవంత్‌రెడ్డికి అడుగడున బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి అడ్డుపడటమే కాకుండా పేద మద్య తరగతి రైతులను రెచ్చగొట్టి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం మానుకోవాలని హితవుపలికారు. పట్నం నరేందర్‌రెడ్డి సొంత గ్రామ పరిసర ప్రాంతాలలో కంపెనీలు ఎందుకు ఉన్నాయని అక్కడ కంపెనీలు ఉండోచ్చు గాని ఇక్కడ ఉండకూడదా అంటు ప్రశ్నించారు. కొడంగల్‌లో కంపెనీలు వస్తే గ్రామ ప్రజలు చైతన్య వంతులు అవుతారు, విద్యావంతులు అవుతారు, ఉద్యోగ వంతులు అవుతారనే కుట్రతోనే ఈ పన్నగాలకు పూనుకోవడం విడ్డురంగా ఉందని తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి హయంలోనే కొడంగల్ నియోజకవర్గానికి వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు పనులు ప్రారంబం అవుతున్నాయని చెప్పుకోచ్చారు. నేడు మాజీ ఎంఎల్‌ఏ చేపట్టే పాదయాత్రను రద్దు చేసుకోవాలని లేని పక్షంలో తిరుగుబాటు చేసి తరమికోట్టక తప్పదని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నయ్యూం, ధాము, ఆసీఫ్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్‌టీ సెల్ తార్యానాయక్‌లతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16న కాప్రా ప్రెస్‌క్లబ్ ఎన్నికలు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు సభ్యుల సమక్షంలో అధికారికంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో కల్సి ఈ నెల 16న జరుగుతాయని కోర్ కమిటీ సభ్యులు మోతె వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఈసిఐఎల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్న 46 మంది పాత్రికేయులు ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసారు. సభ్యత్వ ప్రక్షాళన చేయనున్నామని, ప్రెస్‌క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం, సమన్వయం కోసం యత్నిస్తున్నామని, పూర్తి స్థాయిలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరికి వారు ప్రెస్‌క్లబ్‌తో నిమిత్తం లేకుండా కమిటీలు ప్రకటించుకొంటే చూస్తూ ఊరుకోమన్నారు. సీనియర్ పాత్రికేయులు భాస్కర్ రెడ్డి, మల్కయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

### పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉచిత వైద్య క్యాంపులతో ప్రమాదకరమైన వ్యాధులను ముందస్తుగా గుర్తించి, తగిన చికిత్సలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం కీమ్స్, సన్ షైన్ ఆస్పత్రుల సహకారంతో టీమ్ విమలాకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ విమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది జిహెచ్ఎంసి ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పరిశీలించా రు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిస్థితులను ముందుగానే తెలుసుకోవడం, అవసరమైన పరీక్షలను చేయించుకోవడం చాలా అవసరమన్నారు. క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులను ముందుగానే గుర్తించి త్వరితగతిన చికిత్స ప్రారంభించవచ్చున్నారు.

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి క్యాన్సర్ వంటి వ్యాధు లు కొన్నిసార్లు లక్షణాలు తెలియకపోవడంతో ఆ వ్యాధిని ముందుగానే గుర్తించడం కష్టం అవుతుందన్నారు. అలాం టి సందర్భాల్లో స్క్రీనింగ్ పరీక్షలు ముఖ్యమైనవని, దీంతో ఆరోగ్యపరమైన సమస్యలను ముందుగానే గుర్తించి, నిర్దిష్ట చికిత్స లు తీసుకోవచ్చన్నారు. ఈ క్యాంపు విజయవంతంగా నిర్వహించినందుకు డాక్టర్ విమలాకర్‌రెడ్డి, కీమ్స్, సన్ షైన్ హాస్పిటల్స్ యాజమాన్యం, డాక్టర్లకు, సిబ్బందికి మేయర్, డిప్యూటీ మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ, చీఫ్ ఎంటమలాజిస్ట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లాలో సుమారుగా 2లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని 2024–25 సీజన్‌కు సంబంధించిన కొనుగోలు ప్రారంభం కానున్న దృష్ట్యా జిన్నింగ్ మిల్లులు వద్ద అన్ని ఏర్పాట్లును పూర్తి చేయాలని అదేశించారు. పత్తి కొనుగోళ్లకు రైతుల అధార్ ప్రమానికమని,రైతులందరు తమ బ్యాంక్ అకౌంట్ ఖాతలను ఆదార్‌లో అనుసందానం చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ఫీడ్ కాని రైతుల లిస్టును ఏఇఓలు జారీ చేయలని తెలిపారు. పత్తి కనిస మద్దతు దర 7521 నుండి 7121 క్వింటాలు మద్దతు నిర్ణయించండ జరుగుతుంది అని అన్నారు. జిన్నింగు మిల్లుల వద్ద తగు ఏర్పాటు చేయాలని అధికారులను అదేవించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి అడిషన్ ఎస్‌పి రవిందర్‌రెడ్డిలు పాల్గోన్నారు.

**ప్రకృతి కే అందం మన బతుకమ్మ**

వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు బతుకమ్మ పండుగ కార్యక్రమంన్ని డిఆర్‌డిఎ డిబ్ల్యు ఓ అధికరుల ఆద్వర్మంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గోని మాట్లాడుతూ ప్రకృతికే అందం బతుకమ్మ సంబరమని ఇలాంటి బతుకమ్మ పండుగను కలెక్టర్ కార్యాలయంలో జరుపుకోడవం సంతోషింగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో మహి ళ ఉద్యోగులు అనందంగా ఉత్సహంగా పాల్గోని బతుకమ్మ అటలు పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్ ,కృష్ణావేణి, డిపిఆర్‌ఓ చేన్నమ తదితరులు పాల్గోన్నారు.


## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ ప్రధాన కార్యదర్శి రవీందర్

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ ప్రధాన కార్యదర్శి రవీందర్ అన్నారు. మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే ఎన్నికల ప్రచారానికి ముఖ్యఅతిథిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా డివిజనల్ ప్రధాన కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ రైల్వే కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ అనేక పోరాటాలు ప్రాణత్యాగాలు చేసి కార్మికులకు డిఎ కనీస వేతనం బోనస్ ఇప్పుడు మనం పొందుతున్న హక్కులను సాధించడం జరిగిందని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులను నైట్ పెట్రోల్ మేన్‌లను ఇద్దరినీవ్వాలని రైల్వేలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేసి కార్మికులపై ఉన్న పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అండగా ఉండి ప్రజా సమస్యలపై పోరాడే ఎర్రజెండా గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు వినయ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీ బి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ హరికృష్ణ, ప్రణయ్ కుమార్, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజలతోనే జీవితకాలం పయనం

### అభిమానులు, కార్యకర్తల మధ్య కోలాహలంగా కాంగ్రెస్ నేత కెఎస్ఆర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/ నిజాంపేట్ : నిరుపేద ప్రజలతోనే జీవిత కాలం పయనిస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్‌లో కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు, మున్సిపాలిటీలతో పాటు కాలనీలు, బస్తీల నుండి పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి శ్రీనివాస్ రెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి, దుర్గామాత ఆలయాల్లో కొలను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి నుండే అభిమానులు, కార్యకర్తల కోలాహలంతో కెఎస్ఆర్ పుట్టిన రోజు వేడుకలు అంబరాన్నంటాయి. అభిమానులు బాణాసంచాలను పెలుస్తూ, మేళ తాళాలతో అభిమానాన్ని చాటుకున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్‌లు ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, మేకల వెంకటేశం, చిట్ల దివాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల ను కృష్ణారెడ్డి, కొలను రాజశేఖర్ రెడ్డి, కొలను బాల్ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు విచ్చే సి జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన పై చూపిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతల ను తెలిపారు. తన జీవితం ఉన్నంత వరకు నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యతగా ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, కార్యకర్త ల అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని అన్నారు.

## సాంప్రదాయాలకు అద్దంపట్టేవే బతుకమ్మ వేడుకలు

### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే తొమ్మి ది రోజుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా మంగళవారం మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలరించి బతుకమ్మ ఆటపాటలతో ఆనందడోలికలతో ఘనంగా జరిపారు. బతుకమ్మలను ఒక్క చోటకు తీసుకొని వచ్చి వారంతా కల్సి పాటలకు అనుగుణంగా బతుకమ్మ ఆటలాడి చివర్లో ప్రసాదాలను పంచుకొన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగినులు బతుకమ్మలతో చేరి బతుకమ్మ ఆటలాడారు. ఈ కార్యక్రమంలో వారితో కల్సి పోయిన అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలు ఆకర్షణీయంగా నిలిచారు. తెలంగాణా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబురాల్లో జిల్లా ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన డిఆర్‌డిఓ, డిపిఓ, సిపిఓ శాఖల వారికి అదనపు కలెక్టర్ బహుమతుల రూపంలో పెద్ద బాలశిక్ష పుస్తకాలను బహూకరించారు.

## అనాథలకు ఆసరాగా 'అమ్మనాన్న' ఫౌండేషన్



ప్రజాపక్షం / కొడంగల్ : అనాథలకు ఆసరాగా నిలుస్తు వారి జీవితాలలో వెలుగులు నింపుతున్న అమ్మనాన్న ఫౌండేషన్ సభ్యులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటి డిఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్ అభినందించారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని రాఘవేంద్ర పంక్షన్ హాల్‌లో అనాథ పిల్లలకు, వికలాంగ అందత్వ పిల్లలకు దసరా పండుగ కానుకగా నిత్యవసర సరుకులతో పాటు వీల్ చైర్‌లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతు కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామానికి చెందిన మొగులప్పకు ఇద్దరు కుమారులు అంగవైకల్యాంతో పాటు అందత్వం కూడా ఉండటంతో వారికి వీల్ చైర్, దసరా పండుగ కానుకగా నిత్యవసర సరుకులను అందించడం జరిగింది. అదేవిధంగా పేద కుటుంబంలో ఉండి తల్లీదండ్రులను కోల్పోయిన అనాధ పిల్లలు కూడా తోటి వారితో సమానంగా ఉండేందుకు వారు ఎలాంటి మనస్థపానికి చెందకుండ సరుకులు అందించడం జరిగింది. ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడా దాదాపు 10 మంది పిల్లలకు సహాయ సహకారాలు చేయడం జరిగిందన్నారు. ఫౌండేషన్ సభ్యులు చేస్తున్న సమాజ సేవ చూస్తుంటే మేము కూడా స్వచ్ఛందంగా సేవలో పాల్గొన్నాలని బావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, తెలంగాణ విద్యవంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్, నవీన ఆదర్శ కాన్వేంట్ హైస్కూల్ ప్రిన్సిపల్ నరేష్ రాజ్, రిటైర్డ్ ఆర్మి వెంకట్‌రాములు, చంద్రు డాక్టర్, బోంకూర్‌నరేష్‌కుమార్, న్యాయవాది రవీందర్, శ్రీనివాస్‌లతో పాటు తదితరులు పాల్గోన్నారు.



## దశలవారీగా డివిజన్‌లో సిసి రోడ్డు పనులు : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

ప్రజాపక్షం/మల్కాజిగిరి: వినాయకనగర్ డివిజన్‌లోని కాకతీయనగర్ మెయిన్ రోడ్‌లో 70 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్ పనులు ప్రారంభమయ్యాయని స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. గత ఏడాది నుండి సిసి రోడ్ లేక ఇబ్బందులు పడుతున్న స్థానికుల కోరిక వినతుల మేరకు ఈ పనులను చేపట్టామని, దశలవారీగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ సిసి రోడ్ పనులు విస్తరిస్తామన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు పూర్తి చేయాలని ఆమె అన్నారు. జిహెచ్ఎంసి ఏఈ సత్యలక్ష్మి , క్వాలిటీ కంట్రోల్ డిఈ రాజ్యలక్ష్మి , వర్క్ ఇనస్పెక్టర్ సాగర్, వెంకటేష్, బిజెపికి చెందిన సురేష్, జగదీష్, రమేష్, ఓం ప్రకాష్, సోమనాథ్ చారీ, బస్తీకి చెందిన ప్రభాకర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో 83 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

### నేడు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్(డిఎస్‌సి2024) ప్రక్రియలో మేడ్చల్ జిల్లా నుండి 83 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరందరికి బుధవారం నగరంలోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అంద చేయనున్నారని జిల్లా విద్యాశాఖాధికారిణి విజయకుమారి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ఎల్‌బి స్టేడియంకు తీసుకొని కార్యక్రమ అనంతరం తిరిగి తీసుకొని వచ్చేందుకు రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసామని, బుధవారం ఉదయం 10 గంటలకు మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రావాలని డిఈఓ తెలిపారు.

## ఎస్‌సి సంఘం అధ్యక్షుడిగా సంజీవ

ప్రజాపక్షం/పోచారం : యునైటెట్ పోచారం మున్సిపాలిటీ ఎస్సీ సంఘం అధ్యక్షులు ఎం సంజీవ సంభ్యులందరూ కలిసి మొదటి వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం యునైటెడ్ ఎస్సీసంఘం రెండోసారి అధ్యక్షులుగా ఎం సజీవను సభ్యులు కలిసి ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా టి నరేష్, వైస్ ప్రెసిడెంట్‌గా బి రామచందర్, జనరల్ సెక్రెటరీగా ఈ హరి బాబు, జాయింట్ సెక్రటరీగా బి బాలు, కోశాధికారిగా జోగు సామ్యూల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ములుగు నర్సింగ్ రావు, ఎర్రోళ్ల నర్సింగ్ రావు, పి ఇసాక్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన ఎన్నుకోబడిన సభ్యులు కలిసి ఒకరికొకరికి స్వీట్లు తిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సంజీవ మాట్లాడుతూ రెండోసారి కూడా అధ్యక్ష పదవి కట్టపెట్టినందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



## తూంకుంటలో బతుకమ్మ సంబరాలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటిలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మహిళలు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. మంగళవారం తూంకుంట పురపాలక సంఘం ఆద్వర్యంలో బతుకమ్మ పండగ సంబరాలను ఘనంగా నిర్వహించా రు. బతుకమ్మలను అందంగా చూడముచ్చటగా పేర్చి ఆట పాటలతో అలరించారు.గ్రామీణ ప్రాంతంలోని మహిళలు సాంప్రదాయ దుస్తులు దరించి బతుకమ్మ పండగలో చురుకుగా పాల్గొని ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ రజిని వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటి డిఈఈ సునీత, ఆర్‌ఐ శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ రేణుక, తూంకుంట కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి, నాయకులు రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, అంగన్‌వాడి టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలలో అమ్మవారి ఊరేగింపు



ప్రజాపక్షం/అల్వాల్ : శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మచ్చ బొల్లారం డివిజన్ శ్రీ సాయి ఎంక్లేవ్ లోని అమ్మవారిని పల్లకిపై పురవీధులలో ఊరేగింపు నిర్వహించి కాలనీ వాసుల మీద అమ్మవారి ఆశీర్వాదం అనుగ్రహించాలని ఐదు రోజులుగా వివిధ అలంకరణలతో అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుందని ఉత్సవ కమిటీ వెల్లడించారు.

# క్రీడ

## నేడు టీమ్ ఇండియా - బంగ్లాదేశ్
# రెండో టి-20




**మూ**డు టీ 20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా టీమ్ ఇండియా – బంగ్లాదేశ్ మధ్య బుధవారం (అక్టోబర్ 9) రెండో టీ 20 జరగనుంది. ఢిల్లీ వేదికగా ఈ రెండో మ్యాచ్ జరగనుంది. అయితే తొలి పోరులో అలవోకగా గెలుపొందిన భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. అయితే శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ వంటి ముఖ్యమైన ప్లేయర్స్ లేకున్నప్పటికీ తొలి టీ 20లో భారత జట్టు సులభంగానే గెలుపొందింది. కానీ, ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్‌ను ఆశిస్తోంది. ఎందుకంటే మొదటి టీ20లో శాంసన్ 19 బంతుల్లో 29 పరుగులు మాత్రమే సాధించగా, అభిషేక్ శర్మ 7 బంతుల్లో 16 పరుగులు చేశాడు. రెండో టీ20 మ్యాచులో అభిషేక్ శర్మ, శాంసన్ జోడీ ఆరంభంలోనే దూకుడుగా ఆడి మంచి ఆరంభాన్ని అందిస్తే తర్వాత క్రీజులోకి దిగే ప్లేయర్స్ స్వేచ్ఛగా ఆడే ఛాన్స్ ఉంటుంది. తద్వారా జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం ఉంటుంది. టీమ్ ఇండియా తుది జట్టులో మార్పులు దాదాపుగా ఉండకపోవచ్చని తెలిసింది. యంగ్ పేసర్ మయాంక్ యాదవ్ మొదటి మ్యాచ్ లోనే సత్తా చాటాడు. రెండో టీ20లోనూ మయాంక్ అదే ఊపు ప్రదర్శిస్తే బంగ్లా బ్యాటర్లు తిప్పలు పడాల్సిందే. తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి మొదటి టీ 20లో రెండు ఓవర్లు వేసి పర్వాలేదనిపించాడు. బ్యాటింగ్‌లో 16* పరుగులు సాధించాడు. ఈ సందర్భంగా నితీశ్ జట్టులో స్థానం కాపాడుకోవాలంటే మరింత మెరుగైన ప్రదర్శన చేయాలి. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడితే టీమ్ ఇండియాకు తిరుగుండదనే చెప్పాలి. మూడేళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మొదటి టీ20లో మూడు వికెట్లు తీసి మంచి ప్రదర్శన చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ తన స్పిన్ మయాజాలాన్ని ప్రదర్శిస్తే భారత జట్టు గెలుపు సాధిస్తుందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఈ మ్యాచ్ దిల్లీ వేదికగా జరగనుంది.

## దక్షిణాఫ్రికాపై ఇంగ్లాండ్ ఘన విజయం..

**ఉ**మెన్స్ వరల్డ్ కప్2024లో ఇంగ్లండ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. గ్రూప్‌బీలో టాప్‌లోకి దూసుకెళ్లింది. షార్జా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో ఇంగ్లండ మహిళల జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో సౌతాఫ్రికాకు ఇది తొలి పరాజయం. తొలి మ్యాచ్లో సఫారీ సేన వెస్టిండీస్‌పై నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్‌వార్డ్ (42; 39 బంతుల్లో, 3 ఫోర్లు) టాప్ స్కోరర్. మరిజాన్ కాప్ (26; 17 బంతుల్లో, 3 ఫోర్లు), డెర్క్‌సన్ (20 నాటౌట్; 11 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశారు. సోఫీ ఎకిల్‌స్టోన్ రెండు వికెట్లు, సారా గ్లెన్, చార్లీ డీన్, లిన్సె స్మిత్ తలో వికెట్ తీశారు. ఓ దశలో సౌతాఫ్రికా 88/2తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ ఇంగ్లండ బౌలర్లు పుంజుకుని క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి స్కోరుబోర్డును కట్టడిచేశారు. అనంతరం ఛేదనలో ఇంగ్లండ 19.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. నాట్ సీవర్ (48 నాటౌట్; 36 బంతుల్, 6 ఫోర్లు), డానీ వ్యాట్ (43; 43 బంతుల్లో, 4 ఫోర్లు) సత్తాచాటారు.కాప్, మ్లాబా, నదైన్ డీక్లెర్క్ తలో వికెట్ తీశారు. ఛేదన ఆదిలోనే ఇంగ్లండ తొలి వికెట్ కోల్పోయింది. 16 పరుగులకే ఓపెనర్ బౌచియర్ (8) వెనుదిరిగింది. మరో ఓపెనర్ డానీ వ్యాట్ దక్షిణాఫ్రికాకు అవకాశం ఇవ్వకుండా క్యాప్సీ (19), నాట్ సీవర్‌తో ఇన్నింగ్స్ చక్కదిద్దింది. 18వ ఓవర్ వరకు క్రీజులో ఉండి లక్ష్యాన్ని కరిగించింది. డానీ వ్యాట్ ఔటైన తర్వాత మిగిలిన పనిని నాట్ సీవర పూర్తిచేసింది. తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ. బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది.




## మార్క్‌రమ్ మామకు నో ఛాన్స్..



**ఐ**పిఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ రూల్స్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి( బిసిసిఐ) ప్రకటించింది. అనూహ్యంగా మొత్తం ఆరుగురి ఆటగాళ్లను రిటైన్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఇందులో గరిష్ఠంగా ఐదుగురు క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను తీసుకునేందుకు అవకాశం కల్పించింది. విదేశీ ఆటగాళ్ల రిటెన్షన్‌పై ఎలాంటి పరిమితి విధించలేదు. టీమ్ పర్స్ వాల్యూను రూ. 120 కోట్లకు పెంచారు. ఆరుగురి ఆటగాళ్లను నేరుగా రిటైన్ అయినా చేసుకోవచ్చు లేదా ఆర్‌టిఎమ్ కార్డ్ ద్వారా అయినా తీసుకోవచ్చు. రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు వరుసగా రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు, రూ. 11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, ఐదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు చెల్లించాలి. అక్టోబర్ 31లోపు రిటెన్షన్ జాబితాలను సమర్పించాలని 10 ఫ్రాంచైజీలను బిసిసిఐ ఆదేశించింది. దాంతో ఫ్రాంచైజీలన్నీ రిటెన్షన్ లిస్ట్‌పై ఫోకస్ పెట్టాయి. విదేశీ ఆటగాళ్ల రిటెన్షన్‌పై పరిమితి విధించవద్దని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ చేసిన రిక్వెస్ట్‌ను బిసిసిఐ పరిగణలోకి తీసుకోవడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. ఈ ఏడాది డిసెంబర్‌లో మెగా వేలం జరగనుండగా.. టీమ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను తొలి ఆటగాడిగా రూ. 18 కోట్లకు అట్టిపెట్టుకోనుంది. టీమ్ కెప్టెన్‌గా... బౌలర్‌గా.. బ్యాటర్‌గా ప్యాట్ కమిన్స్ సన్‌రైజర్స్‌కు కీలకం కానున్నాడు. రెండో ప్లేయర్‌గా విధ్వంసకర బ్యాటర్ కమ్ వికెట్ కీపర్ హెన్రీచ్ క్లాసెన్‌ను రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకోవచ్చు. అయితే రెండో ప్లేయర్‌గా ట్రావిస్ హెడ్‌ను కూడా పరిగణ లోకి తీసుకోవచ్చు. కానీ వేలంలో అతను రూ. 10 కోట్ల కంటే ఎక్కు వ ధర పలికే అవకాశం లేదు కాబట్టి అతని కోసం రిటెన్షన్ కార్డ్ ఉపయోగించవచ్చు. మూడో ప్లేయర్‌గా రూ. 11 కోట్లు విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మను సన్‌రైజర్స్ రిటైన్ చేసుకోనుంది. ట్రావిస్ హెడ్‌తో పాటు యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి కోసం ఆర్‌టీఎమ్ కార్డ్ ఉపయోగించనున్నారు. ఈ ఇద్దరిని రూ. 25 కోట్లలోపు తీసుకోవాలనే కావ్య మారన్ వ్యూహం. ముగ్గురు ప్లేయర్లను నేరుగా.. మరో ముగ్గురి కోసం రిటెన్షన్ కార్డ్ వాడుకోవచ్చు.

# రీల్



## 'అఖండ 2' లేటెస్ట్ అప్ డేట్

**బా**లయ్య – బోయపాటి శ్రీను కాంబినేషన్లో వచ్చిన అఖండ అద్భుత విజయాన్ని సాధించింది. దీంతో 'అఖండ 2' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐతే, ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు అంటూ బాలయ్య ఫ్యాన్స్ పోస్ట్ లు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చివరి దశలో ఉంది. డిసెంబర్ లో ఈ సినిమా షూటింగ్ ను స్టార్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో బాలయ్య పాత్ర తాలూకు పరిచయ షాట్స్ ను తీస్తారట. మొత్తానికి ఈ సినిమా కోసం బాలయ్య ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బోయపాటి శ్రీను ఇప్పటికే 'అఖండ 2' స్క్రిప్ట్ పూర్తి చేశాడు. ప్రస్తుతం డైలాగ్ వెర్షన్ పై కసరత్తులు చేస్తున్నారు. కాగా 'అఖండ 2' లో బాలీవుడ స్టార్ సంజయ్ దత్ కూడా ఓ కీలక పాత్రలో నటించబోతునట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. డైరెక్టర్ బాబీతో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.

## ఆలియా 'జిగ్రా' కు ముగ్గురు స్టార్స్..



**బా**లీవుడ స్టార్ బ్యూటీ ఆలియా భట్ నటించిన లేటెస్ట్ మూవీ 'జిగ్రా' దసరా కానుకగా నేషన్‌వైడ రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సినిమాతో ఆలియా మరోసారి బ్లాక్‌బస్టర్ హిట్ కొడుతుందని ఆమె అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇక ఈ సినిమాలో ఆలియా చేసే యాక్షన్ స్టంట్స్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయని చిత్ర యూనిట్ చెబుతోంది. కాగా, ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ప్రమోషన్స్‌కి చిత్ర యూనిట్ పక్కా ప్లానింగ్ చేస్తోంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో అక్టోబర్ 8న సాయంత్రం 4 గంటల నుంచి పార్క్ హయత్ హోటల్‌లో నిర్వహించనున్నారు. కాగా, ఈ ఈవెంట్‌కి ముగ్గురు స్టార్ సెలెబ్రిటీలు గెస్టులుగా రానున్నారు. టాలీవుడ హల్క్ రానా దగ్గుబాటి, స్టార్ బ్యూటీ సమంత, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కి హాజరవుతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దీంతో ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇక ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 11న రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు.

## 'ఓదెల-2'.. తమన్నా! ఎంటర్



**టా**లీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ సీక్వెల్ చిత్రాల్లో 'ఓదెల 2' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని దర్శకుడు అశోక్ తేజ డైరెక్ట్ చేస్తుండగా సంపత్ నంది ఈ చిత్రానికి కథను అందిస్తున్నాడు. ఇక ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్, బిహైండ ది సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే, ఇప్పుడు ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభించినట్లుగా చిత్ర యూనిట్ తెలిపింది. ఓదెల గ్రామంలో ఈ చిత్ర ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో స్టార్ బ్యూటీ తమన్నా జాయిన్ అయ్యింది. ఆమె ఈ సినిమాలో శివశక్తి(నాగ సాధు) పాత్రలో అదిరిపోయే పర్ఫార్మెన్స్ ఇస్తోంది. ఇక ఈ ఫైనల్ షెడ్యూల్‌ని వీలైనంత త్వరగా ముగించేయాలని మేకర్స్ చూస్తున్నారు. అటుపై పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా ముగించాలని మేకర్స్ భావిస్తున్నారు. ఇక ఈ సినిమాలో హెబ్బా పటేల్, వశిష్ట సింహా తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.

# గాంధీ వారసత్వాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గం !

### ' అఖిల భారత సర్వ సేవా సంఘ్' మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్.




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తర్ ప్రదేశ్ బిజెపి ప్రభుత్వం అభివృద్ధి పేరట వారణాసిలోని గాంధీ సామాజిక సేవా సంస్థ అఖిల భారత సర్వ సేవా సంఘానికి చెందిన 12 వారసత్వ భవనాలను కూల్చివేయడం అంటే గాంధీ వారసత్వాన్ని చేయడమేనని ఇది దుర్మార్గమని అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ అన్నారు. వారణాసిలో గాంధీ సామాజిక సేవా సంస్థ, అఖిల భారత సర్వ సేవా సంఘ్ భవనాల కూల్చివేతలను నిరసిస్తూ తెలంగాణ సర్వోదయ మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్, నాంపల్లిలోని మండలి రాష్ట్ర కార్యాలయం లో మంగళవారం న్యాయం కోరుతూ కొవ్వతులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో షేక్ హుస్సేన్ తోపాటు సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్, కార్యదర్శులు రామ్ మోహన్, రూప్ సింగ్, ఉపాధ్యక్షులు కె. చందు, కోశాధికారి గోపాల్ రావు,యువ విభాగం అధ్యక్షులు బి. భాస్కర్, మహిళా విభాగం అధ్యక్షురాలు యాదమ్మ, కార్యవర్గ సభ్యులు లతా, సుజాత, ఎస్. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా షేక్ హుస్సేన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆలోచనలు, తత్వాలను ప్రచారం చేయడానికి స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య వినోబా భావే 1948లో వారణాసిలో 12 ఎకరాల భూమిలో గాంధీ సామాజిక సేవా సంస్థ, సర్వ సేవా సంఘాన్నిస్థాపించారని, ఇందులో మహాత్మా గాంధీ విగ్రహంతోపాటు పబ్లికేషన్ హౌస్, సర్వ సేవా సంఘ్ ప్రకాశన్, సామాజికఆర్థికంగా బలహీన వర్గాల పిల్లలకు ఉచిత ప్రీస్కూల్, గెస్ట్ హౌస్, లైబ్రరీ, మీటింగ్ హాల్, నేచురోపతి సెంటర్), యువ శిక్షణ కేంద్రం, ఖాదీ భండార్ వంటి నిర్మించారని వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వం ఆధ్యాత్మికత అభివృద్ధిలో భాగంగా ఈ వారసత్వ భవనాలను కూల్చి వేసి, మహాత్మా గాంధీ, వినోబా భావే, జయప్రకాశ్, దాదా ధర్మాధికారి, నారాయణ్ దేశాయ్, జెసి కుమారప్ప, ధీరేంద్ర మజుందార్, శివానంద, జే కృష్ణమూర్తి వంటి ప్రముఖుల విలువైన సాహిత్య వారసత్వాన్ని ధ్వంసం చేయడం అన్యాయం అని అయన అన్నారు. కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు తక్షణమే బాధ్యత వహించి గాంధీ సామాజిక సేవా సంస్థ, సర్వ సేవా సంఘ్ భవనాలను అక్కడే పునర్నిర్మించి న్యాయం చేయాలనీ షేక్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ గాంధీ వారసత్వాన్ని లాక్కోవడానికి, నాశనం చేయడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఇందులో భాగంగానే గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం, వారణాసిలోని గాంధీ సామాజిక సేవా సంస్థ, సర్వ సేవా సంఘ్ భవనాలను కూల్చివేసిందని మండిపడ్డారు. వారసత్వ భవనాలను బుల్డోజర్లతో కూల్చివేయడం, అడ్డుకున్న గాంధేయవాదులను అదుపులోకి తీసుకొని పోలీసుల పహారా పెట్టి తమ పని చేసుకోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే వారణాసి గాంధీ సామాజిక సేవా సంస్థ, సర్వ సేవా సంఘ్ భవనాలను పునర్నిర్మించి సర్వ సేవా సంఘ్ కు అప్పజెప్పాలని అజీజ్ పాషా డిమాండ్ చేశారు.




## దసరా బోనస్ రూ.50వేలు ప్రకటించాలి : ఆర్‌టిసి జెఎసి డిమాండ్

**ప్రజాపక్షం /హదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసి గ్యారేజి, సెక్యూరిటీ సిబ్బందికి 2013 వేతన సవరణ ఏరియర్స్ బాండ్ డబ్బులు చెల్లించడం పట్ల టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎడిసి,కంట్రోలర్స్,సూపర్ వైజర్స్, ఆఫీస్ సిబ్బందితో పాటు మిగితా ఉద్యోగులందరికీ కూడా దసరా పండగకు ముందుగానే బాండ్ డబ్బులు చెల్లించాలని ప్రభుత్వ, యాజమాన్యాలను చైర్మన్ ఈదుర వెంకన్న వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి లు కోరారు. సింగరేణి సంస్థలో లాభాలు వొచ్చినందుకు వారికి ఒక్కరికి రూ.2లక్షలు దసరా బోనస్ ఇస్తున్న ఈ ప్రభుత్వం 2024 సంవత్సరం ఆర్టీసీ సంస్థ కు కూడా లాభాలు వచ్చాయని, ఆర్టీసీ ఉద్యోగులకు కూడా దసరా బోనస్ కనీసంరూ. 50 వేలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

## ఐదుగురు రష్యన్ పర్వతారోహకులు మృతి

(3వ పేజీ తరువాయి)

వ్లదిమిర్ చిస్టికోవ్, మిఖాయిలన్ నొసెంకో, దిమిత్రీ శ్విలెవోయ్‌లుగా గుర్తించారు. బేస్ క్యాంప్ నుంచి ఉదయం 6 గంటల ప్రాంతంలో వారు సంబంధాలను కోల్పోయారు. వారంతా 8,167 మీటర్ల ఎత్తును ఒకే తాడుతో అధిరోహించేందుకు బయలుదేరారని , అనంతరం తప్పిపోయారని షేర్పా పిటిఐకి తెలిపారు. వెంటనే రెస్క్యూ హెలికాప్టర్ రంగంలో దిగిందని, 7, 700 మీటర్ల ఎత్తులో వారి భౌతికకాయాలను కనుగొన్నట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా సోమవారం రక్షణ ఆపరేషన్ చేపట్టలేపోయారని నేపాల్ టూరిజం డైరెక్టర్ రాకేశ్ గురంగ్ తెలిపారు. అదే సమయంలో ఒక రష్యన్ అధిరోహకుడిని బేస్ క్యాంప్ వద్ద కాపాడి, తీసుకువచ్చినట్లు తెలిపారు. భౌతికాయాలను 7,700 మీట్లర నుంచి కిందికి ఎలా తీసుకురావాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు పోలాండ్‌కు చెందిన పర్వతారోహకురాలు సొవినస్కా అగ్నిస్జెకా (23) ఉత్తర నేపాల్‌లోని సుర్యకుందా ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తూ సోమవారం రాత్రి మరణించారు.

## ఫిజిక్స్‌లో నోబెల్

(3వ పేజీ తరువాయి)

లెర్నింగ్ టెక్నిక్‌లు సృష్టించినట్లు నోబెల్ కమిటీ తెలిపింది. సమాచారాన్ని స్టోర్ చేసి, రీ కన్‌స్ట్రక్ట్ చేసే విధానాన్ని జాన్ హోప్‌ఫీల్డ్ సృష్టించినట్లు కమిటీ వెల్లడించింది. డేటాలో ఉన్న వివిధ ప్రాపర్టీల గురించి జెఫ్రీ హింటన్ ఓ విధానాన్ని డెవలప్ చేశారు. ఆ విధానం ద్వారా ప్రస్తుతం వినియోగంలో ఉన్న కృత్రిమ న్యూరల్ నెట్‌వర్క్‌ను అమలు చేయవచ్చు అని కమిటీ తెలిపింది. గత ఏడాది ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్ పురస్కారం దక్కింది. 2023లో శాస్త్రవేత్తలు అన్నే ఎల్ హుయిలైర్, పీరీ అగోస్టిని, క్రాజ్‌లు ఆ అవార్డు అందుకున్నారు. ఎలక్ట్రాన్ల వేగంపై అధ్యయనం చేసినందుకు వాళ్లకు ఆ బహుమతి దక్కింది. కణంలోని చిన్న ఎలక్ట్రాన్లు ఎలా కేంద్రకం చుట్టు భ్రమిస్తాయన్న విషయాన్ని వాళ్లు తేల్చారు. ఇక సోమవారం నోబెల్ కమిటీ.. మెడిసిన్‌లో ఈ యేటి విజేతలను ప్రకటించింది. మైక్రో ఆర్‌ఎన్‌ఏను ఆవిష్కరించిన అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లకు ఆ పురస్కారం దక్కిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 224 మందికి ఫిజిక్స్‌లో నోబెల్ ఇచ్చారు. . బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యం విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11లక్షల స్వీడిష్ క్రోనర్ (10లక్షల డాలర్లు) నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com